సురవరం సుధాకరరెడ్డి
వ్యాసాలు – లేఖలు
రూ॥200/- పేజీలు:290

నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

ప్రజాస్వామ్యాన్ని రక్షించి, రాజ్యాంగాన్ని కాపాడతా
'ఇండియా' ఉపరాష్ట్రపతి అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి ప్రతిజ్ఞ


ధర్మస్థలలో మృతదేహాల ఖననం కేసు.. ఫిర్యాదుదారుడు అరెస్టు 05

సంపుటి 28, సంచిక: 65 | ఆదివారం | 24-08-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00

ప్రభుత్వ అధికార లాంఛనాలతో

# నేడు సుధాకరరెడ్డికి తుది వీడ్కోలు

హాజరుకానున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, పలు పార్టీలకు చెందిన ప్రముఖ నేతలు





బివి. విజయలక్ష్మి ని పరామర్శించిన కెవిపి

ప్రజాపక్షం/హైదరాబాద్

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపి సురవరం సుధాకర్‌రెడ్డి అంతిమ వీడ్కోలు ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో ఆదివారం హైదరాబాద్‌లో జరగనున్నాయి. హైదరాబాద్‌లో శుక్రవారం రాత్రి కన్నుమూసిన సురవరం సుధాకర్ రెడ్డి భౌతికకాయాన్ని ఆదివారం ఉదయం 9 గంటలకు గచ్చిబౌలిలోని కేర్ ఆసుపత్రి నుంచి హిమాయత్‌నగర్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌కు తరలిస్తారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మఖ్దూంభవన్‌లో ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు, అభిమానులు, సిపిఐ శ్రేణులు, ప్రజల సందర్శనార్థం సుధాకర్ రెడ్డి భౌతిక కాయం ఉంచబడుతుంది. మధ్యాహ్నం 3 గంటలకు సుధాకర్ రెడ్డి భౌతికకాయానికి ప్రభుత్వం తరపున అధికారిక లాంఛనాలతో నివాళులు అర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు మఖ్దూంభవన్ నుంచి ముషీరాబాద్‌లోని గాంధీ మెడికల్ కాలేజీకి వరకు సుధాకర్ రెడ్డి అంతిమయాత్ర జరుగుతుందని, సాయంత్రం 5 గంటలకు సుధాకర్ రెడ్డి భౌతికకాయాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనల నిమిత్తం మెడికల్ కాలేజీకి అప్పగించనున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు చెప్పారు. అంతిమయాత్రలో అన్ని జిల్లాల నుంచి సిపిఐ నాయకులు, కార్యకర్తలు ఎర్ర చొక్కాలు, మహిళలు ఎర్ర చీరలు ధరించి అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన సూచించారు.

**అంతిమ వీడ్కోలులో పాల్గొననున్న ప్రముఖులు**

మఖ్దూంభవన్‌లో సురవరం సుధాకర్ రెడ్డికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్‌కుమార్ గౌడ్, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సిపిఐ జాతీయ కార్యదర్శులు బినోయ్ విశ్వం, గిరీష్ శర్మ, సిపిఐ రాజ్యసభ సభ్యులు సందోష్, సిపిఐ బిహార్ రాష్ట్ర కార్యదర్శి రాంనరేష్ పాండే, సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్,

తరువాయి 2లో

**వామపక్ష పార్టీలు, శక్తుల ఐక్యతకు కృషిచేసిన సురవరం**
సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో

02

ఆదివారం ఉదయం 9 గంటలకు గచ్చిబౌలిలోని కేర్ ఆసుపత్రి నుంచి మఖ్దూంభవన్‌కు భౌతికకాయం తరలింపు.

ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రజల సందర్శనార్థం సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో ఉంచబడుతుంది.

మధ్యాహ్నం 3 గంటలకు ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నివాళి.

మధ్యాహ్నం 3:10 గంటలకు ముషీరాబాద్‌లోని గాంధీ మెడికల్ కాలేజీకి వరకు అంతిమయాత్ర.

సాయంత్రం 5 గంటలకు భౌతికకాయం వైద్య విద్యార్థుల పరిశోధనల నిమిత్తం మెడికల్ కాలేజీకి అప్పగింత.

# డొనాల్డ్ ట్రంప్‌కు మోదీ దాసోహం

- నక్సలైట్ల అంతం పేరుతో గిరిజనుల హత్య
- వ్యక్తులను హతమార్చినా సిద్ధాంతాలను చంపలేరు
- కార్పొరేట్లకు ప్రభుత్వ సంస్థలు, భూముల అప్పగింత
- సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- ఒంగోలులో ఘనంగా 28వ ఎపి రాష్ట్ర మహాసభలు

**ఒంగోలు :** అంతర్జాతీయంగా దేశాల మధ్య ఘర్షణలు సష్టించి... రెండు దేశాలకు ఆయుధాలు సరఫరా చేసి... యుద్ధాలను ప్రోత్సహిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ప్రధాని నరేంద్ర మోదీ దాసోహమయ్యారని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోకూడదని, అలా చేస్తే సుంకాలు పెంచుతామని భారత దేశాన్ని ట్రంప్ బ్లాక్‌మెయిల్ చేస్తుంటే... ఎందుకు ప్రశ్నించడం లేదో మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 28వ మహాసభలు ఒంగోలు నగరంలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా నగరంలోని పురవీధులలో ఎర్ర సైన్యం మహా ప్రదర్శన నిర్వహించింది. అనంతరం గుజ్జుల యలమందారెడ్డి, సరళాదేవి ప్రాంగణంలో జరిగిన బహిరంగ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య అధ్యక్షత వహించారు. తొలుత సురవరం సుధాకరరెడ్డి చిత్రపటానికి నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బహిరంగ సభలో నారాయణ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోదీ... 11 ఏళ్లలో 22 కోట్ల ఉద్యోగాలు ఇవ్వకపోగా... కోట్లాది ఉద్యోగాలు ఊడగొట్టారని మండిపడ్డారు. స్విస్ బ్యాంకు నుంచి నల్లధనాన్ని తీసుకువచ్చి ప్రతి ఒక్కరికీ రూ.15 లక్షలు ఖాతాల్లో వేస్తామని మోసం చేశారన్నారు. నక్సలైట్లను అంతం చేస్తామని పంతం పట్టిన మోదీ సర్కారు... గిరిజనులను

తరువాయి 5లో



## దేశం గొప్ప నాయకుడిని కోల్పోయింది

సురవరం సుధాకర్ రెడ్డి మరణించారనే విషాద వార్త చాలా బాధ కలిగించింది. ఆయన అత్యంత నిబద్ధత కలిగిన, ఆదర్శవంతమైన కమ్యూనిస్టు. చివరి దాకా అలాగే కొనసాగారు. అన్నింటికంటే మించి ఆయన మానవత్వం, ప్రేమ కలిగిన గొప్ప మనిషి. దేశం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయింది. తెలంగాణ తన అగ్ర నాయకులలో ఒకరిని కోల్పోయింది.

**– జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి**

## దేశ,రాష్ట్ర రాజకీయాలలో ప్రత్యేక అధ్యాయం

సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శిసురవరం సుధాకర్ రెడ్డి తుది శ్వాస విడిచారని తెలిసి ఎంతో విచారించాను. సురవరం జీవితాంతం తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఎంతో నిబద్ధతతో ప్రజాసేవకు అంకితమయ్యారు. విలువలతో కూడిన రాజకీయాలకు కట్టుబడ్డారు. దేశ, రాష్ట్ర రాజకీయాల్లో తనదైన శైలితో ఒక ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించుకున్నారు.

**– మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు**

## న్యాయం కోసం జరిగే పోరాటానికి స్ఫూర్తిప్రదాత

విద్యార్థి నాయకుడిగా, పార్లమెంటు సభ్యుడిగా, సిపిఐ జాతీయ నాయకుడిగా సుధాకర్ రెడ్డి తన జీవితాన్ని శ్రామికులు, రైతులు, అణగారిన వర్గాల కోసం అంకితం చేశారు. కూటమి పొత్తులపై చర్చలు కోసం, తలైవార్ కలైజ్ఞర్ కరుణానిధి స్మారక కార్యక్రమానికి హాజరయ్యేందుకు సహా అనేక పర్యాయాలు తమిళనాడు పర్యటించినప్పుడు ఆయన ఆత్మీయత, భావస్పష్టతను తాను వ్యక్తిగతంగా చవి చూశాను. ఆయన జీవితం న్యాయం, గౌరవం కోసం జరిగే పోరాటానికి నిరంతరం స్ఫూర్తిని ఇస్తుంది. సురవరం కుటుంబ సభ్యులు, సహచరులు, కామ్రేడ్‌లకు నా ప్రగాఢ సానుభూతి.

**– తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్**

# ప్రజాభిమానం చూరగొన్న మహానేత



ప్రజాపక్షం/హైదరాబాద్

అన్ని రాజకీయ పార్టీల అభిమానాన్ని, అందరి ప్రేమను పొందిన గొప్ప కమ్యూనిస్టు సురవరం సుధాకర్ రెడ్డి అని పలువురు సిపిఐ నాయకులు కొనియాడారు. అణగారిన వర్గాల కోసం అనేక సామాజిక ఉద్యమాలు నిర్వహించి, జీవితాంతం పేదల కోసం పరితపించిన మహనీయుడని అన్నారు. సురవరం ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృతనిశ్చయంతో పనిచేస్తామన్నారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో శనివారం కన్నుమూసిన సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకటరెడ్డి, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు, సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు, ఇ.టి.నరసింహ, సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, కె.శ్రీనివాస రెడ్డి, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంత రావు, కలవేన శంకర్, వి.ఎస్.బోస్, కార్యవర్గ సభ్యులు కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు కమతం యాదగిరి, ముదుపు ప్రభాకర్ రెడ్డి, ఎం.అనిల్ కుమార్, కసిరెడ్డి మణికంఠ రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సిపిఐ కార్యాలయం మఖ్దూంభవన్ పునర్ నిర్మిత

తరువాయి 2లో

## నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు నేత

ప్రముఖ పార్లమెంటేరియన్, నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు నాయకుడు, నిత్యం కార్మికులు, సామాన్య ప్రజల కోసం పోరాడే నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి. ఆయన మరణవార్త తీవ్ర బాధ కలిగించింది. ఆయన మరణం తీరని నష్టం.

**– కేరళ సిఎం పినరాయి విజయన్**

## విలువలతో రాజీపడని సురవరం

సురవరం మరణ వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. అనునిత్యం ప్రజల గురించి ఆలోచించి వారికోసమే పని చేసే సుధాకర్ రెడ్డి ఇక లేరు అంటే నమ్మలేకపోతున్నాను. సమకాలీన రాజకీయ నాయకుడిగా ఆయనతో కలిసి పని చేశాను. పార్టీలో అంచెలంచలుగా ఎదిగి సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి స్థాయికి చేరారు. ఏ పదవిలో ఉన్నా విలువలతో రాజీపడకుండా పని చేశారు.

**– ఎపి సిఎం చంద్రబాబు నాయుడు**

## దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర

సురవరం సుధాకర్ రెడ్డి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుంచి జాతీయ స్థాయి నేతగా ఎదిగారు. వామ పక్ష ఉద్యమాలు, ఎన్నో ప్రజాపోరాటాల్లో పాలు పంచుకున్నారు. రెండుసార్లు నల్లగొండ పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికైన కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి గొప్ప నాయకుడు. దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన గొప్ప నాయకున్ని కోల్పోయాం.

**– సిఎం రేవంత్ రెడ్డి**

## ఎన్నో ప్రజాపోరాటాలు, ఉద్యమాలు

సురవరం సుధాకర్ రెడ్డి ఒక కొండ్రవుపల్లి అనే మారుమూల పల్లెలో జన్మించి, సిపిఐలో జాతీయ స్థాయి నేతగా ఎదిగారు. ఎన్నో ప్రజా పోరాటాలు, ఉద్యమాలు చేపట్టారు.

**– డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క**

## తుది శ్వాస వరకూ పీడిత వర్గాలతోనే

సురవరం సుధాకర్ రెడ్డి 'సౌమ్యుడు, మృదుస్వభావి పీడిత వర్గాల అభివృద్ధి కోసం తుది శ్వాస వరకు పని చేసిన నాయకుడు. సామాన్య కార్యకర్తగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించి జాతీయ పార్టీకి కార్యదర్శిగా పనిచేయడం వారి వ్యక్తిత్వానికి పనితనానికి నిదర్శనం. తెలుగువారికి గర్వకారణం'.

**– కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

## తెలంగాణ మట్టి బిడ్డ

పీడిత వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసే కమ్యూనిస్టు పార్టీ నేతగా, తన జీవితకాలం కృషి చేసిన తెలంగాణ మట్టి బిడ్డ సురవరం. మార్క్సిస్టు ప్రజానేతగా గొప్ప పేరు సంపాదించుకున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో సురవరంతో మాకు ఎంతో అనుబంధం ఉంది.

**– ప్రతిపక్షనేత కెసిఆర్**

# ఆ తీర్పు సుప్రీంకోర్టుది...

- నాది కాదు : జస్టిస్ సుదర్శన్‌రెడ్డి
- సల్వా జుడుం తీర్పుపై అమిత్ షా ఆరోపణలను తిప్పికొట్టిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి



**న్యూఢిల్లీ :** సల్వా జుడుం తీర్పుపై హోంమంత్రి అమిత్ షా చేసిన విమర్శలకు ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బి. సుదర్శన్ రెడ్డి ఘాటుగా ప్రతిస్పందించారు. ఆ తీర్పు సుప్రీంకోర్టు వెలువరించిందని, తాను వ్యక్తిగతంగా ఇచ్చిన తీర్పు కాదని స్పష్టం చేశారు. శనివారం సుదర్శన్‌రెడ్డి పిటిఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ సల్వా జుడుంపై

తరువాయి 2లో



ఇంకా 62,473 మెట్రిక్ టన్నుల

# యూరియా అందలేదు

మంత్రి తుమ్మల స్పష్టీకరణ
ఆర్ఎఫ్‌సిఎల్ సిఇఒతో చర్చలు
ఆందోళన వద్దు : మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన యూరియా కోటలో ఇంకా 62,473 మెట్రిక్ టన్నులు అందలేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆర్ఎఫ్‌సిఎల్ సిఇఒ అలోక్ సింగాల్, ఎన్ఎఫ్‌సిఎల్ సేల్స్ మేనేజర్ రాజేశ్‌లకు స్పష్టం చేశారు. రాష్ట్ర సచివాలయంలో ఈ ఇద్దరు అధికారులతో తుమ్మల సమావేశమై యూరియా సరఫరాపై సుదీర్ఘంగా తుమ్మల చర్చించారు. రాష్ట్రానికి సరఫరా ఆలస్యమవ్వడంతో రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారని మంత్రి తెలిపారు. రైతుల పంటలపై ప్రతికూల ప్రభావం

తరువాయి 2లో

# మూసీకి మోక్షం

ఎంఆర్‌డి ప్రాజెక్టుకు రూ.375 కోట్లు విడుదల



ప్రజాపక్షం/హైదరాబాద్

మూసీ ప్రక్షాళణకు తెలంగాణ సర్కార్ తొలి అడుగు వేసింది. ఈ నేపథ్యంలోనే మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్టు (ఎంఆర్‌డిపి)కు 2024–05 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్లో కేటాయించిన రూ.375 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ శనివారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. మూసీ నది ప్రక్షాళనను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సర్కార్ భాగంగా ఇప్పటికే నది పరీవాహక ప్రాంతాల్లో ఉన్న నిర్మాణాలను ఇప్పటికే సంగం వరకు

తరువాయి 2లో



# ఉపాధ్యాయుడే కుట్రదారుడు

- తాగునీటిలో పురుగులమందు కలిపిన టీచర్
- 13 మంది విద్యార్థులకు అస్వస్థత
- భూపాలపల్లి జిల్లాలోని గాంధీనగర్ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఘటన
- ఉపాధ్యాయుడితో పాటు మరో ముగ్గురు సస్పెన్షన్

ప్రజాపక్షం/భూపాలపల్లి

ఉపాధ్యాయులు ఎస్‌ఓల మధ్య లొల్లి విద్యార్థుల ప్రాణాల మీదికి తెచ్చింది. కలుషిత నీరు తాగి 13 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఘటన భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సుభాష్ కాలనీ గాంధీనగర్ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో జరిగినట్లు తెలిసింది. వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాస్పిటల్‌కి వెళ్లి

తరువాయి 2లో




# ప్రపంచం
WORLD NEWS

## కాంగో మాజీ అధ్యక్షుడు కబిలాకు మరణశిక్ష

**కిన్షాసా:** మాజీ అధ్యక్షుడు జోసెఫ్ కబిలా (54)కు మరణశిక్ష విధించాలని డి.ఆర్.కాంగో ఉన్నతస్థాయి మిలిటరీ కోర్టులో విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ విజ్ఞప్తి చేశారు. సెంట్రల్ ఆఫ్రికాదేశం కాంగోను 2001 నుంచి 19 సవత్సరాలపాటు జోసెఫ్ కబిలా మూడు విడతలుగా పరిపాలించారు. రెండో కాంగో యుద్ధంలో తండ్రి లారెంట్ కబిలా హత్యకు గురికావడంతో ఆయన సలహాదారుల చొరవతో కుమారుడు జోసెఫ్ కబిలా అతి చిన్నవయసులో దేశాధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. ఆయన పరిపాలనా కాలంలో దేశంలో అనేక దుర్మార్గాలు ఆయన ప్రోత్సాహంతోనే జరిగాయని, వాటన్నింటి వెనుక సూత్రధారి ఆయనే అని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించారు. రెండు సంవత్సరాలక్రితం జోసెఫ్ కబిలా దేశం నుండి పారిపోయారు. ఎం–23 తిరుగుబాటు ఉగ్రవాదులు కూడా భాగస్వామిగా ఉన్న కాంగో రివర్ అలయెన్స్ (అలయెన్స్ ఫ్లూవ్ కాంగో—ఎఎఫ్‌సి), ఆక్రమిత ప్రాంతాలలో ఉన్న ప్రజలను ఆయన ఊచకోత కోయించని, ఆయన హయాంలో అత్యాచారాలు, క్రూరమైన బహిష్కరణలు జరిగాయనిమిలిటరీ ఆడిటర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ లికులియా బకుమి లూసియన్ రెనే కోర్టుకు తెలియజేశారు. ఐతే జోసెఫ్ కబిలా ప్రస్తుతం పరారీలో ఉన్నారు.

# ట్రంప్ వ్యాఖ్యలతో బందీల కుటుంబాల్లో నిరాశ

**• నెతన్యాహూ ఇంటిముందు నిరసన ప్రదర్శన • అనేక జాతీయ రహదారులపై షబ్బాత్ టేబుల్స్ దగ్ధం**





**జెరూసలెం:** గాజాలో ఇరవైకంటే తక్కువమంది బందీలు మాత్రమే సజీవులుగా ఉన్నారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు బందీల కుటుంబీకులపై తీవ్ర ప్రభావం చూపించాయి. తీవ్ర నిరాశానిస్పృహలకు గురైన బందీల కుటుంబీకులు, వారి బంధువులు,మిత్రులు మళ్ళీ వీధుల్లోకి వచ్చారు. బందీల విడుదలకు హమాస్‌తో ఒక ఒప్పందం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ జెరూసలెంలో ఇజ్రాయెలీ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ నివాసం వద్ద ప్రజలు పెద్దయెత్తున గుమిగూడి నిరసన ప్రదర్శన జరిపారు. అసలు ఎంతమంది ఇజ్రాయెలీ బందీలు గాజాలో హమాస్ ఉగ్రవాదులవద్ద సజీవంగా ఉన్నారో స్పష్టంగా తేల్చిచెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయంపై తాజా గణాంకాలను విడుదల చేయాలని బందీల కుటుంబీకులు, బంధువుల వేదిక డిమాండ్ చేసింది. నెతన్యాహూ షబ్బాత్ టేబుల్ (పవిత్ర నైవేద్య ఆహారం ఉంచిన వేదిక)ను వదిలిపెట్టి సంప్రదింపుల వేదికవద్దకు వెళ్ళి బందీలను విడుదల చేయాలని నినాదాలు చేశారు. అనేక జాతీయ రహదారులపై షబ్బాత్ టేబుల్ ఏర్పాటు చేసి వాటిని అగ్నికి ఆహుతిచేసి నిరసన తెలియజేశారు. ఉత్తర ఇజ్రాయెల్‌లోని ఎల్యాంకిమ్ ఇంటర్‌ఛేంజ్ వద్ద ప్రధానంగా భారీస్థాయిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ వేదిక నాయకత్వంలో దేశవ్యాప్తంగా అనేక జాతీయ రహదారులుపై నిరసన ప్రదర్శనలు జరిగాయి. దేశవ్యాప్తంగా మరోసారి వచ్చే మంగళవారం నాడు నిరసన ప్రదర్శన చేపడతామని బందీల కుటుంబాల వేదిక ప్రకటించింది. ట్రంప్ వాషింగ్టన్‌లో పాత్రికేయులతో మాట్లాడుతూ, గాజాలో హమాస్ వద్ద ఇరవైమందికంటే తక్కువమంది బందీలు సజీవంగా ఉన్నారని వ్యాఖ్యానించడంతో తీవ్ర ఆందోళనకు గురికావలసి వచ్చింది. బందీల బాధ తీవ్ర నిరాశ నిస్పృహల్లో కూరుకుపోయారు. 2023 అక్టోబరు 7వ తేదీన హమాస్ ఉగ్రవాదులు ఒక సంగీతోత్సవంపై దాడిచేసి విచ్చలవిడిగా జరిపిన కాల్పుల్లో 1200 మంది మరణించగా మరో 250 మందిని బందీలుగా తీసుకుపోయారు. వీరిలో కొంతమంది విడుదల కాగా అనేకమంది వారివద్దే మరణించారు. ప్రస్తుతం ఇంకా 50 మంది బందీలు హమాస్ వద్ద ఉన్నారని మొన్న మొన్నటివరకూ నెతన్యాహూ చెబుతూ వచ్చారు. ఐతే వీరిలో సగంమంది మాత్రమే సజీవులుగా ఉండి ఉంటారని ఇజ్రాయిల్ ప్రభుత్వం అంచనావేస్తోంది. కానీ ట్రంప్ మాత్రం 20 మంది బందీలే ఉన్నారని, వీరిలో కూడా ఇప్పుడు ఇద్దరు తగ్గిపోయారని వ్యాఖ్యానించారు. ఈజిప్టు, ఖతార్ మధ్యవర్తిత్వంలో చేస్తున్న తీవ్ర ఒత్తిడిపై నాలుగు రోజులక్రితం హమాస్ ప్రతినిధులు 60 రోజుల కాల్పుల విరమణకు, 10 మంది సజీవులైన బందీలను మరో 18 మంది నిర్జీవులైన బందీల విడుదలకు అంగీకరించింది. కానీ నెతన్యాహూ ఈ ప్రతిపాదన తిరస్కరించి గాజా సిటీ ఆక్రమణకు కొత్త ప్రణాళికను ఆమోదించి సరికొత్త యుద్ధం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ట్రంప్ మాట్లాడుతూ, తాను అధికారం చేపట్టినప్పుడు 150 మంది బందీలు ఉండగా, తన ప్రమేయం వల్ల 100 మంది బందీలు విడుదలయ్యారని, మరో 50 మంది బందీలలో 28 మంది బందీలను ఉగ్రవాదులు కాల్చి చంపారని ఐడిఎఫ్ నిర్ధారించింది. ట్రంప్ తాజా లెక్కల ప్రకారం 18 మంది బందీలు మాత్రమే సజీవంగా ఉన్నారు.

## మూసీకి మోక్షం (మొదటి పేజీ తరువాయి)

తొలగించారు. ప్రస్తుతం మూసీ నదిలో పేరుకుపోయిన చెత్తను తొలగించే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. తాజాగా నిధుల విడుదలతో మూసీ ప్రక్షాళన మరింత వేగం పుంజుకునే అవకాశం ఉంది.అయితే, మూసీ సుందరీకరణకు గాను రూ.4,100 కోట్ల రుణం ఇచ్చేందుకు ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంక్ (ఎడిబి) ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. మూసీ సుందరీకరణ, ప్రక్షాళన కోసం నియమించిన మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ అధికారులు రాష్ట్రానికి వచ్చిన ఎడిబి టీమ్‌కు మూసీ ప్రక్షాళనతో పాటుగా చేపట్టబోయే పర్యావరణ కార్యక్రమాల గురించి కూడా వివరించారు. దీంతో మూసీ ప్రక్షాళనకు నిధులు విడుదలకు కూడా లైన క్లియర్ అయింది. ఈ ప్రాజెక్టులో భాగంగా మూసీ నదికి ఇరువైపులా రోడ్లు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. అదేవిధంగా మూసీ నదిలో వరద నీరుతో పాటు డ్రైనేజీ నీరును వేరు చేసేందుకు ఇంటర్ సెప్టర్ ఛానెల్ నెట్వర్క్ పద్ధతిలో ప్రాజెక్ట్ నిర్మాణానికి రూపకల్పన చేశారు.

**ప్రక్షాళన చేసి తీరుతాం : మంత్రి శ్రీధర్ బాబు**

'సాధారణంగానే ఏదైనా మంచి పని చేసేటప్పుడు కొందరూ కావాలనే అడ్డుపడుతుంటారు. మూసీ విషయంలోనూ ఇదే జరుగుతోంది. భావి తరాల కోసం ప్రక్షాళన చేసి తీరుతాం. వెనక్కి తగ్గేదే లేదు. నీటి వనరుల పరిరక్షణలో ఇతర రాష్ట్రాలకు తెలంగాణను రోల్ మోడల్ గా నిలుపుతాం' అని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఇన్స్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్ ఇండియా(ఐటిపిఐ) తెలంగాణ స్టేట్ రీజినల్ ఛాప్టర్ ఆధ్వర్యంలో శనివారం బంజారాహిల్స్ లోని పార్క్ హయాత్ హోటల్ లో 'పాలసీస్ స్ట్రాటజీస్ టూవారడ్స్ బయోఫిలిక్ అర్బనిజం' అనే అంశంపై ఏర్పాటు చేసిన సౌత్ జోన్ కాన్ఫరెన్స్ ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నగరాల అభివృద్ధికి సరైన ప్రణాళికే పునాది అని అన్నారు. పర్యావరణం, సుస్థిరత లేకుండా ఆర్థికాభివృద్ధి సాధ్యం కాదన్నారు. భవనాలను నిర్మించడమే అభివృద్ధి కాదని, ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణతో కూడిన వృద్ధి ఆవశ్యకమన్నారు. ఆర్థిక భవిష్యత్తుకు పట్టణ ప్రణాళికే పునాది అని నొక్కి చెప్పారు. మనం రూపొందించే ప్రతి విధానం, కాపాడే ప్రతి అడవి, పునరుద్ధరించే ప్రతి నది, సృష్టించే ప్రతి జీవనోపాధి ఇవన్నీ తరాల మధ్య న్యాయానికి సంకేతాలని వివరించారు. పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం అభివృద్ధి, కార్బన్ – న్యూట్రల్ గ్రోత్, జల సంరక్షణ, సుస్థిర రవాణాలో తెలంగాణ అవలంభిస్తున్న విధానాలు, తీసుకున్న చర్యలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకుంటే సుస్థిరాభివృద్ధితో కూడిన నగరాలను అభివృద్ధి చేయొచ్చన్నారు. వాతావరణ మార్పులు, పట్టణ వరదలు, పర్యావరణ కాలుష్యం, భూగర్భ జలాల తరుగుదల, పట్టణీకరణ, తరిగిపోతున్న పచ్చదనం తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని నగర ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీపీఐ ప్రెసిడెంట్ ఎన్ కే పటేల్, సెక్రటరీ జనరల్ కుల్ శ్రేష్ఠ, కోఆర్డినేటర్(టెక్నో అడ్మిన్) ప్రదీప్ కుమార్, ఐటీపీఐ – తెలంగాణ రీజినల్ ఛాప్టర్ ఛైర్మన్ ఎస్.దేవేందర్ రెడ్డి, కార్యదర్శి కె.మురళీధర్ రెడ్డి, జిహెచ్ఎంసి చీఫ్ సిటీ ప్లానర్ కే శ్రీనివాస్, హెచ్ఎండిఏ ప్లానింగ్ డైరెక్టర్లు రాజేంద్రప్రసాద్ నాయక్, విద్యాధర్ తదితరులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలు (మొదటి పేజీ తరువాయి)

మాజీ ఎంఎల్‌సి సి.రామచంద్రయ్య, కేరళ మంత్రులు, సిపిఐ జాతీయ, వివిధ రాష్ట్రాల నాయకులు, వివిధ రాజకీయ నాయకులు, వామపక్ష పార్టీల నాయకులు, ప్రముఖులు, శ్రేయోభిలాషులు రానున్నారని సిపిఐ రాష్ట్ర సమితి ఒక ప్రకటనలో తెలియజేసింది.

**సిఎంకు సిపిఐ ధన్యవాదాలు**

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) అగ్రనేత, జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డికి ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరపాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సిఎం ఆదేశాలు జారీచేశారు. వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సురవరం సుధాకర్ రెడ్డి గచ్చిబౌలిలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి కన్నుమూశారు.

సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి అంతిమ వీడ్కోలు ప్రభుత్వ అధికార లాంఛనాలతో జరపాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వానికి సిపిఐ రాష్ట్ర సమితి ధన్యవాదాలు తెలియజేసింది. సురవరం సుధాకర్ రెడ్డి అంతిమ వీడ్కోలు ప్రభుత్వ అధికార లాంఛనాలతో జరపాలని ముఖ్యమంత్రిని కోరిన వెంటనే స్పందించి ప్రభుత్వ అధికార లాంచనాల ప్రకారం అంతిమ యాత్ర నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు ఇచ్చినందుకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆ తీర్పు సుప్రీంకోర్టుది...
(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చిన తీర్పు తనది కాదని, సుప్రీంకోర్టుదేనన్నారు. హోంమంత్రితో వివాదంలో చేరాలనుకోవడం లేదు అని అన్నారు. చర్చలో మర్యాద ఉండాలని ఘాటుగా సూచించారు. రానున్న ఉపరాష్ట్రపతి ఎన్నిక ఇద్దరు వ్యక్తుల మధ్య పోటీ కాదు, రెండు వేర్వేరు సిద్ధాంతాల మధ్య అని సుదర్శన్‌రెడ్డి ఉద్ఘాటించారు. అయితే శుక్రవారం అమిత్ షా మాట్లాడుతూ ఇండియా కూటమి అభ్యర్థిని లక్ష్యంగా చేసుకుని సల్వా జుడుంపై సుదర్శన్‌రెడ్డి తీర్పు వామపక్ష తీవ్రవాదాన్ని బలోపేతం చేసిందని ఆరోపించారు. సుదర్శన్ రెడ్డి నక్సలిజానికి సహాయం చేసిన వ్యక్తి అని, ఆయన సల్వా జూడం తీర్పు ఇచ్చారన్నారు. సల్వా జూడం తీర్పు ఇవ్వకపోతే, 2020 నాటికి నక్సల్ ఉగ్రవాదం అంతమై ఉండేదని, సల్వా జూడం తీర్పు ఇచ్చిన భావజాలం నుండి ప్రేరణ పొందిన వ్యక్తి ఆయన అని అమిత్ షా అన్నారు. కాగా, కోయా కమాండోలు లేదా సల్వా జూడం అని ప్రసిద్ధి చెందిన గిరిజన యువకులను మావోయిస్టు తిరుగుబాటుదారులతో పోరాడటానికి ప్రత్యేక పోలీసు అధికారులుగా నియమించడం చట్టవిరుద్ధం, రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించిన జస్టిస్ రెడ్డి రాసిన 2011 సుప్రీంకోర్టు తీర్పును హోంమంత్రి ప్రస్తావిస్తున్నారు. ఎస్‌పిఒలను వెంటనే నిరాయుధులను చేయాలని కూడా సుప్రీంకోర్టు ఆదేశించింది. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్‌డిఎ అభ్యర్థి సిపి రాధాకృష్ణన్‌ను ఎదుర్కోవడానికి సుదర్శన్‌రెడ్డి సిద్ధంగా ఉన్న సమయంలో అమిత్ షా తీవ్ర ఆరోపణలు చేయడం గమనార్హం. సెప్టెంబర్ 9న జరగనున్న ఉప రాష్ట్రపతి ఎన్నికలకు సుదర్శన్‌రెడ్డిని ఇండియా కూటమి అధికారికంగా ప్రకటించింది.

## యూరియా అందలేదు
(మొదటి పేజీ తరువాయి)

పడకముందే, రాష్ట్రానికి రావాల్సిన యూరియా సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు. రాష్ట్రానికి రావాల్సిన యూరియా కోటా మొత్తాన్ని పూర్తిగా సరఫరా చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ముందుగా కనీసం 50 శాతం యూరియాను ఈ వారంలోనే ఆర్‌ఎఫ్‌సిఎల్ నుండి గాని, ఎన్‌ఎఫ్‌సిఎల్ నుండి గాని రాష్ట్రానికి పంపేలా చూడాలని ఆయన సూచించారు. రైతులకు అసౌకర్యం కలగకుండా ఎరువుల పంపిణీ తక్షణమే జరగాలని మంత్రి స్పష్టం చేశారు. దీనికి స్పందించిన ఆర్‌ఎఫ్‌సిఎల్ అధికారులు, రాష్ట్రానికి కావలసిన యూరియాను త్వరలోనే సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. రైతుల అవసరాలను తీర్చడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో ప్రస్తుతం 42 వేల మెట్రిక్ టన్నులు యూరియా అందుబాటులో ఉందని, ఈ రోజు మరో 6543 మెట్రిక్ టన్నుల యూరియా రానుందని మంత్రి తెలిపారు. అలాగే ఈ నెల చివరివరకు వివిధ తేదీలలో మరో 37,877 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చే అవకాశం ఉందని మంత్రి అన్నారు. యూరియా సరఫరా కోసం ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు.

**ఆందోళన వద్దు : మంత్రి శ్రీధర్ బాబు**

రాష్ట్రానికి యూరియా సరఫరాను పెంచేందుకు తమ ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని, ప్రతిపక్షాల దుష్ప్రచారంతో రైతులు ఆందోళనకు గురి కావొద్దని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు. రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్‌ఎఫ్‌సిఎల్) యాజమాన్యం, వ్యవసాయ శాఖ, పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులతో శనివారం డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎఫ్సీఎల్ లో ఉత్పత్తి నిలిచిపోవడానికి గల కారణాలపై ఆరా తీశారు. ఈ సీజన్ లో 145 రోజుల్లో 40 రోజులు మాత్రమే ప్లాంట్ పని చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తరచూ ఇలాంటి పరిస్థితులు తలెత్తుతుంటే శాశ్వత చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఆర్ఎఫ్సీఎల్ సీఈవో అలోక్ సింఘాల్ ను ప్రశ్నించారు. మిమ్మల్ని మేం కేవలం వ్యాపారవేత్తలుగా మాత్రమే చూడటం లేదని, రాష్ట్రాభివృద్ధిలో మాతో కలిసి నడిచే భాగస్వామిగా చూస్తున్నామని స్పష్టం చేశారు. ప్లాంట్ పునరుద్ధరణకు రూపొందించిన యాక్షన్ ప్లాన్ ను సమీక్షించి మార్గనిర్దేశం చేశారు. ఇతర రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణను చూడొద్దన్నారు. రామగుండంలో ఉత్పత్తి ప్రారంభమయ్యే వరకు ఆర్ఎఫ్సీఎల్ మాతృ సంస్థ ఎన్ఎఫ్ఎల్ కు సంబంధించిన ఇతర ప్లాంట్ల నుంచి తెలంగాణకు ప్రతి రోజు ఒక రేకు యూరియాను సరఫరా చేసేలా చొరవ చూపాలని కోరారు. ఈ విషయంలో మీకేమైనా ఇబ్బందులుంటే కేంద్రంతో మాట్లాడి పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని భరోసానిచ్చారు.

సమావేశంలో స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, ఆర్ఎఫ్సీఎల్ రామగుండం యూనిట్ హెడ్ జీఎం రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# వామపక్ష పార్టీలు, శక్తుల ఐక్యతకు కృషి చేసిన సురవరం

**న్యూఢిల్లీ/హైదరాబాద్ :** కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మరణం పట్ల సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. భారత కమ్యూనిస్ట్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా మతతత్వం, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఐక్య పోరాటాన్ని రూపొందించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తు చేసింది. సిపిఐ అత్యుత్తమ నాయకులలో ఒకరైన సురవరం వామపక్ష పార్టీలు, శక్తుల మధ్య ఐక్యతను బలోపేతం చేయడానికి ఆ చేసిన కృషి గుర్తుండిపోతుందని తెలిపింది.కార్మికవర్గం,అణచివేతకు గురైన వారికోసం పోరాడిన జీవితకాల పోరాట యోధుడు సుధాకర్ రెడ్డి అని, న్యాయం, సమానత్వం, సోషలిజంఆదర్శాలకు తన జీవితాన్ని అంకితం చేశారని పేర్కొంది. ఈ మేరకు సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో ఒక ప్రకటనను విడుదల చేసింది.

కర్నూలు, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థి నాయకుడిగా తన కార్యకలాపాల మొదలు, యువత, విద్యార్థి చారిత్రాత్మక పోరాటాలలోఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ లకు నాయకత్వం వహించడం వరకు, ప్రజాస్వామ్య హక్కులు, సామాజిక పరివర్తనకు సురవరం అచంచలమైన నిబద్ధతను ప్రదర్శించారని కొనియాడింది. నల్లగొండ నుండి రెండుసార్లు పార్లమెంటు సభ్యుడిగా, కామ్రేడ్ సుధాకర్‌రెడ్డి కార్మికుల హక్కుల నుండి వ్యవసాయ సంక్షోభం వరకు అనేక అంశాలపై మాట్లాడేందుకు తన సమగ్రత, శాసన అంతర్దృష్టితో ప్రత్యేకంగా నిలిచారని పేర్కొంది. క్షేత్రస్థాయిలో ఆయన శక్తివంతమైన ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించారని తెలిపింది. సురవరం సతీమణికి, కుటుంబానికి సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో హృదయపూర్వక సంతాపం తెలియజేసింది.

**కమ్యూనిస్టు యోధునికి నివాళి : సిపిఐ(ఎంఎల్) లిబ-రేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య**

సురవరం సుధాకర్ రెడ్డి ఇక లేరు అనే వార్త దిగ్భ్రాంతి కలిగించిందని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి అన్నారు. విజయవాడలో జరిగిన సిపిఐ 24వ మహాసభ సందర్భంగా ఆయనను చివరి సారిగా కలిసానని,2020లో జరిగిన బిహార్ ఎన్నికలలో తమ పార్టీ సాధించిన విజయాలను ఆయన కొనియాడారని గుర్తు చేసారు. కమ్యూనిస్టు యోధుడికి నివాళి అని 'ఎక్స్'లో సంతాప సందేశాన్ని పోస్ట్ చేశారు.

**కార్యకర్తలను ఉత్తేజపరచడంలో మేటి : మాజీ ఎమ్మెల్యే పాటూరి రామయ్య**

సిపిఐ అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డి అస్తమయం వార్త దిగ్భ్రాంతిని కలిగించిందని సిపిఐ(ఎం) సీనియర్ నేత, మాజీ ఎంఎల్‌ఏ పాటూరి రామయ్య అన్నారు. ఆయనతో అనేక సందర్భాల్లో పరిచయం ఉందని, 1978–79లో రాష్ట్రవ్యాప్తంగా ఐక్య భూపోరాటాల సందర్భంగా తామిద్దరం కలిసి ఉద్యమించామని ఒకప్రకటనలో గుర్తు చేశారు. ప్రజాసమస్యల పోరాడటంలో సురవరం రాజీపడలేదన్నారు. ఆయనతో అనేక జ్ఞాపకాలు ఉన్నాయని తెలిపారు. అవి గుర్తుకొస్తుంటే దుఃఖం వస్తున్నదని చెప్పారు. 'సురవరం మితభాషి, సాత్వికుడు. కార్యకర్తలను ఉత్తేజపరచడంలో ఆయన మేటి' అని కొనియాడారు. అలాంటి నాయకుడు లేకపోతే ప్రజా ఉద్యమాలకు నష్టం జరుగుతుందని తెలిపారు.

**నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం పనిచేసిన నాయకుడు సురవరం : కేంద్ర మంత్రి బండి సంజయ్**

'సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపి సురవరం సుధాకర్ రెడ్డి మరణం బాధాకరం. సౌమ్యుడు, మృధుస్వభావి, అందరితో కలిసి మెలిసి ఉంటూ నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం పని చేసిన నాయకుడు సురవరం సుధాకర్ రెడ్డి. నిరంతరం పేదల అభ్యున్నతికి పాటుపడిన నాయకుడు. తెలంగాణకు చెందిన సురవరం సుధాకర్ రెడ్డి సామాన్య కార్యకర్త స్థాయి నుండి అంచలంచెలుగా ఎదిగి సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి గా పనిచేసి గుర్తింపు పొందడం గొప్ప విషయం. సురవరం సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా.సురవరం ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నా' అని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.

**సమాజం, పేద,బడుగు,బలహీనవర్గాల కోసం పనిచేసిన వ్యక్తి సురవరం సుధాకర్ రెడ్డి : బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**

నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు సమాజం, పేద, బడుగు, బలహీన వర్గాల కోసం పనిచేసిన వ్యక్తి సురవరం సుధాకర్ రెడ్డి అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. సురవరం 'అనారోగ్యంతో మరణించారన్న వార్త తీవ్రంగా బాధించింది. తెలుగు వ్యక్తి సిపిఐ జాతీయ పార్టీకి నాయకత్వం వహించారు. ఉన్నత స్థానానికి ఎదిగి గుర్తింపు పొందారు. సౌమ్యునిడి గా, అందరితో కలిసి మెలిసి ఉండేవారు. గొప్ప మేధావి. సురవరం మరణం తెలుగు ప్రజలకు తీరనిలోటు' అని రాంచందర్‌రావు తెలిపారు.

**సురవరం మరణం ప్రజాస్వామ్య హక్కులకు, వామపక్ష ఉద్యమాలకు తీరని లోటు : జాన్‌వెస్లీ**

సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, పార్లమెంట్ సభ్యులుగా పని చేసిన కమ్యూనిస్టు అగ్రనేత కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డి మరణం పట్ల సిపిఐ (ఎం) రాష్ట్ర కమిటీ తీవ్ర దిగ్భ్రాంతిని తెలియజేంది. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించింది. కామ్రేడ్ సుధాకర్ రెడ్డి వామపక్షాల ఐక్యత కోసం కృషి చేసిన నాయకుడని, రెండుసార్లు పార్లమెంట్ సభ్యులుగా శ్రామికవర్గాల పక్షాన పోరాటం చేశారని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ గుర్తు చేశారు. విద్యార్థిదశ నుంచే ప్రజల తరపున, ప్రజాస్వామ్య హక్కుల కోసం, వర్గ పోరాటాలను ముందుకు నడిపేందుకు తీవ్రమైన కృషి చేశారన్నారు.

**ఎన్నో ప్రజాపోరాటాలు, ఉద్యమాలు చేసిన నాయకుడు సురవరం : మంత్రి పొన్నం**

సిపిఐ అగ్ర నాయకులు మాజీ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి మృతి పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ద్రిగ్భాంతి వ్యక్తం చేశారు. సురవరం సుధాకర్ రెడ్డి ఒక కొండ్రవుపల్లి అనే మారుమూల పల్లెలో జన్మించి, సిపిఐ జాతీయ స్థాయి నాయకునిగా ఎదిగారని, ఎన్నో ప్రజా పోరాటాలు , ఉద్యమాలు చేశారని ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తు చేసుకున్నారు.

**అసామాన్య కమ్యూనిస్టు సువరం సుధాకర్ రెడ్డి : మంత్రి సీతక్క**

సిపిఐ అగ్ర నాయకులు, మాజీ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి మృతి పట్ల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిత్యం ప్రజా సంక్షేమం కాంక్షించిన సైద్ధాంతిక నిబద్ధుడిని కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆయన కన్ను మూయడం వాపక్షాలకు, ప్రజాస్వామ్య వాదులకు తీరని లోటుగా అభివర్ణించారు. కొండ్రవుపల్లి వంటి మారుమూల గ్రామం నుండి సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎదిగిన సుధాకర్ రెడ్డి అనేబుక ప్రజా పోరాటాలు, ఉద్యమాలు నడిపిన అసమాన్య కమ్యూనిస్టు నాయకుడని సీతక్క ఈ సందర్భంగా స్మరించారు.

**కమ్యూనిస్టు, బలహీన,బడుగు వర్గాలకు తీరని లోటు: చిన్నారెడ్డి**

సిపిఐ అగ్రనేత సురవరం సుధాకర్ రెడ్డి మృతి దేశ కమ్యూనిస్టు ఉద్యమానికి, బలహీన, బడుగు వర్గాలకు తీరని లోటు అని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు చిన్నారెడ్డి ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలిపారు.

**సురవరం పాత్ర స్మరణీయం : ఎపి మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి**

రాజకీయాలకు, కమ్యూనిస్టు ఉద్యమానికి సురవరం సుధాకర్ రెడ్డి నిర్వహించిన పాత్ర ఎల్లప్పుడూ స్మరణీయమేనని ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

**సురవరం సేవలు చిరస్మరణీయం: ఎపిపిసిసి చీఫ్ షర్మిళ**

సిపిఐ అగ్రనేత, మాజీ పార్లమెంటు సభ్యులు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మరణం అత్యంత విచారకరమని ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల అన్నారు. కమ్యూనిస్టు యోధుడిగా ప్రజాసేవలో ఆయన సేవలు చిరస్మరణీయం అని పేర్కొన్నారు.

### లోక్‌సభ స్పీకర్ సంతాపం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని నల్లగొండ మాజీ ఎంపి సురవరం సుధాకర్‌రెడ్డి మరణించారనే వార్త బాధ కలిగించిందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. ఆయన 12, 14వ లోక్‌సభకు ఎన్నికైన విషయాన్ని గుర్తు చేస్తూ స్పీకర్ కార్యాలయం 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ పెట్టింది.

## ఉపాధ్యాయుడే కుట్రదారుడు (మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులను పరామర్శించారు. జరిగిన విషయం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనలో నివ్వరపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఉపాధ్యాయుల మధ్య గొడవతో సైన్స్ ఉపాధ్యాయుడు రాజేందర్ దగ్గు సిరప్ లో మోనో పురుగుల మందు ను విద్యార్థులు సేవించే వాటర్ ట్యాంకులో కలపడంతో విద్యార్థులు ఆ నీటిని సేవించడంతో అస్వస్థతకు గురై వాంతులు విరోచనాలు ఆసుపత్రిలో చేరడం జరిగింది. హాస్టల్ విద్యార్థులతో ఎమ్మెల్యే మాట్లాడటం తో జరిగిన విషయాన్ని విద్యార్థులు ఎమ్మెల్యేకువివరించడంతో అసలు విషయం బయటపడింది. ఇదిలా ఉంటే సైన్స్ బోధించే ఉపాధ్యాయుడు వాటర్ ట్యాంకులు మోనో మందును కలుపుతుండగా చూసిన విద్యార్థులను సైతం ఉపాధ్యాయుడు బెదిరింపులకు గురిచేసి ఎవరితో చెప్పకూడదని వారిని బెదిరించిన విషయాన్ని ఎమ్మెల్యే కు వివరించగా అసలు జరిగిన విషయం బయటపడింది. ఉపాధ్యాయుల మధ్య ఉన్న అంతర్గత విభేదాలు విద్యార్థుల కు ప్రాణ సంకటంగా మారింది. మొన్న మొగుళ్ళపల్లి మండలం కొరికిశాలలో కస్తూర్బా రెసిడెన్షియల్ పాఠశాలలో జరిగిన ఫుడ్ పాయిజన్ సంఘటనలో కూడా ఎస్ ఓ ఉపాధ్యాయులు మధ్య విభాగాలే కారణమని తెలుస్తుంది. మునుపెన్నడు లేనివిధంగా ఉపాధ్యాయుల మధ్య విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. అభం శుభం తెలియని విద్యార్థుల ప్రాణాలతో ఉపాధ్యాయులు ఎస్వోలు అంతర్గత గొడవలు విద్యార్థులకు ప్రాణ సంకటంగా మారుతున్నాయి.

**పోలీస్ కేసులు నమోదు చేస్తాం : ఎమ్మెల్యే గండ్ర**

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే శనివారం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఘటనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాలలో జరుగుతున్న అనేక విషయాల ను వెల్లడించారు. ఉపాధ్యాయులు తమను నానా రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఇష్టం వచ్చినట్లు కొడుతున్నారని తెలిపారు.

అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు మధ్య తరచూ జరుగుతున్న గొడవలే దీనికి కారణమని ఎమ్మెల్యే తెలిపారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన అణగారిన పేద కుటుంబాల విద్యార్థులను తల్లితండ్రులు చదివించుకోవాలన్న ఉద్దేశ్యంతో వసతి గృహాల్లో ఉంచుతున్నారని, పిల్లలపై ప్రయోగాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. మొగుల్లపల్లి మండలంలోని కొరికిషాల కెజిబివి పాఠశాలల్లో ఉపాధ్యాయులు, ఎస్వో విభేదాల కారణంగా విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**పురుగుల మందు కలిపిన ఉపాధ్యాయు-డితోపాటు ముగ్గురిని సస్పెండ్ చేసిన జిల్లా కలెక్టర్**

మంచినీటిలో పురుగుల మందు కలిపిన ఉపాధ్యాయుడు రాజేందర్ తో పాటు వేణు, సూర్య ప్రకాష్, వంట మనిషి రాజేశ్వరి ని తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ప్రకటించారు. ఇలాంటి ఘటనలకు పాల్పడితే ఉద్యోగం నుండి తొలగించడంతో పాటు పోలీస్ కేసులు నమోదు చేసి రిమాండ్ చేస్తామని హెచ్చరించారు. ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ అంతర్గత విబేధాలతో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## ప్రజాభిమానం చూరగొన్న మహానేత
(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయాన్ని ఇటీవల సురవరం సుధాకర్ రెడ్డి ప్రారంభించారని గుర్తు చేసుకున్నారు. సురవరం సుధాకర్ రెడ్డి ఫోటోకు ఇంత తొందరగా పూల మాల వేసే పరిస్థితి రావడం బాధాకరమన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి అన్ని వర్గాలకూ, ప్రాంతాలకూ, రాజకీయ పార్టీలకూ అత్యంత ఇష్టమైన నాయకుడని, ఉభయ తెలుగు రాష్ట్రాలకు అత్యంత ఇష్టమైన కొద్ది మందిలో సురవరం ఒకరని కొనియాడారు.

అన్ని వర్గాల అభిమానం, సిపిఐ, సిపిఐ(ఎం), కాంగ్రెస్, టిడిపి, బిఆర్ఎస్‌తో పాటు బిజెపి నాయకులు సురవరం పట్ల అత్యంత ప్రేమను వ్యక్తం చేశారన్నారు. సురవరం లాంటి గొప్ప నాయకుడిని కోల్పోవడం దురదృష్టకరమన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి బాటలోనే నడుస్తూ, ఆయన వదిలివెళ్లిన వారసత్వాన్ని తాము కొనసాగిస్తామన్నారు. చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ యువజన, విద్యార్థి, ఉద్యమాలు మొదలు సిపిఐ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి జాతీయ స్థాయికి ఆయన ఎదిగారని, ఎంత ఎదిగితే అంత ఒదిగి ఉన్న వ్యక్తి సురవరం అన్నారు. సురవరం సుధాకర్ రెడ్డిది నిక్కచ్చికగా చెప్పే మనస్తత్వమని, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో సురవరం ప్రధాన పాత్రను పోషించారని, ఎంతో అంకితభావంతో పనిచేశారని తెలిపారు. వామపక్షాలు ఒక వేదికపైకి వస్తే దేశంలోనే ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందని, వామపక్ష, ప్రజాతంత్ర, ప్రగతిశీల ఉద్యమాలను నిర్వహించాలని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా సురవరం సుధాకర్‌రెడ్డి 2015 సంవత్సరంలోనే రాజకీయ తీర్మానం చేశారని చాడ గుర్తు చేశారు.

సిపిఐని బలోపేతం చేయడమే సురవరం సుధాకర్‌రెడ్డికి ఇచ్చే నివాళి అని అన్నారు. ఉనెల్లికంటి సత్యం మాట్లాడుతూ సువరం సుధాకర్ రెడ్డి పేద వర్గాల హక్కుల కోసం, దేశంలోని వామపక్ష ఉద్యమాలతో పాటు కార్మిక, రైతు, అణగారిన వర్గాల, సామాజిక ఉద్యమాలను నిర్వహించిన మేధావి అని కొనియాడారు. నల్లగొండ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టలను పూర్తిచేయాలని పాదయాత్ర నిర్వహించారని, పార్లమెంట్‌లో కార్మిక, రైతాంగ చట్టాల కోసం అనేక పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు.

ఎస్.వి. సత్యనారాయణ, మాజీ ఉపకులపతి, శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం; కందిమళ్ల ప్రతాప రెడ్డి, కార్యదర్శి, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్; ఏటుకూరి ప్రసాద్, నవచేతన పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు సురవరం సుధాకరరెడ్డికి నివాళులు అర్పిం చారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## వాట్సాప్, ఇ–మెయిల్ ఆధారంగా ఎస్‌సి, ఎస్‌టి కేసు వర్తించదు

ప్రజాపక్షం/హైదరాబాద్: వాట్సాప్, ఈమెయిల్‌లో మెసేజుల్లోని ఆరోపణలను ఆధారంగా చేసుకుని ఎస్‌సి, ఎస్‌టి కేసు పెట్టడానికి వీల్లేదని హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. నాలుగు గోడల మధ్య జరిగిన సంఘటనల కిందకే వస్తుందని తెలిపింది. బహిరంగ ప్రకారం బహిరంగ ప్రదేశాల్లోనే కులం పేరుతో దూషించినా, ఘటనలు జరిగినప్పుడు మాత్రమే ఆ చట్టం వర్తిస్తుందని తెలిపింది. వాట్సాప్, మెయిల్స్‌లోని మెసేజ్‌ల మేరకు తమపై ఎస్‌సి, ఎస్‌టి కేసును పెట్టడాన్ని హైదరాబాద్‌కు చెందిన నిరుపమ, ఆమె తండ్రి అనుపమ బాబు పిటిషన్లు వేయగా జస్టిస్ వేణుగోపాల్ విచారించారు. ఎస్సీ కులానికి చెందిన క్రాంతికిరణ్ పిటిషనర్ నిరుపమను రెండో వివాహం చేసుకున్నారని, తర్వాత గొడవలు రావడంతో అంగీకారంతో విడిపోయారని లాయర్ చెప్పారు. అప్పటికే వాట్సాప్, మెయిల్స్‌లో ఉన్న మెసేజ్‌లను ఆధారంగా చేసుకుని ఎస్‌సి, ఎస్‌టి కేసు పెట్టడం అన్యాయమని చెప్పారు.

# అణగారిన వర్గాల ఉద్యమాలకు తీరని లోటు

## సురవరం సుధాకర్ రెడ్డికి పలువురు, ప్రజాసంఘాల సంతాపం

ప్రజాపక్షం/హైదరాబాద్: సిపిఐ జాతీయ మాజీ ప్రధానకార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి మరణం కమ్యూనిస్టు ఉద్యమాలకు, అనేక సామాజిక, అణగారిన వర్గాల ఉద్యమాలకు తీరని లోటు అని పలువురు అన్నారు. ఆయన మరణం పట్ల తమ సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. '1988–89 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎంసిపిఐ(యు)తో కలిసి వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్) ఏర్పాటులో సిపిఐ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, ఎల్‌డిఎఫ్‌ను బలోపేతానికి కృషి చేశారని' ఎంసిపిఐ(యు) అఖిలభారత ప్రధాన కార్యదర్శి మద్ది కాయల అశోక్ ఓంకార్, ఎంసిపిఐ (యు) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వనం సుధాకర్ గుర్తు చేశారు. ఒక్కొక్కరుగా త్యాగాల తరం వెళ్ళిపోతుందని, ఆ త్యాగాల తరం స్ఫూర్తితో నేటి తరం పీడిత ప్రజా ఉద్యమాల పక్షాన నిలబడటమే కామ్రేడ్ సురవరం ఆశయాలకు అంకితం కావడమన్నారు.

'పార్లమెంటులో కార్మికవర్గం పక్షాన పోరాటాలను,ఉద్యమాలను చేసిన మానవతావాది సురవరం లేని లోటు తీర్చలేనిదని ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ అన్నారు.

'సురవరం సుధాకర్ రెడ్డి మరణం దేశం, రాష్ట్రంలోని గిరిజనులకు, సిపిఐకి తీరని లోటు అని అఖిలభారత ఆదివాసీ మహాసభ మాజీ గౌరవ అధ్యక్షులు, జాతీయ కంట్రోల్ కమిషన్ మాజీ కార్యదర్శి చిత్తరంజన్ బక్షి, జాతీయ కార్యదర్శి, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ నాయక్. అన్నారు.' సురవరం సుధాకర్ రెడ్డి లేని లోటు తీరనిదని ఐప్సో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కెవిఎల్ అన్నారు. 'సురవరం సుధాకర్ రెడ్డి ఆశయ సాధన కోసం, ఆయన పోరాట చరిత్రను స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్ లో ఉద్యమిస్తామని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు'

'సురవరం సుధాకర్ రెడ్డి మరణం సిపిఐకి, ప్రజా, కార్మిక ఉద్యమాలకు తీరని లోటు అని తెలంగాణ ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కె.పద్మాకర్,అధ్యక్షుడు ఎస్.బాబు, ప్రధాన కార్యదర్శి ఇ.వెంకన్నఅన్నారు.

'సురవరం సుధాకర్ రెడ్డి మరణం భారత శ్రామిక వర్గాలకు తీరని లోటు' అని తెలంగాణ అధ్యయన వేదిక వనస్థలిపురం సమన్వయకర్త కట్టా భగవంత రెడ్డి, ప్రతినిధులు జి.అనసూయ, మల్లయ్య ,బాలచందర్, గోవర్ధన్, కేశవరావు ,జగన్మోహన్ రెడ్డి, జగన్మోహన్ అన్నారు.

### తెలంగాణ రాజకీయాలకు, కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు

"సిపిఐ అగ్ర నాయకులు, పార్లమెంట్ మాజీ సభ్యులు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మరణం ఎంతో బాధాకరం. వారి ప్రజాసేవా, ఉద్యమ పంథా చిరస్మరణీయం. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి. సురవరం ఆత్మకు శాంతి చేకూరాలి'' అని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సురవరం మరణం తెలంగాణ రాజకీయాలకు, కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అని మాజీ మంత్రి జి.జగదీష్ రెడ్డి అన్నారు. సురవరం సుధాకర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని, ఆయన మరణించినప్పటికీ ఆయన ఆదర్శాలు జీవిస్తాయని, ప్రజా పోరాటాల్లో వారు రెడ్‌స్టార్‌గా వెలిగారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి మృతి సిపిఐకి,తెలంగాణ సమాజానికి తీరని లోటు అని, ఎంపి రవి చంద్ర అన్నారు. సురవరం సుధాకర్ రెడ్డితో తనకు గత 50 ఏళ్లుగా ఉన్న పరిచయమని, ఆయన గొప్ప దేశభక్తుడని, శ్రమజీవుల పక్షపాతి. పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై సుదీర్ఘంగా, సమర్థంగా మాట్లాడేవారని మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ గుర్తు చేశారు. 'సురవరం సుధాకర్ రెడ్డి మరణం యావత్ దేశానికి తీరని లోటు అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత అన్నారు. 'మార్క్సిస్టు నేతగా అనేక పోరాటాల్లో సురవరం సుధాకర్ రెడ్డి భాగస్వామ్యం అయ్యారని, సురవరం మరణం పేదలు, కార్మిక వర్గాలకు తీరని లోటు అని డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ అన్నారు.



హైదరాబాద్ కేర్ ఆస్పత్రిలోని సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, నల్లగొండ మాజీ ఎంపి సురవరం సుధాకర్ రెడ్డి భౌతికకాయాన్ని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా సురవరం సుధాకర్‌రెడ్డికి నివాళ్లు అర్పించి, ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.



### సిఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో...

చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ ఫర్ సోషల్ ప్రోగ్రెస్ (సి.ఆర్ ఫౌండేషన్) గౌరవ సలహాదారు, సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డికి హైదరాబాద్, కొండాపూర్‌లోని సిఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో శనివారం నివాళులర్పించారు. సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి సి.ఆర్.ఫౌండేషన్ కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు, కోశాధికారి చెన్న కేశవరావు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ జోశ్యభట్ల కల్పన, వృద్ధాశ్రమ సలహా కమిటీ సభ్యులు డాక్టర్ మండవ గోపీచంద్, తమ్మారెడ్డి తాన్య, ఎన్.రాజేంద్రరావు, మహిళా సంక్షేమ కేంద్రం కమిటీ సభ్యులు వి.లలిత, సీనియర్ పాత్రికేయులు డాక్టర్. ఎబికె ప్రసాద్, సీనియర్ వైద్యురాలు డాక్టర్ ప్రతిభ, సిపిఐ శేరిలింగంపల్లి మండల కార్యదర్శి రామకృష్ణ, శేర్‌లింగంపల్లి మహిళా మండలి కార్యదర్శి వరలక్ష్మి , విశ్రాంత సైంటిస్ట్ మల్లంపాటి వెంకటేశ్వరరావు, వృద్ధాశ్రమ మేనేజర్ శ్రీనివాస్‌తో పాటు తదితరులు సురవరంకు పుష్పాంజలి ఘటించి, నివాళులు అర్పించారు.

### నల్లగొండ, రంగారెడ్డి జిల్లా అభివృద్ధికి సురవరం కృషి చేశారు: కోదండరెడ్డి

నల్లగొండ ఎంపిగా సురవరం సుధాకర్ రెడ్డి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల అభివృద్ధికి కృషి చేశారని రైతు కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. సురవరం సుధాకర్‌రెడ్డి మరణం సిపిఐ,కాంగ్రెస్ పార్టీకి బాధాకరమన్నారు.



గిరిప్రసాద్ భవన్‌లో...

నాగోల్ బండ్లగూడలోని గిరిప్రసాద్ భవన్‌లో సురవరం సుధాకరరెడ్డికి నవచేతన విజ్ఞాన సమితి నివాళి అర్పించింది. విజ్ఞాన సమితి అధ్యక్షులు పల్లా వెంకట్‌రెడ్డి, కోశాధికారి ఉజ్జిని రత్నాకర్‌రావు, కార్యదర్శి బిఎస్‌ఆర్ మోహన్‌రెడ్డి, ప్రజాపక్షం ఎడిటర్ మక్కెన సుబ్బారావు తదితరులు సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అర్చకులు, ఇవోలకు పదోన్నతులు

ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు మంత్రి కృషితో పరిష్కారం

అర్చకులకు మెడికల్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్

ప్రజాపక్షం/హైదరాబాద్: దేవాదాయ శాఖలో ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఆలయాల అర్చకులు, ఇవోలకు మంత్రి కొండా సురేఖ ప్రత్యేక చొరవతో దేవాదాయ శాఖ పదోన్నతులు కల్పించింది. ఈ మేరకు శనివారం సచివాలయంలో మంత్రి సురేఖ పదోన్నతి పొందిన అర్చకులు, ఇవోలకు ఆర్డర్ కాపీలను అందజేశారు. వివిధ దేవాలయాలలో పనిచేస్తున్న అర్చక, సిబ్బందికి జీవో ఎంఎస్.నం.261 ప్రకారం 14 వేదపారాయణం చేసేవారికి గ్రేడ్3 నుంచి2, గ్రేడ్2 నుంచి ఒకటి, 2పోస్టులు మొత్తం 16 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. వీరికి మంత్రి ఉత్తర్వులు అందజేశారు. ఈఓ గ్రేడ్ 3 నుంచి ఈఓ గ్రేడ్ 2 ఇద్దరు, మోఫిసిల్ సీనియర్ అసిస్టెంట్ నుంచి ఈఓ గ్రేడ్ 2 ఒకటి, దేవస్థానం జూనియర్ అసిస్టెంట్ నుంచి కన్వర్షన్ ఆఫ్ సర్వీసెస్ కింద ముగ్గురు అభ్యర్థులకు ఈఓ గ్రేడ్3గా మంత్రి సురేఖ ఉత్తర్వులను అందజేశారు. అసిస్టెంట్ కమిషనర్ క్యాటగిరిలో పదోన్నతులు పొందాల్సిన ఫీడర్ క్యాటగిరీస్ అయిన ఈఓ గ్రేడ్ I, మోఫిసిల్ సూపరిండెంట్స్, ప్రముఖ దేవాలయాల్లోని ఏఈఓల సీనియారిటీలు వివిధ కారణాలతో ఆగిపోగా.. ప్రభుత్వం సమీక్షించేందకు ఉత్తర్వులు జారీ చేసింది. డిపార్ట్‌మెంటల్ పదోన్నతులను త్వరితగతిన పరిష్కరించడానికి డిపార్టుమెంటు సిబ్బందితో పాటు... జీఏడీలో పనిచేసిన అనుభవం ఉన్న విశ్రాంత ఉద్యోగులతో కమిటీ వేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంటు డైరెక్టర్ వెంకటరావు, అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, ఏడీసీ శ్రీనివాసరావు, జాయింట్ కమిషనర్ రామకృష్ణరావు, డిప్యూటీ కమిషనర్ వినోద్ కుమార్, కృష్ణప్రసాద్, వెంకశ్ తదితరులు పాల్గొన్నారు.

**అర్చకులకు మెడికల్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్..**

దేవాదాయ శాఖలోని ఉద్యోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు పదవీ విరమణ చేసిన అర్చక, ఇతర ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.4.00 లక్షల నుంచి రూ.8.00 లక్షలకు పెంచడానికి, హౌసింగ్ లోన్‌లో రూ.10 లక్షల వరకు బ్యాంకు వడ్డీ, ఇతర సౌకర్యాలు అర్చక సంక్షేమ నిధి ద్వారా లబ్ధి చేకూర్చేందుకు మంత్రి సురేఖ ప్రత్యేకంగా కృషి చేశారు. దేవాలయాల్లో పని చేస్తున్న అర్చకులు, ఇతర సిబ్బంది నలుగురికి మెడికల్ రీయంబర్స్‌మెంటు ప్రొసిడింగ్స్ అందజేశారు.

**10 ఆలయాల అభివృద్ధికి చర్యలు..**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం బంగారు గోపురం మొదలుకొని దేవాదాయశాఖలో పలు అభివృద్ధి కార్యక్రమాల వివరాలను మంత్రి సురేఖ ఎండోమెంట్ డైరెక్టర్ వెంకటరావును అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని 10 పెద్ద దేవాలయాల అధివృద్ధి కోసం భక్తులకు మెరుగైన వసతుల కల్పించేందుకు మాస్టర్ ప్లాన్‌కు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు.



**మంత్రి సురేఖకు ప్రత్యేక కృతజ్ఞతలు : జ్యోతిచంద్ర శర్మ**

చాలా సంవత్సరాలు పెండింగులో ఉన్న మా అర్చకులు, ఈవోల సమస్యను పరిష్కరించిందుకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ప్రత్యేకంగా ధన్యవాదాలు. మేము ఈ పదోన్నతుల కోసం ఏండ్లుగా తిరిగినా కాలేదు. కానీ, మంత్రి స్వయంగా ఈ విషయాన్ని ప్రత్యేక చొరవతో ముందుకు తీసుకెళ్ళారు. అందుకు మాకు సంతోషంగా ఉన్నది. ఇందుకు గానూ మంత్రి సురేఖకి ఆ భగవంతుడి ఆశీస్సులుంటాయి.

# పసిప్రాయం నుండే క్రీడా ఆసక్తి

మంత్రి వాకిటి శ్రీహరి.. జాతీయ క్రీడా ఉత్సవాలు ప్రారంభం



ప్రజాపక్షం/హైదరాబాద్: పసిప్రాయం నుండే పిల్లల్లో క్రీడల పట్ల ఆసక్తి కలిగించే విధంగా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాటికి శ్రీహరి అన్నారు. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో గురువారం నుంచి తొమ్మిది రోజులపాటు జరిగే జాతీయ క్రీడ ఉత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్ననాటి నుండే విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి కలిగించడం వారిని మైదానాల వైపు ప్రోత్సహించడం కుటుంబాలకు మాత్రమే కాకుండా దేశానికి సమాజానికి ఎంతో శ్రేయస్కరమని ఆయన అన్నారు. మొక్కై వంగనిది మానై వంగదు అనే సామెత మాదిరిగా పసిప్రాయం నుండే క్రీడల్లో పట్ల శిక్షణ పొందిన విద్యార్థులు క్రీడల్లో విజయాలు సాధించడమే కాకుండా ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దబడతారని ఆయన అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ.. సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సహకారంతో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో దేశంలో ఏ రాష్ట్రము నిర్వహించనంత ఘనంగా జాతీయ క్రీడ ఉత్సవాలను నిర్వహించబోతున్నామని, జాతీయ క్రీడా దినోత్సవం అని ఒక్క రోజుకే పరిమితం చేయకుండా తొమ్మిది రోజుల పాటు వివిధ వర్గాలను క్రీడల్లో భాగస్వామ్యం చేసే విధంగా అన్ని వయసుల వారికి వర్గాల వారికి వినూత్న కార్యక్రమాలు రూపొందించామని ఆయన అన్నారు. కేవలం హైదరాబాద్ నగరానికే కాకుండా జిల్లా కేంద్రాల్లో వివిధ విద్యాసంస్థల్లో ఈ క్రీడా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి రవీందర్ అనిత, పిఆర్ఒ కాలేరు సురేష్, స్టేడియం అడ్మినిస్ట్రేటర్ మధు, ఫ్యూచర్ ఒలంపియన్ నిర్వాహకులు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వము
జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము (భూ సేకరణ)
నాగర్‌కర్నూల్ జిల్లా

No. G2/967/2025 Dt: 16.07.2025
Gaz. No. 115/2025

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19 (1) ప్రకారము

ఫారం. 6, ప్రాథమిక ప్రకటన

నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలంలోని గంగారం గ్రామము వద్ద ప్యాకేజి నెం.29 మార్కేండేయ లిఫ్ట్ యొక్క శాయినిపల్లి కెనాల్ మైనర్ 1ఆర్ గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్లో ఉదహరించిన ఎ. 6.23 1/2 గుంటలు / సెంట్లు భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా మార్కేండేయ లిఫ్ట్ యొక్క శాయినిపల్లి కెనాల్ మైనర్ 1ఆర్ నిమిత్తం సేకరించవలిసిన అవసరం ఉన్నదని ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ) యం.జి.ఎల్.ఐ.యస్.పి నాగర్‌కర్నూల్ గారు భావిస్తున్నారు. కాబట్టి ఎ.లు 6.23 1/2 గు. భూమి మార్కేండేయ లిఫ్ట్ యొక్క శాయినిపల్లి కెనాల్ మైనర్ 1ఆర్ నిమిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకు గాను ప్రాథమిక ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

షెడ్యూల్

గ్రామము: గంగారం మండలం: బిజినపల్లి జిల్లా: నాగర్‌కర్నూల్

| క్ర. నం. | సర్వే నెం./సబ్ డి. నెం. | పట్టా/ఇనాం etc., | భూమి వర్గీకరణ | సేకరించవలసిన విస్తీర్ణం | పట్టాదారు పేరు, అనుభవదారు పేరు మరియు ఏవైన హక్కులు గల యితర వ్యక్తులు | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు | | నిర్మాణములు | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 480 | పట్టా | మెట్ట | 2.36 | తిరుపతయ్య తండ్రి బాలపీరు (0.03) పిట్టల రాములు తండ్రి (0.03) అలివేలు భర్త తిరుపతయ్య (0.07) [illegible] | 487 | 467 | 454 | 62 | లేవు | లేవు | లేవు | లేవు |
| 2 | 397 | పట్టా | మెట్ట | 0.24 | [illegible] | 480 | 463 | VB | [illegible] | లేవు | లేవు | లేవు | లేవు |
| 3 | 374 | పట్టా | మెట్ట | 0.14 | [illegible] | - | - | - | - | లేవు | లేవు | లేవు | లేవు |
| 4 | 375 | పట్టా | మెట్ట | 0.08 | [illegible] | 374 | 376 | 370 | 398 | లేవు | లేవు | లేవు | లేవు |
| 5 | 372 | పట్టా | మెట్ట | 0.06 | [illegible] | - | - | - | - | లేవు | లేవు | లేవు | లేవు |
| 6 | 370 | పట్టా | మెట్ట | 1.06 | [illegible] | 372 | 369 | 480 /2 | 376 | లేవు | లేవు | లేవు | లేవు |
| 7 | 371 | పట్టా | మెట్ట | 0.08 | [illegible] | - | - | - | - | లేవు | లేవు | లేవు | లేవు |
| 8 | 368 | పట్టా | మెట్ట | 0.14 | [illegible] ఆర్.శివుడు తండ్రి ధర్మ ఆర్.హేంలా తండ్రి ధర్మ ఆర్.మన్య తండ్రి ధర్మ ఆర్.జయరాం తండ్రి హర్య ఆర్.భాగ్య భర్త శంకర్ ఆర్.అంబర్య తండ్రి హర్య ఆర్.శంకర్ తండ్రి పీరు కె.చిట్టెమ్మ భర్త దేవ ఆర్.రెడ్య తండ్రి మేఘ్య ఎ. కిషన్ తండ్రి రూప్ల బాలు తండ్రి రూప్ల తోక్య తండ్రి రూప్ల భాస్కర్ తండ్రి రూప్ల మిద్దె చంద్రశేఖర్ రెడ్డి తండ్రి బాల్ రెడ్డి మురళీధర్ తండ్రి చంద్రయ్య ఎ.రాధిక భర్త శివరెడ్డి గోపాల్ సక్రు అంగోత్ తండ్రి సక్రు ఎ.వెంకటేష్ తండ్రి సక్రు ఎ.మోత్య తండ్రి సక్రు రాంజ నాయక్ తండ్రి రూప్ల ఆర్.అశోక్ తండ్రి హర్య ఎ.చక్రధర్ తండ్రి హర్య ఎ. హర్య తండ్రి రాము శంకర్ తండ్రి రూప్ల | 480 /1 3/4 | 365 | 364 | 367 | లేవు | లేవు | లేవు | లేవు |
| 9 | 363 | పట్టా | మెట్ట | 0.01 1/2 | శంకర్ తండ్రి రూప్ల (0.01 1/2) ఆర్.హర్య తండ్రి వసురాం ఆర్.వెంకటేష్ తండ్రి వాల్య ఆర్.భోజ్య తండ్రి వాల్య ఆర్. దేవి భర్త రాజు ఆర్. వాలి భర్త దేశ్య ఆర్.నరేష్ తండ్రి వసుదేవ్ ఆర్. పీక్లీ భర్త దాసు ఆర్.వాసురాం తండ్రి మాత్రు ఆర్.శివుడు తండ్రి శివుడు ఆర్.హేంలా తండ్రి ధర్మ ఆర్.మన్య తండ్రి ధర్మ ఆర్.జయరాం తండ్రి హర్య ఆర్.అంబర్య తండ్రి హర్య ఆర్.శంకర్ తండ్రి పీరు ఆర్.రాము తండ్రి హర్య పి.అంజి తండ్రి నర్సింహ్మా ఆర్.రెడ్య తండ్రి మేఘ్య ఆర్.మేఘ్య తండ్రి హర్య ఎ.రాధిక భర్త శివరెడ్డి జి.సక్రు అంగోత్ తండ్రి సక్రు ఎ.వెంకటేష్ తండ్రి సక్రు ఎ.మోత్య తండ్రి సక్రు బి.సునిత భర్త బస్వారెడ్డి ఎ.హర్య తండ్రి రాము బాలు తండ్రి రూప్ల తోక్య తండ్రి రూప్ల భాస్కర్ తండ్రి రూప్ల రాంజనాయక్ తండ్రి రూప్ల ఎ.శంకర్ తండ్రి రూప్ల | - | - | - | - | లేవు | లేవు | లేవు | లేవు |
| 10 | 364 | పట్టా | మెట్ట | 0.26 | బి.రాంరెడ్డి తండ్రి జమ్మన్న దిండి నారాయణ తండ్రి గంగపూరి బాణావత్ రాము తండ్రి కేశ్య బాణావత్ కందర్ తండ్రి కేశ్య గూడూరు చిన్న నర్సింహ్మలు తండ్రి చిన్న రాములు దిడ్డి అంజనేయులు తండ్రి ఎల్లప్ప దిడ్డి చెన్నయ్య తండ్రి గంగపూరి బానాత్ లక్ష్మి భర్త అము బానాత్ అము తండ్రి రాములు దిడ్డి కుర్మయ్య తండ్రి ఎల్లయ్య | 368 | 365 | VB | 367 | లేవు | లేవు | లేవు | లేవు |
| మొత్తం: 6.23 1/2 | | | | | | | | | | | | | |

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19 (1)ని అనుసరించి సంబంధిత వ్యక్తులందరి దృష్టికి ఇట్టి విషయాన్ని తెస్తూ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 12 లో గల అధికారాలను అనుసరించి జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్ గారు, ప్రత్యేక ఉపకలెక్టర్, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్, మరియు వారి సిబ్బందికి సదరు భూమిలో ప్రవేశించి సర్వే మరియు యితర పనులు చేపట్టుటకు అధికారమివ్వ నైనది. ఇట్టి భూసేకరణకు అవసరమైన భూముల యొక్క నక్షా సదరు కార్యాలయము నందు కార్యాలయపు పనివేళలలో పరిశీలించవచ్చును.

సదరు చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి జిల్లా కలెక్టరు గారి అనుమతి లేకుండా షెడ్యూల్లో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ, విక్రయాలు లేదా ఏవిధమైన లావాదేవిలు జరుపరాదని తెలియచేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి ప్రతిపాదిత భూసేకరణ పై ఏమైన అభ్యంతరములుగాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల సంబంధిత వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 60 (అరువది) దినములలోగా ప్రత్యేక ఉపకలెక్టర్, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్ గారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

భూసేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో సేకరించబడవు.

పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉపకలెక్టర్ కార్యాలయము, నాగర్ కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

ఇట్టి ప్రతిపాదించిన భూసేకరణ తెలంగాణ ప్రభుత్వము నీటిపారుదల శాఖ G.O.Ms.No. 51, తేది.25.07.2017 ద్వారా భూసేకరణ, నష్ట పరిహారము, పునరావాస, పునరుపాధి కల్పన చట్టము, 2013 లోని అధ్యాయము- II మరియు అధ్యాయము-III అనగా సామాజిక ప్రభావిత అధ్యాయము మరియు ఆహార భద్రత నుండి మినహాయింపును ఇవ్వడము జరిగినది.

సం/- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), యూనిట్-1, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్
సం/- అదనపు కలెక్టర్ నాగర్‌కర్నూల్
సం/- జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్

DIPR RO NO. 509/LA/PP/Advt/Pub/2025-26



**పురపాలక సంఘ కార్యాలయం :: నర్సంపేట**
జిల్లా :: వరంగల్

టెండర్ నోటీసు నెం. ఇ1/238/2025 (టెండర్ నోటీసు) తేది: 23.08.2025

**1.పనుల సంఖ్య:** (1) పనులు సంఖ్య, **2. పనుల విలువ:** రూ.4 లక్షలు మున్సిపల్ సాదరణ నిధులు, **3. టెండర్ డాక్యుమెంట్లు లభించు తేదీలు:** 26-08-2025 (ఉ:10.30గం. నుండి 29-8-2025 (ఉ:10.30గం) గం.వరకు, **4. టెండర్లు స్వీకరించు తేది, సమయము:** 26-08-2025 ఉ: 10:30 నుండి 29-08-2025 ఉ: 10:30 గం. వరకు, **5. టెండర్లు తెరుచు తేది:** 29-08-2025 (ఉ:10.30గం.) గంటలకు, మిగతా వివరాలకు టెండర్. తెలంగాణ జిఓవి.ఇన్ వెబ్ సైట్ లో చూడగలరు.

సం/- కమీషనర్
పురపాలక సంఘం, నర్సంపేట
DIPR R.O. No. : 6985-PP/CL/ADVT/1/2025-26, Date: 23-08-2025



**పురపాలక సంఘం కార్యాలయము, తెల్లాపూర్**
సంగారెడ్డి జిల్లా

నోటీసు నెం. ఇ1/22/2025-26, (కొటేషన్ నోటీస్) తేది: 23.08.2025

1) తెల్లాపూర్ మున్సిపాలిటీ, సంగారెడ్డి జిల్లా కొటేషన్ నోటిస్ నం. ఇ1/22/2025-26, తేది:23.08.2025, ద్వారా తెల్లాపూర్ పురపాలక సంఘంకు 1) Tree Design Arch with park name letters with Tree Trunk in MS hallow with bending of branches, 2) Elevation view on column with artificial lawn and vertical MS hallow tubes, 3) Supply, Delivery and Installation of Computer accessories కొరకు కొటేషన్ కోరబడుతున్నవి. **కొటేషన్ స్వీకరణకు చివరి తేది:** 26.08.2025, సా.3.30గం.వరకు. అదే విధముగా పూర్తి వివరములకు కమిషనర్ తెల్లాపూర్ 8712693461 ను సంప్రదించగలరు.

సం/- మున్సిపల్ కమిషనర్,
తెల్లాపూర్ మున్సిపాలిటీ
DIPR R.O. No. : 7041-PP/CL/ADVT/1/2025-26, Date: 23-08-2025



**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
మూసాపేట్ సర్కిల్-23

NIT No. 25/GHMC/MPT/EE/2025-26 (టెండర్ ప్రకటన)

**పని పేరు:** సిసి రోడ్ & యుజిడి, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 25.08.2025న ఉ.10.30గం.ల నుండి 03.09.2025న ఉ.10.30గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ ఇ.యు.రమేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిహెచ్ఎంసి, మూసాపేట్ సర్కిల్-23. సెల్: 9949994029. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిహెచ్ఎంసి,
మూసాపేట్ సర్కిల్-23.
DIPR R.O. No. : 6975-PP/CL/ADVT/1/2025-26, Date: 23-08-2025



**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
మూసాపేట్ సర్కిల్-23

NIT No. 26/GHMC/MPT/EE/2025-26 (టెండర్ ప్రకటన)

**పని పేరు:** ఇతర పనులు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 26.08.2025న ఉ.10.30గం.ల నుండి 04.09.2025న ఉ.10.30గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ ఇ.యు.రమేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిహెచ్ఎంసి, మూసాపేట్ సర్కిల్-23. సెల్: 9949994029. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిహెచ్ఎంసి,
మూసాపేట్ సర్కిల్-23.
DIPR R.O. No. : 6965-PP/CL/ADVT/1/2025-26, Date: 23-08-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## భాషా, సాంస్కృతిక, సాహిత్య వికాసానికి కృషి
### మంత్రి జూపల్లి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ భాషా వ్యాప్తికి, సాంస్కృతిక వికాసానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణలో దశాబ్దాల కాలం నుంచి భాషా, సాహిత్య సాంస్కృతిక, కళల పరిరక్షణకు కృషి చేస్తున్న సంస్థల సేవలను ఈనాటికి కొనసాగించాల్సిన అవసరం ఉందని, వాటికి చేయూతను అందించాలని నిర్ణయించిందని తెలిపారు. ఈ క్రమంలోనే తెలంగాణ సారస్వత పరిషత్ కు రూ. 20 లక్షలు, కోఠిలోని శ్రీకృష్ణ దేవరాయ భాషా నిలయానికి రూ. 10 లక్షలు, చిక్కడపల్లి లోని త్యాగరాయ గాన సభకు రూ. 10 లక్షలు, వరంగల్ లోని పోతన విజ్ఞాన పీఠానికి రూ. 5 లక్షల వార్షిక గ్రాంట్ ను మంజూరు చేసిందని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత భాషా, సాంస్కృతిక అభివృద్ధికి, కళాకారుల అభ్యున్నతికి, కళల పట్ల ప్రజల్లో ఆసక్తి పెంపొందించేందుకు ఎంతగానో కృషి చేస్తుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

### 'యూరియా'ను సకాలంలో అందించాలని
## 25న మండల కేంద్రాల్లో ధర్నాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైతులకు 'యూరియా'ను సకాలంలో అందించాలని కోరుతూ ఈనెల 25న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో ధర్నాలు నిర్వహించనున్నట్టు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఎ ఐ కె ఎస్) అధ్యక్షులు బాగం హేమంత రావు, ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ తెలిపారు. రామగుండం ఎరువుల కర్మాగారాన్ని సత్వరమే మరమత్తు చేసి, యూరియా కొరతను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేశారు. పలు పంటల సాగు ముమ్మరంగా కొనసాగుతున్న సమయంలో యూరియా కొరతతో రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, ఎక్కడికక్కడ ఆందోళనకు దిగుతున్నారని, రోజంతా క్యూలైన్‌లో నిలబడి ఒక యూరియా బస్తా కోసం ఎదురుచూడాల్సిన వస్తుందని వారు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్, ఆగస్టు మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వం కేటాయించిన యూరియా కోటాలో దాదాపు మూడు లక్షల టన్నుల యూరియా రాష్ట్రానికి అందలేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి చెబుతున్నారని, సకాలంలో పంటలకు అవసరమయ్యే యూరియా సరఫరా చేయడంలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యం పట్ల రైతాంగం తీవ్ర ఆగ్రహంతో ఉన్నదని వారు తెలిపారు. యూరియా కొరతను యుద్ధ ప్రాతిపదికన తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని బాగం హేమంత రావు, పశ్యపద్మ డిమాండ్ చేశారు. యూరియా కొరతను అడ్డుపెట్టుకుని అనేక చోట్ల బ్లాక్‌లో విక్రయిస్తున్నారి, ప్రైవేట్ వ్యాపారులు ఒక బస్తాకు 70 శాతం వరకు అదనంగా వసూలు చేస్తూ రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వారిని రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని బాగం హేమంత రావు, పశ్యపద్మ డిమాండ్ చేశారు.

## సమన్ల తర్వాతే ఎన్‌బీడబ్ల్యూ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కోర్టు కేసు విచారణకు నిందితుడి హాజరీ కోసం నేరుగా నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేయరాదని హైకోర్టు తీర్పు చెప్పింది. ముందుగా సమన్లు, అవి అమలు కాకపోవతే బెయిలబుల్ వారెంట్, ఇదీ అమలు చేయకపోతే ఎన్‌బీడబ్ల్యూ జారీ చేయాలని చెప్పింది. పోలీసుల వివరాల ఆధారంగా నేరుగా ఎన్‌బీడబ్ల్యూ జారీ చేయరాదని జస్టిస్ తుకారంజీ చెప్పారు. రంగారెడ్డి జిల్లా రాగన్నగూడకు చెందిన న్యాయవాది చంద్రలేఖ, జయరాజ్ వేసిన పిటిషన్లపై ఈ ఉత్తర్వులను జారీ చేశారు. నిందితుల అరెస్ట్, జ్యుడిషియల్ కస్టడీలో పెట్టడానికి కారణాలు లేవన్నారు. పిటిషనర్లు ఇద్దరూ కింది కోర్టు విచారణకు హాజరు కావాలన్నారు. నాన్‌బెయిలబుల్ వారెంట్ల రద్దు పిటిషన్లను కింది కోర్టు ఆమోదిచాలని ఆదేశించారు.

## హుక్కాపై పరీక్షల ఫలితాలు చెప్పండి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హుక్కా సెంటర్స్‌పై పోలీసులు దాడులు చేశాక స్వాధీనం చేసుకునే హుక్కా వాడిన వారి ఆరోగ్యంపై ఎలాంటి ఫలితాలు ఉన్నాయో వైద్య పరీక్షలు చేయించారా, చేయిస్తే వాటి నివేదికల్లో ఏముందో చెప్పాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. పోలీసుల జోక్యం ఎక్కువైందంటూ మాదాపూర్‌లోని స్మోకీ టేల్స్ కేఫ్ అండ్ గ్రిల్ అనే హుక్కా సెంటర్ వేసిన పిటిషన్‌ను జస్టిస్ శ్రవణ్‌కుమార్ విచారించి పైవిధంగా ఉత్తర్వులు జారీ చేశారు. విచారణను ఈనెల 26కు వాయిదా వేశారు.



### వైన్స్ టెండర్లలో గౌడ్‌లకు
## 25 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం గౌడ్ లకు వైన్స్ షాపుల టెండర్లలో 25 శాతం రిజర్వేషన్లు కల్పించాలని , లేనట్లయితే ఈ నెల 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని తెలంగాణ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ తెలిపింది. హైదరాబాద్‌లో శనివారం తెలంగాణ గౌడ కల్లుగీత వృత్తి దారుల సంఘం అధ్యక్షులు ఆయిలి వెంకన్న గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్, కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగొని బాలరాజు గౌడ్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో గీత కార్మికులు చాలా మంది ప్రమాదశావత్తు మరణించారని, వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించడంలేదన్నారు. ఈనెల 25న ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తామన్నారు. ఆతర్వాత 5 లక్షల మందితో పరేడ్ గ్రౌండ్‌లో గౌడ ఆత్మగౌరవ సభ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో గౌడ ఐక్యసాధన సమితి అధ్యక్షులు అంబాల నారాయణగౌడ్, అఖిలభారత గౌడ సంఘం అధ్యక్షులు కూరెళ్ల వేములయ్యగౌడ్, అనంత రాజు గౌడ్, దామోదర్ గౌడ్, చీకటి ప్రభాకర్ గౌడ్ పాల్గొన్నారు.




## నూతన పిఆర్‌ఎస్ అమలుకు
## సిఎం చొరవ చూపాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నూతన పిఆర్‌సి అమలుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపాలని ఎస్‌టియుటిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యం. పర్వత్ రెడ్డి, జి. సదానందం గౌడ్ అన్నారు. హైదరాబాద్ లోని సంఘ భవనంలో శనివారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పిఆర్‌సి గడువు ముగిసి రెండేళ్లైనా, నివేదిక బహిర్గతం చేయకపోవడం సరి కాదని అన్నారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఒక సారి బదిలీలు, రెండు సార్లు పదోన్నతులు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం తరహాలో బదిలీలకు సంబంధించి యాక్ట్ రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయ సమస్యలపై ఎప్పటికప్పుడు ఎస్‌టియు రాజీ లేనిపోరాటాలు చేస్తుందని అన్నారు.టిజిఇ జెఎసి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1నహైద్రాబాద్ లో చేప్ట పాత పెన్షన్ సాధన ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పెండింగులో ఉన్న డిఎలను వెంటనే మంజూరు చే యాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మరణం పట్ల శ్రద్ధాంజలి ఘటించారు. ఇటీవల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందిన సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఆట సదయ్య, రాష్ట్ర నాయకులు జుట్టు గజేందర్, నర్సింహారెడ్డి, రంగా రావు, కృష్ణా రెడ్డి, పోల్ రెడ్డి, బి. రవీంద్ర, శీతల్ చౌహాన్, 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

### ప్రతి పని విషయంలో ప్రజలకు
# జవాబుదారితనంగా ఉంటాం

### హైడ్రా కమిషనర్ రంగనాథ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైడ్రా చేపట్టే ప్రతి పని విషయంలో ప్రజలకు జవాబుదారితనంగా ఉంటుందని హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ స్పష్టం చేశారు. హైడ్రాపై ప్రజలకు మరింత స్పష్టత రావాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యూజె) ఆధ్వర్యంలో 'మహానగర అభివృద్ధి–ఆటంకాలు' అనే అంశంపై హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో మీట్ ది ప్రెస్ కార్యక్రమం శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారకభవన్‌లో జరిగింది. కార్యక్రమానికి టియుడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ మోడరేటర్‌గా వ్యవహరించగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామ్‌నారాయణ స్వాగతం పలికారు. సమావేశంలో రంగనాథ్ మాట్లాడుతూ హైడ్రా రాజకీయాలకు అతీతంగా కులం, మతం, ధనవంతులు అనే తేడా లేకుండా హైడ్రా పనిచేస్తోందని, గండిపేట చెరువులో రాజకీయ నాయకుల ఆక్రమణలను తొలగించామని, హిమాయత్‌సాగర్‌కు హద్దులు ఇంకా నిర్ధారించలేదన్నారు. నగరంలోని చెరువులన్నింటికీ ఏడాదిలో తుది నోటిఫికేషన్ ఇస్తామని వివరించారు. ఫాతిమా కళాశాల విషయంలో సామాజిక మాధ్యమాల్లో వెల్లువెత్తుతున్న విమర్శలపై రంగనాథ్ స్పందిస్తూ చట్టం అందరికీ ఒకే రకంగా వర్తిస్తుందని స్పష్టం చేశారు. పాతబస్తీలోని మల్కం చెరువు పరిధిలోకి వస్తుందన్న ఫాతిమా కాలేజీ, మేడ్చల్ జిల్లాలోని మల్లారెడ్డి కాలేజీ, పల్లా రాజేశ్వర రెడ్డి కళాశాలలైనా అన్నింటిలోనూ ఒకే విధానం హైడ్రాకు ఉందన్నారు. హద్దులు నిర్ధారించాకే చర్యలు చేపడతామని ఓ ప్రశ్నకు సమాధానంగా రంగనాథ్ చెప్పారు. ఫాతిమా కాలేజీ 2015లో నిర్మాణమైందని, 2016లో మల్కం చెరువుకు ప్రిలిమనరీ నోటిఫికేషన్ ఇచ్చారని, ఫైనల్ నోటిఫికేషన్ ఆధారంగా చర్యలుంటాయి. నగరంలో 80 శాతం చెరువులకు ఫైనల్ నోటిఫికేషన్‌తో పాటు ప్రిలిమినరీ కూడా లేదని, నగరంలో సుమారు 900 చెరువులు, నీటి వనరులు ఉన్నాయని, 65 శాతం చెరువులు కనుమరుగైపోయాయన్నారు. ఇందులో కేవలం 140 చెరువులకు మాత్రమే ఫైనల్ నోటిఫికేషన్ వచ్చిందని, మిగతావి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. న్యాయస్థానాల్లో సమస్యలు తలెత్తకుండా ఉండేందుకే అన్ని అంశాలను సేకరిస్తున్నామన్నారు. నగర భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని హైడ్రా పనిచేస్తోందని, ముందు తరాలకు హైడ్రా ఫలాలు మరింత అందుతాయన్నారు. ఒకటి రెండేళ్ల లక్ష్యంగా కాకుండా.. వందేళ్లను దృష్టిలో పెట్టుకుని హైడ్రా పనిచేస్తోందన్నారు. తొలుత హైడ్రాపై కొన్ని అపోహలున్నప్పటికీ ఫలితాలను చూస్తున్న నగర ప్రజలకు స్పష్టత వస్తోందన్నారు. హైడ్రా వల్ల నగరానికి మేలు జరిగిందని, ఇకపై మరింత మంచి జరుగుతుందన్నారు. రాజకీయ ఉద్దేశంతో హైడ్రా పనిచేయడంలేదని స్పష్టం చేశారు. గొలుసు కట్టు చెరువులను కాపాడడం, వాటిని అభివృద్ధి చేయడం ద్వారా వరదలు నివరారించడానికి కృషి చేస్తున్నామని హైడ్రా కమిషనర్ తెలిపారు. దాదాపు 500ల ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడామని దీని విలువ రూ.30 వేల కోట్లకు పైగా ఉంటుందని చెప్పారు. వందలాది పార్కులను కాపాడామని, లేఔట్లను పునరుద్ధరించి అనేకమంది సామాన్యులకు న్యాయం చేశామన్నారు. కార్యక్రమంలో ఐజెయు స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, జాతీయ కార్యదర్శి వై.నరేందర్ రెడ్డి, టియుడబ్ల్యుజె రాష్ట్ర ఉప ప్రధానకార్యదర్శి కె.రాములు తదితరులు హాజరయ్యారు. సమావేశంలో తొలుత తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తమ గ్రామంలో యువకులు, మహిళలు, విద్యార్థులు గంజాయి వ్యాపారాల్లో ఉన్నారని, వారిపై అనేక కేసులు ఉండేవని, అలాంటి సమయంలో తమ గ్రామం గంజాయి వ్యాపారంలో లేకుండా చూడాలని అప్పటి నల్లగొండ ఎస్‌పిగా ఉన్న ప్రస్తుత హైడ్రా కమిషనర్ రంగనాథ్ కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని వివరించారు. నార్కట్‌పల్లి పక్కనే ఉన్న తమ గ్రామంలో పెద్ద సభ నిర్వహించి, అందరిని ఆహ్వానించి గంజాయి వ్యాపారం చేయకుండా మారితే కేసులను రద్దు చేస్తామని హామీనిచ్చిన విషయాన్ని శ్రీనివాస రెడ్డి గుర్తు చేశారు. ప్రస్తుతం తమ గ్రామంలో గంజాయి వ్యాపారానికి అవకాశం లేదన్నారు. కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలు, సూచనలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ వివరణ ఇచ్చారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్, మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి టియుడబ్ల్యూజె నేతలు తిలకించారు.



## ''ఓట్ చోరీ-గద్దీ చోడ్'' ఉద్యమాన్ని బలోపేతం చేయాలి

### టిపిసిసి పిఎసి సమావేశంలో తీర్మానం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రారంభించిన 'ఓట్ చోరీగద్దీ చోడ్' ఉద్యమాన్ని తెలంగాణలో విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని టిపిసిసి పొలిటికల్ అఫైర్స్, టిపిసిసి అడ్వైజరీ కమిటీ సమావేశంలో నేతలు తీర్మానించారు. గాంధీభవన్‌లో శనివారం టిపిసిసి పొలిటికల్ అఫైర్స్, టిపిసిసి అడ్వైజరీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఓట్ చోరీ కి సంబంధించిన ప్రచార లోగో ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, కార్యదర్శి విశ్వనాథన్ పిఎసి సభ్యుల సమక్షంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ..దేశంలో ఓట్ చోరీ పెద్దఎత్తున జరిగిందన్నారు. బిజెపి ఓట్ చోరీ తోనే మూడో సారి గెలిచిందని ఆరోపించారు. రాహుల్ గాంధీ ఈ విషయంలో సమగ్రమైన సమాచారాన్ని ఇచ్చి ప్రజల్లో ఉద్యమాన్ని చేపట్టారని గుర్తు చేశారు. దీనిపై రాష్ట్రంలో విస్తృతంగా తీసుకెళ్లాలి.. ప్రజల్లో ఓట్ చోరిపై చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ప్రజా పాలన అద్భుతమైన ఫలితాలు ఇచ్చిందన్నారు. రైతు భరోసా, రుణమాఫీ, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం లాంటి కార్యక్రమాలు మంచి స్పందన వస్తున్నాయన్నారు.టిపిసిసి ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర కు ప్రజల్లో మంచి స్పందన వస్తుందని, ప్రజలు బ్రాహ్మరథం పడుతున్నారని అన్నారు. స్థానిక సంస్థలు ఎన్నికల్లో మనం ఘన విజయం సాధించేందుకు మంచి అవకాశాలు ఉన్నామని అభిప్రాయపడ్డారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల ను కూడా మనం చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో యూరియా కొరత ఉందని ఒక దుష్ప్రచారం చేస్తూ బీఆర్ ఎస్ రైతుల్లో ఒక భయాందోళనలు సృష్టిస్తూ రాజకీయాలు చేస్తుందని ఆరోపించారు.

ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో తెలంగాణ కు చెందిన ప్రజాస్వామ్య వాదీ, రాజ్యాంగ నిపుణులు జస్టిస్ సుదర్శన్ రెడ్డి గారిని ఇండియా కూటమి తరపున అభ్యర్థిగా ఎంపిక చేయడం పట్ల పీఏసీ సమావేశం హర్షం వ్యక్తం చేసింది.అలాగే ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలు విషయంలో హైకోర్టు కోర్ట్ తీర్పు నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే విషయంలో చర్చ జరిగింది. ఎఐసిసి పిలుపు మేరకు ఓట్ చోరీ, గద్దీ చోడ్ ఉద్యమాన్ని రాష్ట్రంలో విస్తృతంగా చేపట్టే అంశాలపై కూడా చర్చించారు. ప్రజాపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలలో అనుసరించాల్సిన వ్యూహాలు, రాష్ట్రంలో పార్టీ సంస్థాగత నిర్మాణం, గ్రామ, మండల, జిల్లా కమిటీల నిర్మాణం రాష్ట్ర స్థాయి లో పెండింగ్ లో ఉన్న కమిటీల నిర్మాణం పై కూడా సుధీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో యూరియా కొరత లపై బిఆర్‌ఎస్, బిజెపి పార్టీలు చేస్తున్న రాజకీయంతో పాటు చర్చించారు.

## సామాజిక సమస్యలే నా రచనలకు
## ఇతివృత్తాలు: సయ్యద్ సలీం



**ప్రజాపక్షం / హైదరాబాద్:** 'మన చుట్టూ ఉన్న సమాజం, మనుషుల స్వభావాలు, సంబంధాలు, మసకబారుతున్న మానవ విలువలు, సామాజిక సమస్యలు, అంతర్ బహిర్ సంఘర్షణలు నా కవిత్వానికి, కథలకు, నవలలకు ఇతివృత్తాలు' అని సుప్రసిద్ధ సాహితీవేత్త, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత సయ్యద్ సలీంఅన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రవీంద్రభారతిలో 'రచయిత సయ్యద్ సలీంతో ముఖాముఖి' కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో సలీం మాట్లాడుతూ..''నా జీవితంలో ఆకలి, అవమానాలు నేర్పిన పాఠాలే నా సాహితీ సృజనకు పునాదులుగా మారాయి. ఓ కుగ్రామంలో నిరుపేద, నిరక్షరాస్యులైన ముస్లిం దంపతులకు పుట్టిన నేను ఈస్థాయికి చేరుకోడానికి చాలా పోరాటాలే చేశాను. చదువులో పీజీ వరకు ఎప్పుడూ ప్రథమస్థానంలో నిలబడిన నాకు మంచి ఉద్యోగం దొరకడం, డాక్టర్ గీతానాగరాణితో వివాహం తర్వాత జీవితం ఓ అందమైన మలుపు తిరిగింది. అని తమ జీవిత, సాహిత్య ప్రస్థానాన్ని వివరించారు. కొందరు సభికులు అడిగిన ప్రశ్నలకు సముచితరీతిన సమాధానాలిచ్చారు. సభాప్రారంభంలో కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యులు, తెలుగు విశ్వవిద్యాల యం పూర్వ ఉపకులపతి ఆచార్య ఎస్వీ సత్యనారాయణ రచయితను సభికులకు పరిచయం చేసి, సభను నిర్వహించారు. సభలో ప్రొఫెసర్ సి. మృణాళిని, ప్రొఫెసర్ కరిమిండ్ల లావణ్య, డాక్టర్ నాళేశ్వరం శంకరం, డా. ఎస్. రఘుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక కారణాలతో
## యూరియ ఉత్పత్తి ఆగిపోయింది
### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**ప్రజాపక్షం / హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన యూరియ సాంకేతిక కారణాలతో రామగుండంలో ఉత్పత్తి ఆగిపోయిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శనివారం మీడియా ప్రతినిధులతో చేసిన చిట్‌చాట్‌లో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా సరఫరా విషయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనతో మాట్లాడారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. రాష్ట్రానికి మరో 50 వేల మెట్రిక టన్నుల యూరియా కావాలని కోరినట్లు చెప్పారన్నారు. రావాల్సిన వాటా తప్పకుండా పంపిస్తామని చెప్పానని తెలిపారు. సాంకేతిక కారణాలతో రామగుండంలో యూరియా ఉత్పత్తి ఆగిపోయిందన్నారు. కాళేశ్వరంపై సిబిఐ విచారణ చేయాలని కమిషన్ నివేదికపై ఏం చర్యలు తీసుకుంటారో చూస్తామన్నారు. మొయినాబాద్ ఫాం హౌస్ కేసుతో బిజెపికి సంబంధం లేదన్నారు. పార్టీలు మారడం సర్వసాధారణంగా మారిపోయిందన్నారు. మా పార్టీలోకి రావాలంటే రాజీనామా చేసి రావాలన్నారు. పార్టీ ఫిరాయింపుల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ దొందూ దొందేనని విమర్శించారు. హైదరాబాద్ మెట్రో నష్టాల్లో నడుస్తోందని కొత్త లైన్ వేసేందుకు ఎల్ అంట్ టి సుముఖంగా లేదన్నారు. మెట్రో రెండోదశకు సహకరించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు.

**తెలంగాణలోను ఎస్‌ఐఆర్ జరగాలి..**

తెలంగాణలో ఇంటెన్సివ్ రివిజన్ ఆఫ్ ఓటర్ లిస్ట్ (ఎస్‌ఐఆర్) సరవణ జరగాలని కిషన్ రెడ్డి అన్నారు. సవరణ జరిగితే హైదరాబాద్ లో 4 లక్షల ఓట్లు తొలగించాలన్నారు. హైదరాబాద్ లో డబుల్ ఓట్లు ఎక్కువ ఉన్నాయన్నారు. మేం ఓట్ల చోరీ చేస్తే మా ఎంపి సీట్లు ఎందుకు తగ్గాయని ప్రశ్నించారు. బిహార్ లో బిజెపికి అనుకూల వాతావరణంఉందన్నారు. రాహుల్ పాదయాత్ర ఎందుకో వారికే తెలియదన్నారు. బిహార్ లో బీజేపీదే అధికారం అని ధీమా వ్యక్తం చేశారు.

## 'యూరియా'ను వెంటనే
## సరఫరా చేయండి: హరీశ్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఒక వైపు యూరియా కొరతతో రాష్ట్ర రైతాంగం అల్లకల్లోలమైతుంటే,అధికార పక్షం దీనిని ప్రతిపక్షాల దుష్పచారమని చెప్పడం సిగ్గుచేటని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. యూరియా బస్తాలు ఇవ్వాలని రైతులు అధికారుల కాళ్లు పట్టుకుని వేడుకున్నది అబద్ధమా అని ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యూరియా కొరతకు కారణమైన వారే యూరియా పేరు చెప్పి రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లనే, సిఎం, వ్యవసాయ మంత్రి చేతగాని తనంతోనే రాష్ట్రానికి ఎరువుల కొరత వచ్చిందన్నారు. యూరియా, ఎరువుల కొరతపై వెంటనే సమీక్ష నిర్వహించి, రైతాంగానికి అవసరమైన యూరియాను వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

## ఏకమైన జలమండలి కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘాలు
### ఐఎన్‌టియుసి నేతృత్వంలో పనిచేయాలని నిర్ణయం
### హెచ్‌ఎండబ్లుఎస్‌ఎస్‌బి ట్రేడ్ యూనియన్స్ జెఎసి అధ్యక్షుడిగా మొగుళ్ల రాజిరెడ్డి ఎన్నిక



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై, సీవరేజ్ బోర్డ్ 'హెచ్‌ఎండబ్లుఎస్‌ఎస్‌బి) ఉద్యోగుల హక్కులు, ప్రయోజనాలను పరిరక్షించేందుకు, మెరుగైన పని పరిస్థితులను కల్పించడానికి, కార్మికుల సేవలను సమర్థవంతంగా అందించేందుకు కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘాలు ఐఎన్‌టియుసి ఆధ్వర్యంలో పనిచేయాలని నిర్ణయించామని హెచ్‌ఎండబ్లుఎస్‌ఎస్‌బి ట్రేడ్ యూనియన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడిగా మొగుళ్ల రాజి రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్ నారాయణగూడలోని ఐఎన్.టి.యు.సి కార్యాలయంలో శనివారం జరిగిన కాంగ్రెస్ అనుబంధ జలమండలి కార్మిక సంఘాల సమావేశంలో కార్మిక సంఘాల సమిష్టి కార్యక్రమాలకు నాయకత్వం వహించడానికి హెచ్‌ఎండబ్లుఎస్‌ఎస్‌బి ట్రేడ్ యూనియన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి) అధ్యక్షుడిగా మొగుళ్ల రాజి రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జెఎసి కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా టి.పి.రాఘవేంద్ర రాజ్, ఎ.శ్రావణ్ కుమార్, మొహమ్మద్ జహంగీర్, బి.దేవేందర్, చంద్రశేఖర్, సయ్యద్ అక్తర్ అలీ, బి.నర్సింగ్ రావు, ఎం.రాజా, బి.జైరాజ్, సురేష్ బాబు, కె.రామ రాజు, బి.భూమయ్యలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మొగుళ్ల రాజిరెడ్డి మాట్లాడుతూ జలమండలి గుర్తింపు సంఘమైన బిఆర్‌ఎస్ అనుబంధ బిఆర్‌టియు నేతల చేతకాని తనం వల్ల ఓవర్ టైమ్ (ఓటి) చేసిన కార్మికులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అదనంగా పనిచేసిన కార్మికులకు ఓటి అలవెన్స్ చెల్లించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జలమండలి ఎండి దృష్టికి తీసుకెళ్లి త్వరలో ఇప్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

## సైబర్ సెక్యూరిటీ బలోపేతంపై ఒప్పందం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సైబర్ సెక్యూరిటీ పరిశోధన, విధానాన్ని బలోపేతం చేయడానికి తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బి)తో శనివారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ మాట్లాడుతూ.. సైబర్ నేరాలు పోలీసింగ్‌లో వేగంగా పెరుగుతున్న సవాళ్లు, ఇలాంటి భాగస్వామ్యాలు సిద్దపడేందుకు కీలకంగా ఉంటుందన్నారు. ఐఎస్‌బి డేటా సైన్స్ నైపుణ్యాన్ని, టిజిసిఎస్‌బి ప్రాక్టికల్ అనుభవంతో సంకలనం చేసి కొత్త సాధనాలు అభివృద్ధి చేసి సైబర్ నేరాలను నివారించడమే తమ లక్ష్యం అని అన్నారు. ఈ ఎంఒయు బాధితులను రక్షించి, డిజిటల్ తెలంగాణను నిర్మాంచాలన్న తమ సంకల్పానికి ప్రతీక అని అన్నారు. ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల మాట్లాడుతూ..సైబర్ సెక్యూరిటీలో టిజిసిఎస్‌బితో కలిసి పనిచేయడం ఐఎస్‌బికి ఆనందంగా ఉందన్నారు. డేటా సైన్స్, ఎఐ ద్వారా ఆర్థిక భద్రత పెంచి, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు అవసరమైన సామర్థ్యాలు కల్పించడమే ఈ భాగస్వామ్యం లక్ష్యం అన్నారు. టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయల్ మాట్లాడుతూ..సైబర్ నేరాలపై పోరాటం కోంసం ఇన్నోవేషన్, సహకారం, నాలెడ్జ్ ఎకోసిస్టమ్ అత్యవసరం అన్నారు. టిజిసిఎస్‌బి కేవలం నేరాలకు ప్రతిస్పందించడం మాత్రమే కాకుండా, భవిష్యత్తు ముప్పులను అంచనా వేసి ఎదుర్కొనే విధానాలను కూడా రూపొందిస్తోందన్నారు. ఐఎస్‌బితో ఈ భాగస్వామ్యం కొత్త సైబర్ నేరాల మోడళ్లను ఎదుర్కోవడానికి సహకరిస్తుందన్నారు. దీని ద్వారా విచారణ సామర్థ్యం పెరిగి, ఆర్థిక మోసాల నివారణ మరింత బలోపేతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఒయుపై శిఖాగోయల్, ఐఎస్‌బి తరపున ప్రొఫెసర్ మనీష్ గంగ్వార్ సంతకం చేశారు.ఈ ఒప్పందం ద్వారా సైబర్ నేరాలు, ముఖ్యంగా ఆర్థిక మోసాలను ఎదుర్కొనే క్రమంలో పరిశోధన , టెక్నాలజీ ఆధారిత సాధనలు, విధాన ఫ్రేమ్ వర్క్‌ల రూపకల్పనలో ఇరు సంస్థలు కలిసి చేస్తాయి. ఎఐ ఆధారిత రిస్క్ మోడల్స్, నివారణపై డిజిటల్ లావాదేవీల్లో మ్యూల్ అకౌంట్లను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టేందుకు ప్రెడిక్టీవ్ మోడల్స్ ఉన్నాయి. పరిశోధన ఫలితాల ప్రచురణ, కేస్ స్టడీస్, స్టేక్‌హోల్డర్ డైలాగ్స్, ఇమర్సివ్ , గేమిఫైడ్ ట్రైనింగ్ ద్వారా న్యాయ అమలు బలోపేతం అవుతుంది. కార్యక్రమంలో ఐపిఎస్ అధికారి హర్షవర్ధన్, డిఎస్‌పిలు హరికృష్ణ, సూర్యప్రకాశ్, వాసు, సంపత్‌లతో పాటు ఐఎస్‌బి నుంచి డాక్టర్ శృతి మంత్రికి, జి.సందీప్, పెకేటి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఎఫ్ఐఆర్‌లకు ఎవరు భయపడుతారు?

**కతిహార్ :** బిజెపి పాలిత మహారాష్ట్రలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురించి సోషల్ మీడియా పోస్ట్ చేసినందుకు తనపై ఎఫ్ఐఆర్ నమోదైనా తాను భయపడనని, నిజం మాట్లాడుతూనే ఉంటానని ఆర్‌జెడి నాయకుడు తేజస్వి యాదవ్ స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు 'జుమ్లా' (వాక్చాతుర్యం) అని ఆరోపిస్తూ శుక్రవారం బిహార్ పర్యటనకు ముందు యాదవ్ తన ఎక్స్ హ్యాండిల్‌లో చేసిన పోస్ట్‌కు గడ్చిరోలి జిల్లాలో కేసు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌కు ఎవరు భయపడతారు? జుమ్లా అనేది అభ్యంతరకరమైన పదమా? తాను నిజం చెబుతున్నాను, వాటిని అలాగే కొనసాగిస్తానని, తనపై వారికి నచ్చినన్ని కేసులు నమోదు చేసుకోవచ్చని తేజస్వీ విమర్శలు చేశారు. ఓటరు అధికార్ యాత్రలో భాగంగా రాష్ట్రంలో పర్యటిస్తున్న కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీతో కలిసి ఉత్తర బిహార్ జిల్లాలోని కతిహార్‌లోని చేపల మార్కెట్లు, మఖానా పొలాలను పర్యటిస్తూ బిహార్ మాజీడిప్యూటీ సిఎం మాట్లాడారు. కతిహార్‌లోని ఒక భాగాన్ని కవర్ చేసే స్వతంత్ర ఎంపీ రాజేష్ రంజన్ అలియాస్ పప్పు యాదవ్ సహా అనేక మంది నాయకుల సమక్షంలో గాంధీ మత్స్యకారులతో, మఖానా (నక్క గింజలు) సాగుదారులతో మాట్లాడుతూ వారి సమస్యలను విన్నారు.

## భారత్ 'రెడ్‌లైన్ల'ను కలిగి ఉన్నప్పటికీ... వాణిజ్య ఒప్పందం కోసం అమెరికాతో చర్చలు

విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ స్పష్టీకరణ

'ఎకనామిక్ టైమ్స్ వరల్డ్ లీడర్స్ ఫోరమ్'లో కీలక ప్రసంగం



**న్యూఢిల్లీ :** అమెరికాతో వాణిజ్య చర్చలలో భారతదేశం కొన్ని రెడ్‌లైన్లను కలిగి ఉన్నదని, రైతులు, చిన్న ఉత్పత్తిదారుల ప్రయోజనాలను కాపాడటంలో న్యూఢిల్లీ రాజీపడబోదని విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ స్పష్టం చేశారు. వాణిజ్య ఒప్పందం విషయంలో ఇరుపక్షాల మధ్య చర్చలు జరుగుతున్నాయని మంత్రి చెప్పారు. శనివారం ఎకనామిక్ టైమ్స్ వరల్డ్ లీడర్స్ ఫోరమ్‌లో ఆయన ప్రసంగించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచంతో వ్యవహరించే తీరు సాంప్రదాయ పద్ధతి నుంచి 'ఒక పెద్ద నిష్క్రమణ' అని, అయితే యావత్ ప్రపంచం ఈ సమస్యను ఎదుర్కొంటున్నదని తెలిపారు. ప్రస్తుతం విదేశాంగ విధానాన్ని అమెరికా అధ్యక్షుడు మాదిరిగా బహిరంగంగా ప్రకటించిన వారు మరొకరు లేరన్నారు. అది కేవలం భారతదేశానికి మాత్రమే పరిమితమైన నిష్క్రమణ కాదని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ వివరించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతదేశ వస్తువులపై సుంకాలను 50శాతానికి రెట్టింపు చేయడంతో న్యూఢిల్లీ, వాషింగ్టన్ మధ్య సంబంధాలు క్షీణించాయని, దీనిలో భారతదేశం రష్యా దేశం నుంచి ముడిచమురు కొనుగోలుపై 25శాతం సుంకాలు కూడా ఉన్నాయని మంత్రి తెలిపారు. విదేశాంగ మంత్రి మాట్లాడుతూ వాణిజ్యం ఇరు దేశాల మధ్య చాలా ముఖ్యమైనది అని చెప్పారు. 'ఈ విషయమై చర్చలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. అయితే మనం కొన్ని రెడ్‌లైన్లను కలిగి ఉన్నాం. రెడ్‌లైన్లు ప్రధానంగా మన రైతులు, కొంతమంది చిన్న ఉత్పత్తిదారుల ప్రయోజనాలకు సంబంధించినవి కాబట్టి ప్రజలు మేం విజయం సాధించామని లేదా వైఫల్యం చెందామని మాట్లాడుకుంటున్నప్పుడు మొదలైంది. దీనికి నా సమాధానం ఏమిటంటే...మా రైతు, చిన్న ఉత్పత్తిదారుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ఒక ప్రభుత్వంగా మేం కట్టుబడి ఉన్నాం. మేం దానిపై చాలా దృఢంగా ఉన్నాం. మేం ఆ విషయంలో రాజీపడలేం' అని జైశంకర్ అన్నారు. భారతదేశం లాభదాయకం అని ట్రంప్ పరిపాలనా అధికారులు పదేపదే చేస్తున్న ఆరోపణలకు కూడా మంత్రి స్పందించారు. అమెరికా ప్రభుత్వం అనుకూలం కోసం పనిచేసే వ్యక్తులు, ఇతర వ్యక్తులు వ్యాపారాలు చేస్తున్నారని నిందించడం హాస్యాస్పదంగా ఉన్నదని జైశంకర్ చెప్పారు. న్యూఢిల్లీవాషింగ్టన్ సంబంధాలలో ఉద్రిక్తతల దృష్ట్యా చైనాతో భారతదేశం సంబంధాలు మెరుగుపడుతున్నాయనే వ్యాఖ్యలను కూడా మంత్రి జైశంకర్ తోసిపుచ్చారు.

## మినీ వ్యాన్, ట్రక్కు ఢీకొని 8 మంది మృతి

నలుగురికి గాయాలు



**పాట్నా :** శనివారం పాట్నా శివార్లలో మినీ వ్యాన్, ట్రక్కు ఢీకొన్న ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందగా, నలుగురు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. పాట్నా–నలంద సరిహద్దు సమీపంలోని షాజహాన్‌పూర్‌లో తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగిందని వారు తెలిపారు. మరణించిన వారిలో ఏడుగురు మహిళలు కూడా ఉన్నారని వారు తెలిపారు. క్షతగాత్రులను సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్పీ (గ్రామీణ) విక్రమ్ సింగ్ తెలిపారు. ట్రక్కు డ్రైవర్ అక్కడి నుండి పారిపోయాడని ఆయన అన్నారు. పాట్నాలో జరిగిన విషాదకర ప్రమాదంపై ముఖ్యమంత్రి నితీష్ కుమార్ తీవ్ర విచారం వ్యక్తం చేసి, మృతుల కుటుంబాలకు తన సంతాపాన్ని ప్రకటించినట్లు సిఎంఒ తెలిపింది.

# ప్రజాస్వామ్యాన్ని రక్షించి, రాజ్యాంగాన్ని కాపాడతా

'ఇండియా' ఉపరాష్ట్రపతి అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి ప్రతిజ్ఞ



**న్యూఢిల్లీ:** దేశంలో ప్రజాస్వామ్యం కొరవడిందని, భారత రాజ్యాంగం సవాళ్ళు ఎదుర్కొంటోందని 'ఇండియా' కూటమి తరఫున ఎన్నికలబరిలోకి దిగిన ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. దేశ ప్రజాస్వామ్యాన్ని రక్షించి, రాజ్యాంగాన్ని కాపాడుతానని ఆయన ప్రతిజ్ఞ చేశారు. ఉపరాష్ట్రపదవికోసం ఇద్దరు వ్యక్తులమధ్య కాకుండా, రెండు విభిన్న సిద్ధాంతాలమధ్య పోటీ జరుగుతోందని స్పష్టం చేశారు. దేశంలో కులగణనకు ఆయన మద్దతు ప్రకటించారు. శనివారం పిటిఐ వార్తాసంస్థకు ఇచ్చిన విస్తారమైన ఇంటర్వ్యూలో ఆయన అనేక అంశాలు ప్రస్తావించారు. అభ్యర్థిత్వానికి ఎలా ఎంపికయ్యారనే విషయం దగ్గర నుండి రాజ్యాంగ పీఠికలో ప్రస్తావించిన సామ్యవాదం, లౌకికవాదం అనే పదాలపై చర్చ, నక్సలిజానికి మద్దతు ఇస్తున్నట్లు ఆయనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యల వరకూ అనేక విషయాలపై సుదర్శనరెడ్డి మాట్లాడారు. ఈ పదవికి అభ్యర్థిగా ప్రతిపక్షాలు ఏకగ్రీవంగా ఎంపిక చేయడం తనకు ఎంతో గౌరవప్రదమైన అంశమన్నారు. తన అభ్యర్థిత్వాన్ని ఎంపిక చేయడంపై ఒక విశ్లేషణ చేస్తూ, దేశంలో 63 శాతం లేదా 64 శాతం కంటే ఎక్కువ మంది ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రతిపక్షాలు ఏకగ్రీవంగా ఎంపిక చేసినప్పుడు అంతకంటే ఇంక కావాల్సింది ఏముందని, అంతకంటే గొప్ప గౌరవం తనకు ఏముందని ప్రశ్నించారు. అధికార–ప్రతిపక్షాలు జాతీయ సమస్యలపై గతంలో ఎంతో సమన్వయంతో వ్యవహరించేవని, దురదృష్టవశాత్తూ ఈనాడు అలాంటి పరిస్థితులు లేవని విచారం వ్యక్తం చేశారు. పార్లమెంటు కార్యకలాపాలకు అంతరాయం కలగడం అనేది ప్రజాస్వామ్య వ్యవస్థలో అనివార్యమైన అంశమని, కానీ ప్రజాస్వామ్య ప్రక్రియలో అది అంతర్భాగంగా మాత్రం ఉండకూడదని హెచ్చరించారు. గతంలో దేశ ఆర్థిక వ్యవస్థలో లోటు గురించి చర్చ జరిగేదని, కానీ ఈనాడు మాత్రం దేశంలో ప్రజాస్వామ్యం కొరవడిందనే విషయంపైనే చర్చజరుగుతోందన్నారు. భారతదేశం రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్య వ్యవస్థగా కొనసాగుతున్నప్పటికీ కూడా భారత ప్రజాస్వామ్యం తీవ్రమైన ఒత్తిడికి గురవుతోందన్నారు. 'రాజ్యాంగం దాడికి గురవుతోందా?' అనే అంశంపై చర్చ ఎంతో హర్షణీయమైన విషయమన్నారు. వ్యక్తులమధ్య ఘర్షణ జరిగినప్పుడు ప్రజాస్వామ్యం లోపిస్తుందని, భావజాలం మధ్య ఎక్కువ ఘర్షణ జరుగుతుందన్నారు. ప్రభుత్వం, ప్రతిపక్షాలమధ్య సైద్ధాంతిక భావజాల ఘర్షణలో సంబంధాలు ఉత్తమస్థాయిలోనే ఉండాలన్నారు. గువహటి రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసి పదవీ విరమణ చేసిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, 'రాజ్యాంగాన్ని సమున్నతస్థానంలో ఉంచేందుకు చేస్తున్న తన ప్రయాణం కొనసాగుతుందని, రాజ్యాంగాన్ని రక్షించి, కాపాడేందుకు ఒక అవకాశం గనుక ఇచ్చినప్పుడు అంతిమంగా తన ప్రయాణం అక్కడ ముగుస్తుందన్నారు. 'ఈ ప్రయాణం భవిష్యత్‌లో కూడా ఎప్పుడూ ఒకేవిధంగా ఉండాలనేది నా ఉద్దేశం, రాజ్యాంగాన్ని రక్షించేందుకు, కాపాడేందుకు ఒక అవకాశం ఇచ్చినప్పుడు ఆ సంరక్షణంలోనే అంతిమంగా నా ప్రయాణం ముగుస్తుంది, ఒక న్యాయమూర్తిగా ప్రమాణం చేసినప్పటినుండీ ఇప్పటివరకూ నేను భారత రాజ్యాంగాన్ని కాపాడుతూ సమున్నతస్థానంలో ఉంచుతూ వచ్చాను, అందువల్ల ఈ ప్రయాణం నాకు కొత్తేమీ కాదు' అని పిటిఐ ప్రతినిధికి సుదర్శన్‌రెడ్డి చెప్పారు. అత్యున్నతమైన పదవులను ఏకాభిప్రాయంతో భర్తీ చేయాల్సిన అవసరం ఉందన్న వాదనపై స్పందిస్తూ, ఇది జాతీయ ఐక్యతను ప్రతిబింబిస్తుందన్నారు. 'ఈ విషయంలో ఏకాభిప్రాయం ఉండాలని నేను కోరుకుంటున్నాను, కానీ మన రాజకీయ వ్యవస్థ ఎలా ఉందో మీకు తెలుసు కదా, ఇది చీలికలు పీలికలుగా ఉంది, అందువల్ల బహుశా, ఈ పరిస్థితి అనివార్యమవుతుంది, ఈ పరిస్థితి పోటీకి దారితీస్తుంది' అన్నారు.

'గతంలో మన ఆర్థిక వ్యవస్థలో లోటు గురించి లోటుపాట్ల గురించి చర్చించుకునేవాళ్ళం, కానీ ఇప్పుడు మాత్రం ప్రజాస్వామ్యం కొరవడిందన్న విషయం గురించి చర్చించుకుంటున్నాం, ఐతే భారతదేశం ఇంకెంతోకాలం ప్రజాస్వామ్యదేశంగా ఉండదని నేను అనడంలేదు, అది నా ఉద్దేశం కాదు, అందుకు నేను ఒప్పుకోను, మనం ఇప్పటికీ ఒక రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యదేశంగా కొనసాగుతున్నాం, కాకపోతే మన ప్రజాస్వామ్యం మాత్రం చాలా ఒత్తిడికి గురవుతోంది'' అని సుందర్శన్‌రెడ్డి చెప్పారు.

'ప్రతిపక్షాలు తనను ఏకగ్రీవ అభ్యర్థిగా ఎన్నుకోవడం ఎంతో గౌరవప్రదమైన విషయం. మొదటిది, ఈ ఎంపిక భిన్నత్వాన్ని ప్రతిబింబిస్తుంది, రెండవది, ఏకగ్రీవం అంటే భిన్నత్వం ఒకరినే కోరుకోవడం, మూడవది, ఓటింగ్ బలం విషయం. దీంతో మీరు గనుక విశ్లేషణ చేస్తే, దేశంలో మన ప్రతిపక్షాలు 63 లేదా 64 శాతం కంటే ఎక్కువ మంది ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి, ఇంతకంటే గొప్ప గౌరవం ఇంకేం కావాలి?' అని ఆయన ప్రశ్నించారు.

**ఇది రెండు సిద్ధాంతాలమధ్య పోటీ**

''ఇక్కడ శ్రేష్ఠమైన ఒక ఆర్‌ఎస్‌ఎస్ ఉన్నాడు...ఇప్పటివరకు నాకు సంబంధించి అలాంటి సిద్ధాంతాన్ని నేను ఆమోదించలేదు, నేను దానికి చాలా చాలా దూరంగా ఉన్నాను. నేను అనివార్యంగా ఒక ఉదార రాజ్యాంగ ప్రజాస్వామ్యవాదిని, ఇక్కడ పోటీ జరుగుతోంది, ఉపరాష్ట్ర పదవికోసం నాకు–ఎన్‌డిఎ అభ్యర్థి సి.పి.రాధాకృష్ణన్ అనేక ఇద్దరు వ్యక్తులమధ్య పోటీ జరగడంలేదు, రెండు విభిన్న సిద్ధాంతాలమధ్య ఈ పోటీ జరుగుతోంది'' అన్నారు. బిజెపి మాజీ నాయకుడు అరుణ్‌జైట్లీని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. ''పార్లమెంటరీ కార్యకలాపాలకు అంతరాయం కలగడం కూడా ఒక చట్టబద్ధమైన పార్లమెంటరీ ప్రజాస్వామ్య కార్యకలాపమే అని ఆయన చెప్పారు'' అన్నారు. అసమ్మతిని తెలియజేయడంలో తలపండిన తీరే ఈ అంతరాయమని అన్నారు. ''పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో కార్యకలాపాలకు అంతరాయం కలిగించడం కూడా ఒక అసమ్మతే, మీ అభిప్రాయాలను వ్యక్తీకరించడానికి సభలో మీకు అవకాశం ఇవ్వకపోతే, ఈ విధంగా అంతరాయం కలిగించడం ఒకరకమైన అసమ్మతి భాష, అందువల్ల ఈ అంతరాయాన్ని నేను ఆ విధంగా చూస్తాను, ఐతే ఈ విధంగా అంతరాయం కలగడం ఒక అనివార్యమైన, ప్రజాస్వామ్య ప్రక్రియలో ఒక అంతర్గత ప్రక్రియగా ఉండిపోవాలనేది నా ఉద్దేశం కాదని చెప్పారు. రాజ్యాంగ పీఠికలో ఉన్న సామ్యవాదం, లౌకికవాదం పదాలపై జరుగుతున్న చర్చకు స్పందిస్తూ, ''నా ఉద్దేశం ప్రకారం భావవ్యక్తీకరణ ద్వారా విషయ స్పష్టత వస్తుంది, లేకపోతే దానిని రాజ్యాంగంలో ఒక అంతర్భాగ నిబంధనగా చేర్చాలి, ఈ రెండు పదాలు చాలా స్పష్టతను ఇస్తాయి, రాజ్యాంగంలో ఈ పదాలు ఉండటం ఆహ్వానించదగిన విషయం, ఎమర్జెన్సీ రద్దైన తర్వాత 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఇది వచ్చింది, కానీ ఒక విషయం గుర్తుంచుకోవాలి, తర్వాత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన జనసంఘ్ ఏకగ్రీవంగా దానిని ఆమోదించిందన్నారు. గాంధీ, నెహ్రూ, అంబేద్కర్‌లను పైపైన మాత్రమే చదివి వదిలేస్తే మన ఆలోచనల్లో చాలా అపార్థాలు, తప్పుడు భావనలు వస్తాయన్నారు. ఈ ముగ్గురూ చాలా శ్రేష్ఠమైన గొప్ప ప్రజాస్వామ్యవాదులని, గణతంత్రవాదులని, నైతికతకు, రాజ్యాంగ విలువలకు కట్టుబడినవారని సుందర్శన్‌రెడ్డి అన్నారు. వాళ్ళ ముగ్గురినీ వేరే వేరుగా విభజించడం దేశ ప్రయోజనాలకోసం కాదని, ఒకరు ఒకరికి మద్దతు ఇవ్వడం, ఒకరు మరొకరు వ్యతిరేకించడం, తప్పుడు వర్ణనలు చేయడం దేశానికి ప్రయోజనకరం కాదన్నారు.

## పార్లమెంట్ వద్ద అనుమానాస్పద వ్యక్తి అరెస్ట్

**న్యూఢిల్లీ :** పార్లమెంట్ వద్ద పటిష్ఠ భద్రత ఉ న్నా ఆగంతకుల చొరబాట్లు నానాటికీ పెరిగి పోతున్నాయి. పార్లమెంట్ భవనం ఆవరణ సమీపంలో అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ఓ 20ఏళ్ల వ్యక్తిని శనివారం కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సిఐఎస్‌ఎఫ్) అరెస్ట్ చేసింది. ఈ విషయాన్ని ఒక అధికారి వెల్లడించారు. తదుపరి దర్యాప్తు కోసం సిఐఎస్‌ఎఫ్ అధికారులు అతడిని పోలీసులకు అప్పగించినట్లు ఆ అధికారి చెప్పారు. నేరారోపణాత్మకమైనది ఏదీ అతడినుంచి స్వాధీనం చేసుకోబడలేదని తెలియజేశారు. శుక్రవారం అత్యంత భద్రత కలిగిన పార్లమెంట్ భవనం గోడపై ఒక వ్యక్తి పట్టుబడిన మరుసటి రోజు ఈ సంఘటన చోటుచేసుకుంది. రైలు భవన్‌పార్లమెంట్ హౌస్ మధ్య రైసీనా రోడ్ నుంచి శనివారం ఉదయం దాదాపు 9.30గంటల సమయంలో లోపలకు ప్రవేశించిన 20ఏళ్ల వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో సిఐఎస్‌ఎఫ్ సిబ్బంది అతడిని అడ్డగించి పట్టుకున్నారు. 'అతడు దుబాయికి ప్రయాణించడానికి బెంగళూరు నుంచి ఢిల్లీకి వచ్చినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. నేరారోపణాత్మకమైన వస్తువేదీ అతడి నుంచి స్వాధీనం చేసుకోలేదని, ఆ అనుమానాస్పద వ్యక్తిని ప్రశ్నించాం అని ఒక సీనియర్ భద్రతాధికారి చెప్పారు. ప్రాథమిక విచారణ అనంతరం.. అతడి ఫోన్‌లో నుంచి ఆధార్ కార్డు, పాస్‌పోర్టు కాపీని కనుగొన్నామని, అతడిని తదుపరి దర్యాప్తు కోసం కర్తవ్యపథ్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించామని ఆయన తెలిపారు.

## ధర్మస్థలలో మృతదేహాల ఖననం కేసు.. ఫిర్యాదుదారుడు అరెస్టు

పది రోజుల ఇడి కస్టడీ విధించిన కోర్టు



**బెంగళూరు:** కర్ణాటకలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ధర్మస్థలలో వందల మృతదేహాల ఖననం ఆరోపణల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆ మృతదేహాలను తానే పూడ్చిపెట్టానని ప్రకటించుకున్న ఒకప్పటి పారిశుద్ధ్య కార్మికుడు, ముసుగు వ్యక్తిని తాజాగా సిట్ అధికారులు అరెస్టు చేశారు. ఇప్పటి వరకు ముసుకు వేసుకునే దర్యాప్తు అధికారుల ఎదుట హాజరైన ఈ వ్యక్తిని సిఎన్ చిన్నయ్యగా గుర్తించినట్లు అధికారులు చెప్పారు. అతడు అబద్ధాలు చెప్పి, ప్రజలను తప్పుదోవ పట్టించారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై ఇప్పటికే అతడు మాట మార్చిన సంగతి తెలిసిందే. అయితే అరెస్టు తరువాత చిన్నయ్యను జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ విజయేంద్ర ముందు హాజరు పర్చారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం 10 రోజుల కస్టడీని ఇడి కోరగా అందుకు కోర్టు అనుమతించి చిన్నయ్యకు పది రోజుల ఇడి కస్టడీ విధించినట్లు అధికారులు తెలిపారు. ధర్మస్థల పరిసరాల్లో 100కు పైగా శవాలు పూడ్చిపెట్టానని చెప్పిన చిన్నయ్య చివరకు వాటి ఆనవాళ్లు చూపకపోవడంతో అధికారులు ఆగ్రహం వ్యక్తంచేశారు. తప్పుడు సమాచారంతో ప్రభుత్వాన్ని, ప్రజలను తప్పుదారి పట్టించాడన్న అభియోగాలపై భీమాను ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు సిట్ ప్రధాన అధికారి ప్రణబ్ మొహంతీ అతడిని విచారించారు. మాయమాటలతో మొత్తం వ్యవస్థను నమ్మించి చివరికి ఏమీ తెలియదని చేతులు ఎత్తేశాడని ఈ దర్యాప్తులో విచారణ బృందం గుర్తించింది. దీంతో అతడిని అరెస్టు చేసింది. ఇక, ఈ కేసులో తప్పుడు ఆరోపణలు చేసిన బెంగళూరు మహిళ సుజాత భట్‌ను కూడా పోలీసులు అరెస్టు చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి. వైద్య విద్య చదివే తన కుమార్తె అనన్య భట్ 2003లో వెళ్లి అదృశ్యమైందంటూ ఆమె ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. అయితే, అదంతా కట్టుకథేనని తాజాగా ఆమె పేర్కొన్నారు. దీంతో ఆమె ఇంటికి పోలీసులు శనివారం వెళ్లారు. విచారణ అనంతరం ఆమెను అదుపులోకి తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

**తప్పుదోవ పట్టించే వారిపై కఠిన చర్యలు : డికె**

చిన్నయ్య అరెస్టుపై రాష్ట్ర ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్ స్పందించారు. రెండు దశాబ్దాలుగా హత్యలు, అత్యాచారాలు, ఖననాలు జరిగినట్లు తప్పుడు ఫిర్యాదు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ సిఎం శనివారం వెల్లడించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ .. ఈ కేసుపై దర్యాప్తు కొనసాగుతోంది. తాజాగా ఈ కేసులో తప్పుడు ఫిర్యాదు చేసిన వ్యక్తిని అరెస్టు చేసిన విషయంపై ప్రశ్నించగా .. తను మాట్లాడిన తర్వాతే బిజెపి నేతలు ఈ విషయంపై మాట్లాడుతున్నారని అన్నారు. ధర్మస్థల దేవాలయం, సంస్థలకు నాయకత్వం వహిస్తున్న కుటుంబం సిఎం సిద్ధరామయ్యను కలిసి దర్యాప్తును స్వాగతించినట్లు తెలిపిన విషయాన్ని చెప్పారు. ఈ కేసులో తప్పుదోవ పట్టించిన వారిపై కఠిన చర్యలు తప్పవని సిఎం, హోంమంత్రి తెలిపిన విషయాన్ని తెలిపారు. తమ ప్రభుత్వం న్యాయం పక్షాన నిలబడుతుందని వ్యాఖ్యానించారు. మతరాజకీయాలు చేయాలనుకోవడం లేదని శివకుమార్ అన్నారు. ధర్మస్థల ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్ర జరిగిందని, దర్యాప్తులో నిజానిజాలు వెలుగులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. దక్షిణ కన్నడ జిల్లాలో ధర్మస్థల ప్రముఖ శైవ క్షేత్రం. కర్ణాటక ప్రజలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచీ ఇక్కడికి భారీగా వస్తుంటారు. గతంలో అక్కడ పనిచేసి వెళ్లిపోయిన ఓ పారిశుద్ధ్య కార్మికుడు.. ఇటీవల సంచలన ఆరోపణలు చేశాడు. 1998 నుంచి 2014 మధ్య ఇక్కడ అనేక మంది మహిళలు, యువతులు హత్యకు గురయ్యారని.. వారి మృతదేహాలను తానే పూడ్చి పెట్టానని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం దీనిపై సిట్ ఏర్పాటుచేసింది. దీనిపై విచారణ జరిపిన ప్రత్యేక దర్యాప్తు బృందం.. పారిశుద్ధ్య కార్మికుడు చెప్పినచోట తవ్వకాలు జరపగా కొన్ని కళేబరాలు బయటపడ్డాయి. ఈ క్రమంలోనే ఇటీవల అతడు మాట మార్చి ట్విస్ట్ ఇచ్చాడు. 'నాకు ఒకరు పుర్రెను ఇచ్చి సిట్ అధికారులకు ఇవ్వాలని సూచించారు. న్యాయస్థానంలో అర్జీ కూడా వారే వేయించారు. నేను 2014 నుంచి తమిళనాడులోనే ఉంటున్నా' అని తెలిపాడు. దీంతో ఈ వ్యవహారం మరో మలుపు తిరిగింది. ఈ నేపథ్యంలోనే అతడిని విచారించిన దర్యాప్తు బృందం.. తాజాగా అరెస్టు చేసింది.

## కర్ణాటకలో ఎమ్మెల్యే అరెస్టు

బెట్టింగ్ కేసులో మనీలాండరింగ్

నిరోధక చట్టం కింద అరెస్టు చేసిన ఇడి

**బెంగళూరు :** కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే కె.సి.వీరేంద్ర 'పప్పీ' అరెస్టు అయ్యారు. అక్రమ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగ్ కేసులో మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద శనివారం సిక్కింలో అరెస్టు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) తెలిపింది. శుక్రవారం పలు రాష్ట్రాల్లో జరిపిన దాడుల తర్వాత రూ.12 కోట్ల నగదు (సుమారు రూ.కోటి విదేశీ కరెన్సీతో సహా), రూ.6కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, సుమారు 10కిలోల వెండితో పాటు నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఫెడరల్ దర్యాప్తు సంస్థ తెలిపింది. ఎక్కడి నుంచి ఏమి స్వాధీనం చేసుకున్నారో ఏజెన్సీ కచ్చితంగా పేర్కొనలేదు. ఏజెన్సీ విడుదల చేసిన చిత్రంలో క్యాసినో ఉంచిన భారీ కరెన్సీ నోట్లను చూపించారు. కర్ణాటకలోని చిత్రదుర్గ అసెంబ్లీ స్థానానికి చెందిన 50 ఏళ్ల ఎమ్మెల్యేను శుక్రవారం సిక్కిం రాజధాని గ్యాంగ్‌టాక్ నుండి అక్రమ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగ్ కేసులో మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఎ) కింద అదుపులోకి తీసుకున్నట్లు ఇడి తెలిపింది. శాసనసభ్యుడు తన సహచరులతో కలిసి క్యాసినోను లీజుకు తీసుకోవడానికి వ్యాపార పర్యటన నిమిత్తం గ్యాంగ్‌టాక్‌కు వెళ్లారని ఏజెన్సీ తెలిపింది. కాగా, వీరేంద్రను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచామని, బెంగళూరులోని న్యాయస్థానం ముందు హాజరుపరిచేందుకు ట్రాన్సిట్ రిమాండ్ పొందామని ఏజెన్సీ తెలిపింది. అయితే ఎమ్మెల్యే అరెస్టుపై ఆయన న్యాయ బృందం గానీ, కాంగ్రెస్ పార్టీ నుండి గానీ ఎలాంటి స్పందన రాలేదు. వీరేంద్ర సోదరుడు కె సి నాగరాజ్, అతని కుమారుడు పృథ్వీ ఎన్ రాజ్ ప్రాంగణాల నుండి కూడా అనేక ఆస్తి సంబంధిత పత్రాలను ఇడి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అతని మరొక సోదరుడు కెసి తిప్పేస్వామి వంటి ఇతర సహచరులు దుబాయ్ నుండి ఆన్‌లైన్ గేమింగ్ కార్యకలాపాలను నిర్వహిస్తున్నట్లు ఇడి తెలిపింది. చిత్రదుర్గ, హుబ్బళ్లి, కర్ణాటకలోని బెంగళూరు, జోధ్‌పూర్ (రాజస్థాన్), సిక్కిం, ముంబయి, గోవాతో సహా 31ప్రదేశాలలో నిర్వహించిన దాడులను ఏజెన్సీ శనివారం ముగించింది. గోవాలోని పప్పీస్ క్యాసినో గోల్డ్, ఓషన్ రివర్స్ క్యాసినో, పప్పీస్ క్యాసినో ప్రైడ్, ఓషన్ 7 క్యాసినో, బిగ్ డాడీ క్యాసినో అనే ఐదు క్యాసినోలపై కూడా దాడులు జరిగాయి.

## మోదీ దాసోహం

(మొదటి పేజీ తరువాయి)

దారుణంగా హత్య చేస్తున్నదని విమర్శించారు. అటవీ భూములను కార్పొరేట్లకు అప్పగించేందుకు గిరిజనులను దోచేస్తున్నదని పేర్కొన్నారు. నక్సలైట్లను హత్య చేసినంత మాత్రాన వారి సిద్ధాంతాన్ని అంతం చేయలేరని స్పష్టం చేశారు. మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవ్‌ను చంపిన రోజే అదానీకి 22 వేల ఎకరాల భూమి అప్పగించారని చెప్పారు. రాష్ట్రపతి పదవి గిరిజన మహిళకు ఇచ్చామని ప్రగల్భాలు పలుకుతూ ఆమె సంతకంతో గిరిజన వ్యతిరేక చట్టాలు చేస్తున్నారని విమర్శించారు. గవర్నర్లు కేంద్రానికి దళారులుగా తయారయ్యారని చెప్పారు. ఎన్నో మంచి తీర్పులు ఇచ్చిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఇండియా ఐక్యసంఘటన నుంచి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నిలబెడితే... ఆయన మావోయిస్టులకు అనుకూలంగా తీర్పు ఇచ్చారని బీజేపీ దుర్మార్గంగా ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. జీఎస్టీ ద్వారా రూ.22 లక్షల కోట్లు వసూలు చేశామని ప్రధాని మోదీ గొప్పలు చెప్పుకుంటున్నారని, కార్పొరేట్ కంపెనీలకు 33 శాతం నుంచి 23 శాతానికి తగ్గించి... సామాన్యులపై ఐదు శాతం నుండి 18 శాతానికి జీఎస్టీ పెంచడంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏడాదికి మూడు పంటలు పండుతూ... పచ్చగా ఉన్న పలాసలో ఆరు వేల ఎకరాలు పోర్టుకు అప్పగించాలని చూడటం సమంజసం కాదన్నారు. చంద్రబాబుకు 100 ఎకరాలు అవసరం ఉంటే 1000 ఎకరాలు కావాలని ఉబలాటపడుతాడన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ రోజుకో మాట... పూటకో వేషం వేస్తూ సనాతన ధర్మాన్ని నెత్తికెత్తుకొని తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు.

బలవంతంగా రైతుల భూములు లాక్కొని బడాబాబులకు అప్పగించాలని చూస్తే మరో పోరాటంతో చంద్రబాబుకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. వందేళ్ల చరిత్ర గల కమ్యూనిస్టు పార్టీని గ్రామీణస్థాయి నుండి బలోపేతం చేయాలని, చివరిక్షణం వరకు ప్రజాపక్షాన పోరాడిన సురవరం సుధాకరరెడ్డిని స్ఫూర్తిగా తీసుకొని కార్యకర్తలు పోరాట పటిమను పెంచుకోవాలని సూచించారు. సీపీఐ ఎపి రాష్ట్ర కార్యదర్శి కె.రామకష్ణ మాట్లాడుతూ సీపీఐ వందేళ్ల చరిత్రలో పేదల కోసం అనేక త్యాగాలు చేసిందన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో దేశంలో పాల్గొన్న పార్టీలు రెండేనన్నారు. ఒకటి మహాత్మాగాంధీ ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కాగా... మరొకటి ఎర్రజెండా పార్టీ సీపీఐ అన్నారు. సీపీఐతో పాటు ఆవిర్భవించిన ఆర్‌ఎస్‌ఎస్ మాత్రం స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనలేదన్నారు.

## రోదసి అన్వేషణకు సిద్ధం కండి..

భారత శాస్త్రవేత్తలకు ప్రధాని మోదీ పిలుపు



**న్యూఢిల్లీ :** అంతరిక్ష శాస్త్రవేత్తలకు కొత్త ప్రధాని మోదీ విసిరారు. రోదసి అన్వేషణ చేపట్టాలని ఆయన కోరారు. మానవాళి భవిష్యత్తు కోసం అంతరిక్ష రహస్యాలను చేధించాలని ఆయన శాస్త్రవేత్తలకు పిలుపునిచ్చారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ సందేశం వినిపించారు. ఆయన తన సోషల్ మీడియాలో శనివారం ఓ వీడియోను పోస్టు చేశారు. భవిష్యత్తులో చేపట్టబోయే అంతరిక్ష ప్రయోగాల కోసం ఆస్ట్రోనాట్ల బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. యువత దీనిలో భాగం కావాలన్నారు. అతి సుదీర్ఘ దూరంలో ఉన్న గెలాక్సీలు, అంతరిక్షం అధ్యయనం చేయాలన్నారు. చంద్రుడి మీదకు, మార్స్ మీదకు వెళ్లామని, డీప్ స్పేస్ అంశంలో మరింత లోతుగా అన్వేషణ చేపట్టాలని, మానవాళికి ఉపయోగపడే అనేక రహస్యాలు అక్కడ ఉంటాయన్నారు. అంతరిక్ష రంగంలో భారత్ ఒక్కొక్క మైలురాయి అందుకుంటోందని, ఇది దేశానికి గర్వకారణమన్నారు. నేషనల్ స్పేస్ డే సందర్భంగా.. అంతరిక్ష రంగంతో సంబంధం ఉన్న శాస్త్రవేత్తలు, యువతకు ఆయన విషెస్ తెలిపారు. సెమీ క్రయోజనిక్ ఇంజిన్లు, ఎలక్ట్రానిక్ ప్రొపల్షన్ లాంటి టెక్నాలజీ సంబంధిత అంశాల్లో భారత్ అత్యాధునికంగా దూసుకెళ్తోందన్నారు. భారత్ త్వరలో గగన్‌యాన్ మిషన్‌ను లాంచ్ చేస్తుందని, రాబోయే రోజుల్లో స్వంత అంతరిక్ష కేంద్రాన్ని ఇండియా నిర్మిస్తుందని ప్రధాని చెప్పారు. భారత పరిపాలనా వ్యవస్థలో స్పేస్ టెక్నాలజీ అధిక భాగంగా మారిందన్నారు. పంట బీమా పథకాలు, మత్స్యకారుల రక్షణ, విపత్తు సహాయక చర్యలన్నీ ఇప్పుడు శాటిలైట్ ఆధారితంగా జరుగుతున్నట్లు ఆయన వెల్లడించారు. అంతరిక్ష రంగంలో భారత్ సాధిస్తున్న ప్రగతి.. దేశ సాధారణ ప్రజల జీవితాలను మరింత సులభతరం చేస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. అంతరిక్ష రంగంలో వరుస విజయాలు భారత్‌కు అలవాటుగా మారాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. రెండేళ్ల క్రితం చంద్రుడి దక్షిణ ధ్రువంపై కాలు మోపిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించిందన్నారు. 2040లో భారత్ సొంతంగా చేపట్టే అంతరిక్ష యాత్రలో భారత వ్యోమగామి చంద్రుడిపై అడుగుపెట్టి త్రివర్ణ పతకాన్ని ఎగురవేసి వికసిత్ భారత్ ఖ్యాతిని చాటుతారని మోదీ పునరుద్ఘాటించారు. భవిష్యత్తులో ఏడాదికి 50 రాకెట్లను ప్రయోగించే స్థితికి మనం చేరుకోగలమా అని ఆయన అంతరిక్ష శాస్త్రవేత్తలను ప్రశ్నించారు. భవిష్యత్తులో ఆవిధంగా చర్యలు తీసుకోవడానికి ప్రణాళికలు రచించాలని కోరారు.

## నిషేధిత జమాత్–ఏ–ఇస్లామీ అనుబంధ పాఠశాలలను.. జమ్ముకశ్మీర్ ప్రభుత్వం స్వాధీనం

పోలీసులతో కలిసి పాఠశాలలను సందర్శించిన అధికారుల బృందాలు

**శ్రీనగర్ :** కశ్మీర్ వ్యాప్తంగా 10 జిల్లాలలో నిషేధిత జమాత్‌ఏఇస్లామీ (జెఇఐ)కి అనుబంధంగా ఉన్న పాఠశాలల నిర్వహణపై శనివారం జమ్ముకశ్మీర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో అధికారుల బృందాలు పోలీసులతోపాటు ఆ పాఠశాలలను సందర్శించాయి. విద్యకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఈ మొత్తం ప్రక్రియ 'శాంతియుతంగా' మరియు 'సజావు'గా జరిగిందని అధికారవర్గాలు వెల్లడించాయి. జమాత్‌ఏఇస్లామీ, ఫలాహ్‌ఏఆమ్ ట్రస్ట్‌తో అనుబంధంగా ఉన్న 215 పాఠశాలలను స్వాధీనం చేసుకోవాలని శుక్రవారం పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీచేసింది. వారి అకడమిక్ భవిష్యత్తును కాపాడుకునేందుకు 51,000 మందికి పైగా విద్యార్థులు ఆ పాఠశాలల్లో నమోదు చేసుకుని ఉన్నారు. శనివారం ఉదయం జిల్లా పరిపాలనా అధికారులు, సంబంధిత సమీప ఉన్నత, మాధ్యమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పోలీస్ బృందాలతో కలిసి ఈ పాఠశాలలకు చేరుకున్నారు. ఈ పాఠశాలలకు చేరుకున్న తర్వాత అడ్మినిస్ట్రేటివ్ బృందాలు ఆ పాఠశాలల బాధ్యతలను చేపట్టారు. ఆ పాఠశాలలకు సంబంధించిన డాక్యుమెంట్లను, మౌలికసదుపాయాలను పరిశీలించి అక్కడి స్టాఫ్‌తో చర్చించినట్లు అధికారులు తెలిపారు. ఈ చర్య జమ్ముకశ్మీర్‌లోని అన్ని రాజకీయ పార్టీల నుంచి విమర్శలకు దారితీసింది. పిడిపి సహా పీపుల్స్ కాన్ఫరెన్స్, అప్నీ పార్టీ దానిని 'పరిపాలనా అతిక్రమణ'గా ఆరోపించాయి. నిషేధిత జమాత్‌ఏఇస్లామీ మాజీ సభ్యులచే ఏర్పాటుచేయబడిన జస్టిస్ అండ్ డెవలప్‌మెంట్ ఫ్రంట్ (జెడిఎఫ్) స్పందిస్తూ ఇది నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వం 'ద్రోహచరిత్ర'తో కూడిన 'బాధాకరమైన జ్ఞాపకం'అని నిందించారు. పిడిపి ప్రెసిడెంట్ మెహబూబా ముఫ్తీ మాట్లాడుతూ జమ్ముకశ్మీర్‌లో అధికార పార్టీ తమ ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా బిజెపి అజెండాను అమలుచేయడమేనన్నారు. దక్షిణ కశ్మీర్ అనంతనాగ్ జిల్లాలో ఈ తరహా పాఠశాలలకు చెందిన ఒక స్కూల్ టీచర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతించారు. నేను ఇది ఒక మంచి నిర్ణయం అనుకుంటున్నాను.

# సుధాకరరెడ్డికి నివాళి



## సుధాకర దుర్గం

పాలమూరు నడిగడ్డన
ఇసుక ఎడారిలో పరిమళించిన మందారం
గుక్కెడు నీళ్ళులేని నేల
ప్రజా గొంతై ప్రతిధ్వనించిన మాటల మహానది
ప్రతాపరెడ్డి సాహిత్యపు గోలకొండ
సుధాకర రెడ్డి కమ్యూనిస్టు దుర్గం

బాల్యంలో
ఆకాశపు నక్షత్రాలమధ్య
ఎంతమందిఉన్నా చందమామలా ఆయననే చూసేది
వెతికి వెతికి చూపిచ్చేది మా ఊరి పెద్దలు
వేదికలపై మా కలల రెక్కల్నివిప్పారు
మతోన్మాద ఫాసిస్ట్ విధానాలపై చలి మంటల విసు ర్లు
సత్య ప్రపంచానికి సమిధయి ఎదురీదిన
మా చేగువేరా! మా ఫిడెల్ కాస్ట్రో!

పోరాటాల ప్రకాశం ఆదర్శాల ఆకాశం
విలువలకు ఆభరణం మానవీయ మాణిక్యం
దేశాన్ని నడిపించిన జాతీయ సారథ్యం
యుద్ధం వీడని సైనికుడు

అందుకోలేనంత ఎత్తులో మీ ప్రభ
వడగళ్ల సవ్వడిలా
అగ్నిజ్వాలలా ఉవ్వెత్తున ప్రసంగాలు
మహాకావ్యాలు చదివినంత సంతృప్తి
యువత గుండెల్లో విప్లవ నవతను ఆవిష్కరించారు
సమసమాజ శ్రేయస్సు ప్రగతిశీల భావాల వేకువై
మీరు నడిచిన తొవ్వ ఆచరణీయం
రాచరికాల అరాచకాలు భూస్వామ్య క్రౌర్యాలెన్ని
ముసిరినా తలదించని ఎవరెస్టు

అతనితో కరచాలనం
కావ్యం రాసినంత ఆనందం
జనగణమన జాతీయ గీతమంత ధిక్కార స్వరం

మతసామరస్యపు ప్రతిధ్వని
తాత్వికుడు / రణధీరుడు

అమ్మా నాయనకిచ్చిన మాట తప్పలే
మహానీయులిచ్చిన స్ఫూర్తిని మరువలే
సామ్రాజ్యవాద నిరంకుశత్వం
దుర్మార్గ దోపిడీ పీడనల్లేని సామాజిక మార్పుకై
నవభారత నిర్మాణానికి సత్యాగ్రహమై విప్లవించావు
కమ్యూనిజమే అజేయమని అగ్నికణమై రగిలావు
ఎర్రజెండానే అంతిమ పతాకమని సగర్వమై సాగావు

మహా నేతా
విప్లవ యోధుడా! అరుణతార !!
మీ నిష్క్రమణ తీరని దుఃఖమైనా
మీ తాత్వికత ప్రాపంచిక దృక్పథం
రక్తప్రసారమై ప్రజ్వలిస్తున్నది

ఆయన అన్నా
ఆయన మాటలన్నా సీతాఫలమంతిష్టం
కార్మిక కర్షక తాడిత పీడిత హక్కులకు
ప్రజా చైతన్యపు బావుటై ఆదరించి ఆచరించిన మార్గదర్శి
అందుకే ఆయనంటే మహా ఇష్టం
దారి చూపే మైలురాయే కాదు
తెగించి పోరాడే వారసత్వాన్ని నింపిన స్ఫూర్తి
సూర్యుడంత వెలుగు చంద్రుడంత వెన్నెల

(కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి గారికి విప్లవ జోహార్లతో)

వనపట్ల సుబ్బయ్య
9492765358

## ఉద్యమ శిఖరం 'సురవరం'

పల్లవి
వలసలకు మారుపేరు పాలమూరు కరువు జిల్లా
కొల్లాపూర్ తాలుకా,కొండ్రావు పల్లి ఊరులోన
వెంకట్రామ్ రెడ్డి,ఈశ్వరమ్మల కడుపు కాయ
కామ్రేడు మన సురవరం సుధాకర్ రెడ్డి

చరణం
పాఠశాల స్థాయిలోనే ప్రశ్నించ నేర్చినావు
విద్యార్థి దశలోనే ఉద్యమాల్లో చేరినావు
కమ్యూనిస్టు నేతరా.! ఉద్యమాల ఊతరా.!
ప్రజా పోరు నడిపినోడు ప్రజా ప్రేమ పొంది నావు
యోధుడు మన కామ్రేడు సురవరం సుధాకర్ రెడ్డి

చరణం
మార్క్సిస్టు లెనినిస్టు ఆశయాలు నమ్మినావు
సమసమాజ సాధనకై ముందుండి నడిచినావు
మతవాద, మితవాద దొంగలను ఎదిరించ..
లౌకిక శక్తులకు అండగా ఉండి నావు

చరణం
కుటుంబాన్ని వెంటాడి, ఇల్లు తగలవెట్టిన
తప్పుడు కేసులు వెట్టి జైల్లో వెట్టినా....
జైలే ఒక ఉద్యమాల ఇల్లుగా మార్చి నావు
పోరు విత్తనాలు జల్లి చైతన్యం నింపినావు

చరణం
నల్లగొండ ఎంపీ గా ప్రజల చేత గెలిచిన నావు
పార్లమెంటు భవనంలో ప్రజా గొంతుకైనావు
విద్యుత్తు ఉద్యమం లో వెరవకుండా నిల్చినావు
లాఠీలకు, తూటాలకు అధిగమించి సాగినావు

చరణం
నువు వీడిన ఎర్ర జెండా ఎత్తుకొని కలెబడుతం
కమ్యూనిస్ట్ బిడ్డలై కవాతుగ నిలబడుతం
మీ ఆశయ సాధనలో ఎర్రదండై సాగుతాము
శ్రామిక రాజ్యం కొరకు పోరు పిడికిలెత్తుతాము
వీరుడా సురవరం అందుకో
లాల్ లాల్ సలాం
(కమ్యూనిస్టు ఎవరెస్ట్ దిగ్గజం సురవరం గురించి రాసిన స్మృతి గీతం)

గడ్డమీది చంద్రమోహన్ గౌడ్

## అరుణ పతాకమై వస్తడు మన సురవరం

తెలుగు నేల చిన్న బోయెను
మా కామ్రేడ్ సురవరం
సుధాకరన్న కానరాడేమయంటూ
నేలతల్లి భావురన్నదో
భూమి పుత్రుని
జాడ ఏదని
పురుటి గడ్డ
కొండ్రాల్ పల్లి భావురన్నదో
ఈనేలపై ఆడుకొన్న
ఆ బాల వీరుడేడని
కంచుపాడు
భావురన్నది
ఎర్రజెండా
చిన్నబోయెనో
తన నెత్తుకుని
పోరుబాటున సాగినట్టి
ఆ వీరయోధుడెక్కడని
ఎర్ర జెండా
చిన్న బోయెను,
అనారోగ్యం లెక్కచేయక
వీల్ చైర్‌పై వచ్చినాడు
తన్నుగెలిపించిన
నల్లగొండ ప్రజలకు
రావినారాయణ రెడ్డి
బొమ్మగాని ధర్మభిక్షంల
పోరువారసత్వాలకు
వందనాలు చెప్పి వెళ్ళినాడు
సురవరంమళ్ళీ కన్పించడాయని
కన్నీరు పెట్టుకున్నది నల్లగొండ
వేగు చుక్కలాగ
మళ్ళీ ఎప్పుడొస్తడో
మన కామ్రేడ్ సురవరం
దోపిడీ దురంతాలు
చీకట్లు పారదోలె
వెలుగులిస్తడీ మన సురవరం
వస్తడూ, మన సురవరం
మళ్ళీ వస్తడూ మన సురవరం
అమరుడై వస్తడు
అరుణ పతాకమై వస్తడు
అరుణ కాంతులిస్తడు
మన సురవరం

బొమ్మగాని నాగభూషణం

# చెరగని ముద్ర సురవరం

ఆరు దశాబ్దాలు పైబడిన క్రియాశీల రాజకీయ జీవితంలో రెండు– మూడు తరాల విద్యార్థి, యువజన, కమ్యూనిస్టు కార్యకర్తలపై దేశవ్యాప్తంగా బలమైన ముద్రవేసిన ఉత్తమ కమ్యూనిస్టు నేత, పార్లమెంటేరియన్ కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డి భౌతికంగా మన మధ్య లేక పోయినా వారు మన స్మృతిపథంలో చిర కాలం ఉంటారు. కొంతకాలంగా అస్వస్థులుగా ఉన్న సుధాకరరెడ్డి శుక్రవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ఆసుపత్రిలో కన్నుమూసారు. తన చిరకాల సహచరుడు, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా సహా తెలంగాణ రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ ముఖ్య సహచరులంతా రాష్ట్ర మహాసభ ముగించుకుంటూ ఉండగా ఆయన మరణం ఈ విస్తృత కుటుంబం దగ్గర ఉండగా తుదిశ్వాస విడిచినట్లయింది. ఇది యాదృచ్ఛికం.

మహబూబ్‌నగర్ జిల్లాలో స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబంలో జన్మించిన సుధాకరరెడ్డికి కర్నూలులో బిఎ చదువుతుండగానే అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్‌తో సంబంధం ఏర్పడింది. హాస్టల్ విద్యార్థుల సమస్యలపై ఆందోళనలు నిర్వహిస్తూ నాయకునిగా గుర్తింపు పొందారు. విషయ స్పష్టత, వాగ్ధాటి, పోరాట పటిమ ఆయన విశిష్ట లక్షణాలు. పైకి ఎంతో సౌమ్యునిగా కనిపిస్తారుగాని నమ్మిన భావాల విషయంలో ఎన్నడూ రాజీపడరు. ఉస్మానియా యూనివర్శిటీలో ఎల్‌ఎల్‌బిలో చేరారు. కాలేజి విద్యార్థి యూనియన్ కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. అది కమ్యూనిస్టు పార్టీలో, ప్రజాసంఘాల్లో రెండేళ్ల క్రితం చీలిక సంభవించి హోరాహోరీ సైద్ధాంతిక పోరాటం జరుగుతున్న కాలం. రాష్ట్రంలో ఎఐఎస్‌ఎఫ్ పునర్నిర్మాణ మహాసభ విజయవాడలో జరిగింది. చక్రవర్తుల రాఘవాచారి అధ్యక్షునిగా, సురవరం సుధాకరరెడ్డి ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు.

ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థి ఉద్యమ నిర్మాణ అనుభవంతో, సిపిఐ నాటి ప్రధాన కార్యదర్శి చండ్ర రాజేశ్వరరావు ప్రోత్సాహంతో, సుధాకరరెడ్డి అఖిలభారత స్థాయిలో తొలుత ఎఐఎస్ఎఫ్, ఆ తర్వాత ఎఐవైఎఫ్ నిర్మాణానికి నడుం కట్టారు. కామ్రేడ్స్ సి.కె. చంద్రప్పన్, డి.రాజా, పంజాబ్, పశ్చిమ బెంగాల్‌నుంచి మరికొందరు సహయోధులుగా ఉద్యమ వ్యాప్తికి పాటుబడ్డారు. ఆ సందర్భంలో ఢిల్లీ, లక్నోల్లో జైలు శిక్షలు అనుభవించారు. ఆ కాలంలో పలుమార్లు అంతర్జాతీయ విద్యార్థి, యువజన మహాసభల్లో, సెమినార్‌లలో పాల్గొన్నారు. దేశంలో సిపిఐ జాతీయ మహాసభల సందర్భంగా కశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు జీపుయాత్రలను నిర్వహించారు.

దశాబ్దంపైగా ఢిల్లీ కేంద్రంగా జాతీయస్థాయిలో పనిచేశాక రాష్ట్రానికి తిరిగివచ్చిన సుధాకరరెడ్డి వ్యవసాయ కార్మిక సంఘ నిర్మాణంలో పాలుపంచుకున్నారు. రాష్ట్ర పార్టీ నాయకత్వంలో భాగస్వామి అయినాక తొలుత సహాయ కార్యదర్శిగా, ఆ తదుపరి కార్యదర్శిగా ఒక వైపు ప్రజా ఉద్యమాల నిర్మాణానికీ, మరోవైపు వామపక్ష ఐక్యత సాధనకు శ్రమించారు.

తెలుగు సాహిత్యం అధ్యయనం, అవసర మనుకున్నప్పుడు వ్యాఖ్యానించటం, పార్టీ సాంస్కృతికరంగాన్ని ప్రోత్సహించటం ఆయనకున్న మరో సుగుణం.

నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గంనుంచి ప్రజా నాయకులు కామ్రేడ్స్ రావి నారాయణ రెడ్డి, బొమ్మగాని ధర్మభిక్షం వారసత్వంతో 1998లో, తిరిగి 2004లో ఎన్నికై మొత్తం ఆరు సంవత్సరాలపాటు తనదైన వాగ్ధాటితో అనుభవజ్ఞులైన సభ్యులతో పోటీపడి రాణించారు. అదే సమయంలో ఆయన ప్రజల మధ్య మెలుగుతూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారు. నల్లగొండ ఎంపిగా డిండి ప్రాజెక్టుకు నీటికోసం, ఫ్లోరైడ్ నివారణ కోసం కమ్యూనిస్టు పార్టీ పాదయాత్రకు నాయకత్వం వహించారు. సుధాకరరెడ్డి ఉపన్యాసాలు ఎవరినైనా మెప్పించేవి.

ప్రజాపక్షం
24-08-2025, ఆదివారం

ఆయన వాగ్ధాటికొక చిన్న ఉదాహరణః అది 1971– బంగ్లాదేశ్‌లో జాతీయ విముక్తి పోరాటం జరుగుతున్న కాలం. కమ్యూనిస్టు పార్టీ పెద్ద ఎత్తున సంఘీభావ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అప్పుడు విజయవాడ న్యూ ఇండియా హోటల్ సెంటర్‌లో రాత్రి బహిరంగ సభ. బంగ్లాదేశ్ యువజన నాయకుడు అనర్గళంగా ఉపన్యసిస్తున్నాడు. వర్షం మొదలైంది. సుధాకరరెడ్డి అంతకన్నా గంభీరంగా తర్జుమా చేస్తున్నాడు. ప్రేక్షకులు చెదిరిపోలేదు. పరిసర భవనాల చూరులు కింద చేరారు. దాదాపు గంటసేపు సుధాకరరెడ్డి తర్జుమా ఉపన్యాసాన్ని ఆ వర్షధార ధ్వను ల్లోనే, తడుస్తూనే చెవులు రిక్కించి విన్నారు.

సుధాకరరెడ్డి కమ్యూనిస్టు జీవితంలో చెప్పుకోదగ్గ మరో ఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ప్రభుత్వం ప్రపంచ బ్యాంక్ సలహామీదట విద్యుత్ ఛార్జీల పెంపు చేయటాన్ని వ్యతిరేకిస్తూ నెలలతరబడి గ్రామ స్థాయినుంచి రాజధాని వరకు జరిగిన మహోద్యమంలో ఆయన వ్యూహాత్మక పాత్ర. 2000 సం.లో హైదరాబాద్‌లో జరిగిన వామపక్షాల ర్యాలీపై పోలీసులు కాల్పులు జరిపి ముగ్గుర్ని బలిగొన్నారు. ఆ సందర్భంలో పోలీసు అశ్విక దళం గిట్టెల దెబ్బలు తిన్నవారిలో ఆయన ఒకరు.

2008 నుంచి సిపిఐ డిప్యూటీ జనరల్ సెక్రటరీగా, 2012 నుండి 2019 జులైలో ఆరోగ్య కారణాలతో రిలీవ్ అయ్యేవరకు పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. కేంద్రంలో ఆర్‌ఎస్‌ఎస్/బిజెపి నాయకత్వంలో ప్రభుత్వం అధికారంలో ఉన్న ఈ కాలం వామపక్షాలకు నిజంగా గడ్డుకాలం. పార్టీని కాపాడుకోవటానికి, నిర్మాణాన్ని పటిష్టం చేయటానికీ, ముఖ్యంగా వామపక్ష ఐక్యత సాధనపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

సిద్ధాంత నిబద్ధత, శ్రమ ఎంత బలంగా ఉన్నా భౌతిక పరిస్థితులు అనుకూలించని ఈ రోజుల్లో సైద్ధాంతిక కృషిపై ఎక్కువగా పార్టీ దృష్టిపెట్టాలి.

మతోన్మాద శక్తులు అధికారం ఉపయోగించి విజృంభిస్తున్నాయి. నంగనాచిమాటలతో జనాలను భ్రమల్లో పెడుతున్నాయి. ఈ శక్తులకు వ్యతిరేకంగా, రాజ్యాంగ విలువల పరిరక్షణపై కేంద్రీకరించి వామపక్ష, లౌకిక ప్రజాతంత్ర శక్తుల ఐక్య ఉద్యమంలో భాగస్వాములై ముందుకు సాగుదాం. అదే అమరజీవులకు నివాళి. కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డితో జ్ఞాపకాలను పదిలపరుచుకుందాం. వారి కుటుంబ సభ్యులకిదే మా సంతాపం.

# పేద, బడుగు, బలహీన వర్గాల పెన్నిధి సుర 'వరం'



చాడ వెంకటరెడ్డి
సిపిఐ జాతీయ
కార్యవర్గ సభ్యులు

భారతదేశ రాజకీయాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలలో జరుగుతున్న పరిణామాలను అవలీలగా అర్థం చేసుకొని ప్రజలకు వివరించే బహుముఖ ప్రజ్ఞాశాలి. నిరంతరం కార్మిక, కర్షక, పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ప్రధాన లక్ష్యంగా ఆలోచన చేసే అపర మేధావి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో కీలకంగా వ్యవహరించిన గొప్ప నాయకుడు. రాజకీయ ముఖచిత్రంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొని నీతి, నిజాయితీలకు నిలువుటద్దంగా,రాజకీయవేత్తగా, మేధావిగా, విలువలతో కూడుకున్న రాజకీయ ప్రముఖుల్లో సురవరం సుధాకర్ రెడ్డికి ప్రత్యేక స్థానం ఉంది.

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మానవపాడు మండలం సురవరం సుధాకర్ రెడ్డి కంచుపాడు స్వగ్రామం. తన అమ్మమ్మ ఊరైన కొండ్రావుపల్లిలో 1942 మార్చి 25వ తేదీన జన్మించినాడు.

తండ్రి వెంకటరామిరెడ్డి తల్లి ఈశ్వరమ్మ దంపతుల కుమారుడైన సుధాకర్ రెడ్డి విద్యాభ్యాసం అంతా కర్నూలులో పూర్తి చేశారు. కర్నూలులోని ఉస్మానియా కళాశాలలో బి.ఎ పూర్తి చేశారు. సురవరం ప్రతాపరెడ్డి గారికి సుధాకర్ రెడ్డి తండ్రి వెంకట్రామారెడ్డి స్వయాన తమ్ముడు.

**విద్యార్థి, యువజన రంగాలఉద్యమ నేపథ్యం:**

విద్యార్థి దశలోనే విద్యారంగ సమస్యల పట్ల పేద బడుగు బలహీన విద్యార్థుల సంక్షేమం కోసం ఎఐఎస్ఎఫ్‌లో చేరి 19 ఏళ్లకే ఎఐఎస్ఎఫ్ కర్నూల్ పట్టణ కార్యదర్శిగా 1960లో కర్నూలు జిల్లా కార్యదర్శిగా పనిచేశారు.1967లో హైదరాబాదులోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో లా కోర్సులు చేరి ఉస్మానియా యూనివర్సిటీలో కూడా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు పోరాటాలు నిర్వహించారు. లా కాలేజీలో యూనివర్సిటీ ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా విజయం సాధించాడు.అనంతరం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టాడు.1963లో ఎఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికై అనంతరం రెండు పర్యాయాలు జాతీయ అధ్యక్షుడిగా,ప్రధాన కార్యదర్శిగా పనిచేసారు. 1972లో జాతీయ అధ్యక్షుడుగా కూడా పనిచేశారు. అనేక దేశాల్లో అంతర్జాతీయ సదస్సులకు ప్రాతినిధ్యం వహించారు.

**పార్టీ పదవుల ప్రస్థానం:**

లా పూర్తి చేసిన తర్వాత ఢిల్లీలో సీనియర్ న్యాయవాది వద్ద చేరి ప్రాక్టీస్ చేస్తున్న క్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ నాయకత్వం సిపిఐ లో పూర్తి కాలం పనిచేయడానికి అవకాశం ఇవ్వడంతో భారత కమ్యూనిస్టు పార్టీ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. అక్కడి నుండే రాష్ట్ర రాజకీయాలలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర స్థాయి నేతగా మంచి గుర్తింపు పొంది రాష్ట్ర సహాయ కార్యదర్శి ,రాష్ట్ర కార్యదర్శి స్థాయికి ఎదిగారు.

1998లో రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ కార్యవర్గ సభ్యుడిగా, కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యుడిగా పని చేశారు.

2012లో సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై 2019లో అనారోగ్య కారణాలవల్ల పార్టీ పదవుల నుండి తప్పుకున్నారు. శేష జీవితమంతా పార్టీ సెమినార్లు, సదస్సులకు, బహిరంగ సభలలో ఆరోగ్యం సరిగా లేకున్నా పాల్గొని ప్రోత్సహించారు.

**ప్రజా ప్రతినిధి ప్రాతినిధ్య ప్రస్థానం:**

1980,1984 లో మహబూబ్ నగర్ జిల్లా కొల్లాపూర్ నియోజక వర్గం,1994లో ఆనాటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి పై కర్నూలు జిల్లా డోన్ నియోజకవర్గం నుండి పోటీ పోటీ చేశారు.

1998లో జరిగిన 12వ లోకసభ స్థానానికి నల్గొండ పార్లమెంటు నియోజకవర్గం నుండి మొట్టమొదటిసారి పార్లమెంటు సభ్యుడుగా ఎన్నికయ్యారు.

2004లో తిరిగి మరొక్కసారి 14వ లోకసభకు జరిగిన ఎన్నికల్లో నల్గొండ పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యారు.

భారతదేశ అత్యున్నత పార్లమెంటరీ కమిటీలకు ప్రాతినిధ్యం వహించారు.

అనేకమంది పేదలకు ఇండ్ల స్థలాలు,ఇండ్లు నిర్మించి ఇవ్వడం కోసం కేంద్ర ప్రభుత్వం లో కీలకంగా వ్యవహరించారు.

**వైవాహిక జీవితం:**

ఎఐఎస్ఎఫ్ ఉద్యమ సమయంలో పరిచయమైన డాక్టర్ బి వి విజయలక్ష్మి ని 1974లో ఆదర్శ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. జీవిత భాగస్వామి విజయలక్ష్మి బ్యాంకు ఉద్యోగిగా సేవలందిస్తూనే పార్టీ కార్యక్రమాల్లో పూర్తిస్థాయిలో పనిచేస్తున్న సుధాకర్ రెడ్డికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించారు. జాతీయస్థాయి పార్టీ పదవిలో కొనసాగడానికి అవకాశం వచ్చిన సందర్భంగా విజయలక్ష్మి తన ఉద్యోగాన్ని సైతం వదులుకొని పార్టీ కోసం పనిచేశారు. నిత్యం ప్రజా క్షేత్రంలో ఉన్న సుధాకర్ రెడ్డికి తోడు, నీడగా తోడ్పాటునందిస్తూ, ఆయన బాగోగులు చూసుకుంటూ నాటి నుండి తుది శ్వాస విడిచే వరకు వెన్నంటి ఉన్నారు.

**సురవరంతో నా అనుబంధం:**

భారత కమ్యూనిస్టు పార్టీ క్రియాశీల రాజకీయాల్లోకి అడుగు పెట్టిన నాకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించడంలో ఎన్నడు కూడా వెనకడుగు వేయని గొప్ప మనసున్న వ్యక్తి సుధాకర్ రెడ్డి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పార్టీ కార్యదర్శిగా పనిచేస్తున్న క్రమంలో రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు ఉన్న సుధాకర్ రెడ్డి నాకు పార్టీ కార్యక్రమాల నిర్వహణ, నీతి, నిజాయితీ,క్రమశిక్షణతో ఉండాలని,సైదాంతిక అవగాహన కల్పించడంలో అందరి కంటే ముందున్నారు.

2004లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆనాటి ఇందుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సిట్టింగ్ స్థానాన్ని సైతం నాకు



2024 డిసెంబర్ 30న జరిగిన నల్లగొండ బహిరంగ సభలో సురవరం సుధాకరరెడ్డితో చాడ వెంకటరెడ్డి

వచ్చేలా చేసి నేను శాసనసభ్యులుగా గెలుపొందడం కోసం కృషి చేశాడు. పార్టీ పక్షాన శాసనసభలో సిపిఐ పక్ష నాయకునిగా పని చేస్తున్న క్రమంలో ప్రజల పక్షాన నిలబడి పనిచేయాలని అనేక సలహాలు సూచనలు ఇస్తూ ప్రోత్సహించేవారు. ఆయన ప్రోత్సాహం మరవలేనిది. నిబద్ధత కలిగిన కమ్యూనిస్టుగా తుది శ్వాస వరకు పని చేశారు. నల్లగొండలో జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ శత వత్సర ప్రారంభ వేడుకలకు ఆయన వీల్ చైర్ మీద వచ్చి సందేశం ఇచ్చారు. రాష్ట్ర పార్టీ కార్యాలయం మగ్దూం భవన్ పునర్నిర్మాణ ప్రారంభోత్సవానికి కూడా హాజరయ్యారు. వారికి పార్టీ పిలుపు ఉంటే చాలు అనారోగ్యం లెక్కచేయకుండా సమావేశాలలో పాల్గొని నాయకుల్ని, ప్రజల్ని, కార్యకర్తల్ని ఉత్సాహపరిచేవారు. వారి విడిచిన సైద్ధాంతిక లక్ష్యాలను పునికి పుచ్చుకొని ముందుకు పోవడమే ఈనాటి తరానికి లక్ష్యంగా ఉండాలి.




## ప్రాణాలతో చెలగాటం..



ఆఫ్రికన్ సఫారీని చాలామంది ప్రత్యక్షంగా చూడపోయినా, టివిల్లో, సినిమాల్లో చూసే ఉంటారు. కనీసం విని ఉంటారు. ఎంతో ఉత్కంఠను రేపడమేగాక, ప్రమాదకరమైనదిగా పేర్కొనే ఆఫ్రికన్ సఫారీలో 'వేట'కు వెళ్లడం ప్రాణాలతో చెలగాటాలు ఆడడమే. అయినప్పటికీ కొంతమంది ఔత్సాహికులు తరచు ఈ వేటకు వెళుతుంటారు. సాహస క్రీడల్లో ఆసక్తి ఉన్న ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి అషెర్ విట్కిన్స్ కూడా ఇటీవల ఆఫ్రికన్ సఫారీ విశా ల మైదానాల్లో వేటకు వెళ్లాడు. అతనితోపాటు సఫారీ కంపెనీ 'కొయెన్‌రాడ్ వెర్మాక్ సఫారీస్' (సివిఎస్)కి చెందిన గైడ్, మరో వేట నిపుణుడు కూడా ఉన్నారు. విట్కిన్స్‌ను దూరంనుంచి అతని కుటుంబ సభ్యులు ఒక వాహనం లో ఉండి గమనిస్తునే ఉన్నారు. హఠాత్తుగా ఒక అడవి దున్న మెరుపు వేగంతో దూసుకొచ్చి విట్కిన్స్‌ను కొమ్ములతో బలంగా పొడిచింది. కిందపడిన విట్కిన్స్ ను మరోసారి గాల్లోకి విసిరేసి, అంతవేగంగా అక్కడినుంచి మాయమైంది. తీవ్రంగా గాయపడిన విట్కిన్స్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. వేట ఉత్సాహం ఒక మనిషి ప్రాణాలు తీసింది. ఆఫ్రికన్ సఫారీలో ఇలాంటి ఘటనలు అప్పుడప్పుడు చోటు చేసుకుంటునే ఉంటాయి. వాహనాల్లో వెళ్లి వన్యప్రాణులను చూసి ఆనందించకుండా, వేటకు వెళ్లడం, వాటిని చంపడంలో ఆనందం ఏమిటో?

## 'క్రాప్ సర్కిల్' మాయం!



జర్మనీలోని బావేరియా ప్రాంతంలో మాయమైన 'క్రాప్ సర్కిల్'పై పరిశోధనలు విస్తృతమయ్యాయి. ఈ సంఘటన ప్రపంచవ్యాప్తం గా చర్చనీయాంశంగా మారింది. అక్కడ ఒక పెద్ద మైదానంలో ఉన్న గోధుమ పొలంలో అకస్మాత్తుగా క్రాప్ సర్కిల్ కనిపించింది. పొలాలలో పంటలపై ఏర్పడే వృత్తాకార నమూనాలను క్రాప్ సర్కిల్ అంటారు. వీటిని కొందరు వింత శక్తులు, ఎలియన్స్, లేదా అలౌకిక శక్తుల పనిగా భావిస్తారు. అయితే శాస్త్రీయంగా వీటిని, ప్రకృతి లేదా మానవ చేష్టల వల్ల జరిగే 'ఆర్ట్ ఫార్మేషన్'లుగా అభివర్ణించవచ్చు. బావేరియా ప్రాంతానికి చెందిన ఓ రైతు పొలంలో ఆవిష్కృతమైన ఈ వింత ఆకారాన్ని చూసేందుకు ప్రజలు బారులు తీరారరు. పాతకాలపు వృత్తాల నిగూఢతను పరిశీలించేందుకు పర్యాటకులు వచ్చారు. ఫొటోలు, వీడియోలు తీసేందుకు వీరు పొలాల్లోకి ప్రవేశించడంతో పంట తీవ్రంగా నష్టపోయింది. ఈ నష్టం తర్వాత ఆ రైతు, మీడియాతో మాట్లాడుతూ, 'ఈ సర్కిల్ చూసినప్పుడు ఆ అద్భుతతను అర్థం చేసుకోగలిగాను. కానీ నా దృష్టిలో అది గొప్ప కళకంటే నా జీవనాధారమైన పంట విలువైనది' అని వాపోయాడు. అందుకే పంటను కొసేసినట్టు చెప్పాడు. క్రాప్ సర్కిల్ మాయం కావడానికి అతీత శక్తులేవీ కారణం కాదని, రైతు పంట కొయడం వల్ల కనిపించకుండా పోయిందని పరిశోధకులు అంటున్నారు. భారీ గాలులు, తక్కువ స్థాయి విద్యుత్ ప్రభావం వంటి కొన్ని వాతావరణ పరిస్థితుల వల్ల క్రాప్ సర్కిల్స్ ఏర్పడే అవకాశం ఉందని వారి అభిప్రాయం. మనుషులే కొన్ని ప్రత్యేక పరికరాలతో పొలాలను ఈ విధంగా కళాకృతులుగా మార్చిన సందర్భాలు లేకపోలేదు. దీనిని 'ఫీల్డ్ ఆర్ట్' అంటారు. తామే కొన్ని శతాబ్దాలుగా క్రాప్ సర్కిల్స్ రూపొందిస్తున్నామని 1991లో డగ్ బోవర్, డేవ్ చర్లీ అనే ఇద్దరు బ్రిటిష్ కళాకారులు చేసిన ప్రకటనను ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. ఏదిఏమైనా క్రాప్ సర్కిల్ మాయం కావడం ఎలావున్నా, అది ఎందుకు, ఎలా ఏర్పడిందనే విషయంపై ఇప్పుడు జోరుగా చర్చ జరుగుతున్నది. నిజానికి ఇది జర్మనీలో జరిగిన ఒక చిన్న సంఘటన, కానీ, ఇది ప్రకృతి, కళ, ఆర్థికత, మమానవ నైజం మధ్య ఉండే సున్నిత సంబంధాన్ని ఈ ఘటన ప్రతిబింబిస్తోంది. ఒక రైతుకు తన పంటే జీవనాధారం. క్రాప్ సర్కిల్ చూడాలన్న కోరితతో ప్రజలు వస్తున్నంత మాత్రాన అతనికి ఒరిగే లాభం ఏమీ ఉండదు. అదే సమయంలో, ఇలాంటి అరుదైన ఘటనను చూడాలన్న కోరిక ప్రజలది. ఎవరి కోణంలో వారి వాదన సరైనదే. ఎలా జరిగిందో పరిశోధించి తెలుసుకోవడం ఇప్పుడిక పరిశోధకుల వంతు.

## వృక్ష శాస్త్ర అద్భుతం 'మెతుసెలా'



కాలిఫోర్నియా (అమెరికా)లోని వైట్ మౌంటైన్ పర్వత శ్రేణుల్లోని ఓ బ్రిస్టల్‌కోన్ పైన్ చెట్టుకు అరుదైన రికార్డు ఉంది. దీనిని ప్రపంచంలోనే అతి పురాతనంగా జీవించి ఉన్న వృక్షంగా పేర్కొంటున్నారు. వృక్షశాస్త్రంలో ఒక అద్భుతంగా అభివర్ణిస్తు న్న ఈ చెట్టుకు 'మెతుసెలా' అని పేరు. దీని వయసు 4000 నుంచి 5000 సంవత్సరాలు ఉండవచ్చని అంచనా. ఇప్పటి వరకూ గుర్తించిన అత్యంత పాట చెట్టుగా ఇది రికార్డు పుస్తకాల్లో పెరిగింది. సాధారణంగా బ్రిస్టల్‌కోన్ పైన్ చెట్లు కాలిఫోర్నియా, నెవడా, ఉటా వంటి పర్వత ప్రాంతాల్లో, సముద్ర మట్టానికి సుమారు అడుగుల ఎత్తులో పెరుగుతాయి. అత్యంత దుర్భర పరిస్థితుల్లోనూ బతికే శక్తి ఈ చెట్టుకు ఉంటుంది. చలికాలం, ఎండ, తక్కువ నీరు, బలమైన గాలులు వంటి ప్రతికూల పరిస్థితులను ఈ జాతి చెట్లు తట్టుకొనిని జీవించగలదు. ఈ చెట్టు పెరుగుదల చాలా నెమ్మదిగా ఉంటుంది. కానీ గట్టిగానూ, పీడనాలకు తట్టుకునే రీతిలోనూ ఉంటుంది. ఈ చెట్ల వలయాలు (ట్రీ రింగ్స్)ను ఉపయోగించి, పూర్వకాల కావావరణాన్ని అంచనా వేయగలుగుతారు. సాధారణంలో చెట్లకు ఉన్న ప్రతి వలయం ఒక్క సంవత్సరానికి సమానం. ఈ వలయాలను బట్టి చెట్టు జీవిత కాలాన్ని తెలుసుకోవచ్చు. బ్రిస్టల్‌కోన్ పైన్ చెట్లు ఒంటరిగా, వంకరగా పెరుగుతాయి. వాటి పైకి తిరిగే కొమ్మలు, వంగిన తాడులు అద్భుత దృశ్యాన్ని ఆవిష్కరిస్తాయి. ప్రతి బ్రిస్టల్ కోన్ పైన్ చెట్టూ ఒక ప్రాచీన శిల్పంగా కనిపిస్తుంది. కనవిందు చేస్తుంది. కాగా, ప్రపంచంలోని అత్యంత ఎక్కువ వయసుగల చెట్టు 'మెతుసెలా'ను రక్షించే క్రమంలో, దాని ఖచ్చితమైన స్థానాన్ని అధికారులు రహస్యంగా ఉంచుతున్నారు. ఈ చెట్టును మానవ జాతీయ వారసత్వ సంపద గా గుర్తించారు.

## అబ్బురపరచే 'చంద్ర ధనస్సు'

ఇంద్ర ధనస్సు లేదా హరివిల్లు అనేది మనకు తెలుసు. వర్షం బిందువుల ద్వారా కాంతి పరావర్తనమైనప్పుడు ఆవిష్కారమయ్యే ఏడు రంగుల అద్భుత దృశ్యం కనువిందు చేస్తుంది. అయితే, చంద్ర ధనస్సు లేదా చంద్ర విల్లు గురించి చాలా తక్కువ మందికి తెలిసి ఉండవచ్చు. పగటిపూట ఇంద్రధనస్సు లాగా, చంద్రకాంతి వక్రీభవనం, ప్రతిబింబం, గాలిలోని నీటి బిందువుల ద్వారా చెదరగొట్టబడినప్పుడు ఏర్పడే అరుదైన వాతావరణ దృగ్విషయం. అయితే, చంద్రకాంతి సూర్యకాంతి కంటే చాలా మసకగా ఉంటుంది కాబట్టి, చంద్రవిల్లు తరచుగా కంటితో మసకగా లేదా తెల్లగా కనిపిస్తాయి, వాటి రంగులు దీర్ఘకాలం బహిర్గతమయ్యే ఛాయాచిత్రాలలో మాత్రమే కనిపిస్తాయి. ఈ సంఘటనలకు నిర్దిష్ట పరిస్థితులు అవసరం. దాదాపు పౌర్ణమి, చంద్రునికి ఎదురుగా స్పష్టమైన ఆకాశం, సరైన స్థానంలో వర్షం లేదా పొగమంచు ఉన్నపుడు మాత్రమే ఇవి కనిపిస్తాయి. ఇటీవల హవాయ్ ద్వీపాల్లో కనిపించిన చంద్ర ధనస్సు చూపరులు అబ్బురపరచింది. రాత్రిపూట వర్షాలు, స్వచ్ఛమైన గాలి, కనీస కాంతి కాలుష్యం కారణంగా చంద్రవిల్లులను చూడటానికి ఉత్తమ ప్రదేశాలలో హవాయ్ ఒకటి. అగ్నిపర్వత పర్వతాలు మరియు జలపాతాలు తరచుగా చక్కటి పొగమంచును సృష్టిస్తా యి. ఇది దృశ్యానికి అనువైన పరిస్థితులను కల్పిస్తుంది. చంద్రవిల్లు రాత్రి ఆకాశంలో ఒక అతీంద్రియ చాపాన్ని సృష్టిస్తుంది. కాంతి, నీరు, భూమి యొక్క వాతావరణం యొక్క సహజ లయల మధ్య పరస్పర చర్య యొక్క ఉత్కంఠభరితమైన ఓ మధురమైన జ్ఞాపకాన్ని అందిస్తుంది.



— బిఎస్ఎస్ మైత్రేయి

## ప్రమాదవశాత్తు కతువాలో పడి రైతు మృతి

**ప్రజాపక్షం/నూతన్‌కల్:** ప్రమాదవశాత్తు కాలుజారీ రైతు కత్తువాలో పడి మృతి చెందిన సంఘటన శనివారం మండల పరిధిలోని బిక్కుమళ్ల గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బిక్కుమళ్ల గ్రామానికి చెందిన కప్పల అంజయ్య (73) తన వ్యవసాయ క్షేత్రంలో కొలిశెట్టి రాజయ్య కత్తువాలో బోరు బయటకు తీస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారీ పడటంతో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



## ఆత్మస్థైర్యంతో శాంతి భద్రతలను కాపాడాలి

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** మహిళ పోలీస్ సిబ్బంది, పురుష సిబ్బందితో సమానంగా ప్రజల్లోకి వెళ్లి విధులు నిర్వర్తించే సమయంలో వారికి ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనటకు గాను వారిలో ఆత్మ విశ్వాసం, ధైర్య కలిగించడానికి జిల్లా పోలీసు కార్యాలయంలో వారం రోజుల పాటు సెల్ఫ్ డిఫన్స్ శిక్షణా ఇవ్వడం జరిగింది. శనివారం ముగింపు కార్యక్రమానికి జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ హాజరై మాట్లాడుతూ పోలీసు శాఖలో విధి నిర్వహణలో నిత్యం అనేక రకాల విధులు క్రైమ్ సంబంధిత, నేర పరిశోధన, బ్లూ క్లోట్స్, నైట్ పెట్రోలింగ్,బందోబస్తులు, డ్రంక్ అండ్ డ్రైవ్, నేరస్థులను పట్టుబడి చేయడం లాంటి విధులు నిర్వర్తించాల్సి వస్తుందని ఈ క్రమంలో అనేక సమస్యలు ఎదురవుతాయని తెలిపారు.అలాంటపుడు మహిళ సిబ్బంది దైర్యంగా ఎదుర్కొనుటకు ఈ శిక్షణలో నేర్చుకున్న మెలకువలు ఎంతో దోహదపడతాయని అన్నారు.ఈ శిక్షణ ద్వారా వారిలో ఆత్మస్థైర్యం కలిగి నేర నియంత్రణ,శాంతి భద్రతలు పరిరక్షణకు అన్ని రకాల విధులు నిర్వర్తించడానికి సిద్ధంగా చేయడం జరిగిందన్నారు. ఏఎస్‌పి మౌనిక, ఎస్‌బి సిఐ రాము, మహిళా పోలీసు స్టేషన్ సీఐ కరుణాకర్,ఆర్.ఐ సంతోష్ సిబ్బంది పాల్గొన్నారు.



## అభివృద్ధికి నిలువుటద్దం.... కాంగ్రెస్ పాలన

### భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** నార్కెట్‌పల్లి నుండి మాంద్ర వరకు రూ. 14 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించే రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం తో కలిసి భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారు. శనివారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్. ఓ. వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో ప్రసిద్ధి గాంచిన శైవ క్షేత్రం చెర్వుగట్టు శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్‌ను ఏర్పాట్లు చేశామని, నార్కెట్పల్లి చెరువును ఆహ్లాద వాతావరణంగా తయారు చేయడానికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ల సహకారంతో అభివృద్ధి చేయడానికి ప్రణాళిక రూపొందించమన్నారు. అనంతరం ఎంపి చామల మాట్లాడుతూ బిఆర్ఎస్, బిజెపి పార్టీల అలసత్వం వల్లనే నేడు రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐతరాజు యాదయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బత్తుల ఉషయ్య, మాజీ జడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్య యాదవ్, మాజీ ఎంపిటిసి పాశం శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్ఓ అధికారి, స్థానిక వైద్యాధికారి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

## సుధాకర్‌రెడ్డి మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

### సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి :** సిపిఐ అగ్ర నాయకులు సుప్రసిద్ధ కమ్యూనిస్టు యోధుడు, సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, ప్రముఖ పార్లమెంటేరియన్ నల్గొండ మాజీ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకరరెడ్డి మరణం యావత్ భారత దేశ ప్రజానీకానికి, భారత కమ్యూనిస్టు పార్టీకి తీరనిలోటని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి అన్నారు. శనివారం సుధాకర్ రెడ్డి మరణం పట్ల సిపిఐ కార్యాలయం ఆవరణలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి జెండాను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కార్యాలయం , వినాయక చౌరస్తాలో సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి మాట్లాడారు. ఈ నివాళి కార్యక్రమంలో సిపిఐ సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చెడే చంద్రయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, ఎండీ ఇమ్రాన్, ఏశాల అశోక్, బిఎస్పి రాష్ట్ర నాయకులు బట్టు రామచంద్రయ్య, సిపిఐ మండల కార్యదర్శులు గాదెగాని మాణిక్యం, కల్లేపల్లి మహేందర్ పాల్గొన్నారు.

## శాంతియుతంగా ఉత్సవాలు :డిఎస్‌పి



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి సూచించారు. రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఉద్దేశించి జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ ఆదేశానుసారం శనివారం శాంతి సంఘం సభ్యులతో, గణేష్ నిర్వాహకులతో పట్టణంలోని స్టార్ ఫంక్షన్ హాల్లో శాంతి సంఘ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ నల్లగొండ పట్టణ ప్రజలు గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని, అదేవిధంగా గణేష్ మండప నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.గణేష్ ఏర్పాటు వివరాలను విధిగా ఆన్లైన్ చేసుకోవాలని, గణేష్ మండపం వద్ద మైక్ సెట్ ల సౌండ్ వల్ల ఇతరులకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వన్ టౌన్ సిఐ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, టూ టౌన్ సిఐ రాఘవరావు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మహాలక్ష్మయ్య, వన్ టౌన్ ఎస్ఐ గోపాలరావు, టూ టౌన్ ఎస్ఐ సైదులు, రూరల్ ఎస్ఐ సైదాబాబు, మున్సిపల్ కమిషనర్ , గ్రంథాలయ ఛైర్మెన్ హాఫీజ్ ఖాన్, అబ్బగోని రమేష్, లక్ష్మయ్య, ఖలీం, హాశం , వీరెల్లి చంద్ర శేఖర్, కర్నాటి యాదగిరి, కౌన్సిలర్స్ తదితరులు పాల్గొన్నారు

## రామన్నపేటలోఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలి



**ప్రజాపక్షం/ రామన్నపేట:** రామన్నపేట రైల్వేస్టేషన్‌లో గతంలో మాదిరిగతా ప్రధాన రైళ్లు నారాయణాద్రి, పల్నాడు, డెల్టా, ఫలక్‌నామా ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపి పరిసర మండల ప్రాంత ప్రయాణీకుల సమస్య తీర్చాలని సీపీఎం ఆధ్వర్యంలో రామన్నపేటకు విచ్చేసిన స్థానిక ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశంకు వినతిపత్రం అందించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య మాట్లాడుతూ రామన్నపేట రైల్వేస్టేషన్‌లో ఇక్కడి ప్రాంత ప్రజలు అదేవిధంగా చౌటుప్పల్, వలిగొండ, ఆత్మకూర్, మోత్కూర్ పరిసర మండలాల ప్రజలు కేంద్రంగా చిరు వ్యాపారులు, ఉద్యోగస్తులు చేనేత కార్మికులు నిత్యం రైళ్లలో ప్రయాణీస్తూ ఉండే వారిని కరోనా సమయంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలిపివేయడంతో వాటిని పునరుద్ధరించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వెంటనే రైల్వే అధికారులతో మాట్లాడి చొరవ చూపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యుడు కందుల హనుమంతు, మండల కమిటీ సభ్యులు బావండ్లపల్లి బాలరాజు, గొరిగె సోములు, పట్టణ కార్యదర్శి మునికుంట్ల లెనిన్, శానగొండ వెంకటేశ్వర్లు, గుండాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# యూనివర్సిటీకి భూములిచ్చేది లేదు

### భూ సర్వేను అడ్డుకున్న రైతులు

### ప్రభుత్వం ప్రతిపాదనను మార్చుకోవాలి

### సర్వేనంబర్ 1041 రైతులు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్‌లో నిర్మించతలచిన అగ్రికల్చరల్ యూనివర్సిటీకి తమ భూములు ఎట్టి పరిస్థితుల్లో ఇచ్చేదే లేదని హుజూర్‌నగర్‌లోని సర్వే నంబర్ 1041లోని రైతులు తీవ్ర ఆందోళనకు దిగారు. తెలంగాణ రాష్ట్ర భారీనీటిపారుదల,ఆహార,పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించి హుజూర్‌నగర్‌కు అగ్రికల్చరల్ యూనివర్సిటీని మంజూరీ చేయించిన విషయం విధితమే. కానీ ఆ యూనివర్సిటీని నిర్మించేందుకు కావాల్సిన భూములు ఇచ్చేందుకు రైతులు సుముకంగా లేరు. మొదటగా మండల పరిధిలోని బూరుగడ్డలో యూనివర్సిటీని నిర్మించాలని అధికారులు భూమి సర్వే కూడా చేపట్టడం జరిగింది. సర్వేకి వెళ్ళిన అధికారులకు రైతులు తమ భూములు ఇవ్వం అంటే ఇవ్వమని గట్టిగానే చెప్పారు. ఆతర్వాత మళ్ళీ హుజూర్‌నగర్ లోని మగ్దుంనగర్ పరిసరాలలో ఉన్నటువంటి సర్వే నంబర్ 1041లో యూనివర్సిటీని నిర్మించేందుకు అధికారులు సుమారు 273 ఎకరాలను గుర్తించారు. ఆ 273 ఎకరాలలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న సుమారు 300 మంది సన్నచిన్న కారు రైతులు శనివారం హుజూర్‌నగర్ ఆర్‌డీఓ కార్యాలయం ముందు తీవ్ర ఆందోళనకు దిగారు. అంతకు ముందు సర్వే నంబర్ 1041లో భూ సర్వేకు వెళ్ళిన అధికారులను రైతులు అడ్డుకుని ప్రతిఘటించారు. గత 60 సంవత్సరాలుగా భూములలో వ్యవసాయం చేసుకుంటూ తమ జీవనం సాగిస్తున్నామని,ఇప్పుడు ఆభూములలో యూనివర్సిటీ నిర్మిస్తే తమ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం తమ ప్రతిపాదికను మార్చుకోవాలని కోరుతూ, తమ భూములు లాక్కోవద్దంటూ రైతులు మొరపెట్టుకున్నారు.

## ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా దర్యాప్తు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** సైబర్ నేరాల దర్యాప్తులో అవగాహనతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా దర్యాప్తు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని జిల్లా ఎస్‌పి కె.నర్సింహా అన్నారు. శనివారం జిల్లా పోలీస్‌స్టేషన్‌లలో పోలీస్ సైబర్ వారియర్స్‌గా పనిచేస్తున్న పోలీస్ సిబ్బందికి శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ సైబర్ నేరాల వల్ల సమాజంలో పెరుగుతున్న ప్రమాదాన్ని వివరించారు. సైబర్ నేరాల దర్యాప్తు పద్ధతులు, డిజిటల్ ఫోరెన్సిక్, ఆధారాల సంరక్షణ, ఆన్‌లైన్ మోసాల గుర్తింపు, నివారణ, బ్యాంక్‌ల నగదు స్వాదీనం, బాధితులకు అందించు విధానాలు,నివేదిక ప్రక్రియలపై తెలియపర్చాలని, ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా జిల్లా పోలీస్‌శాఖ సైబర్ వారియర్స్ సైబర్ నేరాలపై మరింత ప్రభావవంతంగా స్పందించగల సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. బాధితుల పట్ల సాదరంగా స్పందించాలి వారు ఫిర్యాదు చేసే స్థితిలో లేకపోతే ఫిర్యాదు ఆన్‌లైన్ నందు నమోదు చేసి ఫిర్యాదు రాసి ఇవ్వాలని సైబర్ వారియర్స్‌కు ఎస్‌పి సూచించారు. సైబర్ మోసానికి గురైతే 1930కి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ సెక్యూరిటి ఇన్స్‌పెక్టర్ లక్ష్మి నారాయణ, స్పెషల్ బ్రాంచ్ ఇన్సెపెక్టర్ రామారావు, సైబర్ వారియర్స్ పాల్గొన్నారు.

## ఆందోళనల నడుమ యూరియా విక్రయాలు



**ప్రజాపక్షం/వేములపల్లి:** యూరియా కోసం రైతులు ఆందోళనకు దిగుతున్నారు వరి నాట్లు పెట్టి నెలలు గడుస్తున్న యూరియా వేయాక పంట పొలాలు పాడైపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, మండలంలోని రైతులు గత నాలుగైదు రోజులుగా యూరియా కోసం బార్లు తీరిన రైతులు యూరియా అందక ఆవేదన చెందుతున్నారు ఒక లోడు వస్తే సుమారు 250 మందికి మాత్రమే అందుతుందని వేలమంది రైతులు ఎదురుచూసి నిరాశతో ఇంటి ముఖం పడుతున్నారు, ఇదెక్కడి న్యాయమని రైతులకు ఎరువులు అందించకపోతే వ్యవసాయం చేసేది ఎలా అని కంటతడి పెడుతున్నారు, తెల్లవారుజామున ప్రాథమిక సహకార సంఘం దగ్గరకు చేరుకొన్న రైతులు చీకటి పడిన తర్వాత ఇళ్లకు చేరుతున్నరూ. యూరియా తీసుకపోవాలనే వారి కళ నిరాశ గానే మిగిలిపోతుంది. గత ఐదు రోజుల క్రితం జూరియా కోసం టోకెన్ రాయించుకున్న ఐదు రోజుల క్రితం టోకెన్ రాయించుకుని ప్రతిరోజు వచ్చి పోతున్నప్పటికీ నాకు యూరియా ఇవ్వడం లేదని ఓ మహిళా రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

# గమ్యాన్ని చేరేంత వరకూ కష్టపడి చదవాలి

### జీవితంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకుని ఆ లక్ష్యసాధనకు ప్రయత్నించాలి : కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట:** జీవితంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకుని ఆ లక్ష్యసాధనకు ప్రయత్నించాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అన్నారు. శనివారం పట్టణంలోని మహాత్మాజ్యోతిరావుపూలే బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కలెక్టర్ విద్యార్థినీలతో భోజనం చేస్తూ చదువు, ఇతర అంశాలపై అభిప్రాయాలు, తల్లిదండ్రుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. డిగ్రీ రెండవ సంవత్సరం విద్యార్థినీలతో మాట్లాడుతూ జీవితంలో ఏం అవ్వాలనుకుంటున్నారని ప్రశ్నించారు. అవినీతి రహిత సమాజాన్ని రూపొందించేందుకు సివిల్స్, గ్రూప్స్ పరీక్షలు రాసి ప్రభుత్వ అధికారులమవుతామని, డాక్టర్, టీచర్, సిఏ ఇండియన్ ఫారెస్టు అధికారి, జూనియర్ లెక్చరర్స్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవ్వాలని ఉందని కలెక్టర్‌కు విద్యార్థినీలు తెలిపారు. కలెక్టర్ విద్యార్థినిలకు కెరియర్‌పై దిశా నిర్దేశం చేస్తూ... ఒకసారి జీవితంలో ఏమీ అవ్వాలో నిర్ణయించుకున్న తర్వాత మధ్యలో మార్చుకోకూడదన్నారు. ఐటి మెడికల్, సివిల్ సర్వీసెస్, గ్రూప్స్, టీచర్, బిజినెస్, సిఏ వంటి ఏ రంగాల్లో ఇష్టమో ఏ రంగంలో ప్రతిభ ఉందో గుర్తించి ఆదిశగా అడుగులు వేయాలని అన్నారు. 5వ తరగతి నుండి డిగ్రీ వరకు 852 మంది విద్యార్థినీలు ఇక్కడ చదువుకుంటున్నారని, డిగ్రీ విద్యార్థినీలకు ప్రత్యేకంగా కళాశాల సూర్యాపేట పట్టణం విద్యానగర్ మెట్రో హస్పిటల్ వెనుక భాగంలో భవనంను ఏర్పాటు చేశామని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆ భవనం పరిశీలించి మంచిగా పెయింట్స్ వేయాలని, తరగతి గదులలో లైటింగ్స్, ఫ్యాన్స్ ఏర్పాటు చేయాలని, టాయిలెట్స్, బాత్‌రూమ్‌లు వేరు వేరుగా ఏర్పాటు చేయాలని, ప్రతి ఫ్లోర్‌లో టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని అదేశించారు. బిసి వెల్ఫేర్ అధికారి శ్రీనివాస్‌నాయక్, ఆర్‌సివో స్వప్న, డిసివో లక్ష్మి , ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భూ సమస్యలు పరిష్కరిస్తాం



**ప్రజాపక్షం/చందంపేట :** నల్గొండ జిల్లా చందంపేట మండలం రేకులగడ్డ గ్రామ పంచాయతీలో జరిగిన గ్రామసభలో ఆనాటి ధరణిలో జరిగిన అవకతవకల గురించి భూ సమస్యల కోసమే కొత్తగా వచ్చిన భూ భారతి చట్టం 2025 అనుసరించి సర్వే నిర్వహించి పరిష్కారం చేస్తామని దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి శనివారం అన్నారు. గ్రామ ప్రజలు అందరూ అందుబాటులో ఉండి సర్వే చేయించుకోవాలని అధికారులకు సహకరిస్తే అన్ని సమస్యలు త్వరలో రేకులగడ్డ రెవెన్యూ భూములను కొన్ని సంవత్సరాల నుండి సాగు చేసుకొని గతంలో ఇచ్చిన పట్టా భూములకు పరిష్కారం చేయడం జరుగుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో చందంపేట తహశీల్దార్ శ్రీధర్‌బాబు, రెవెన్యూ సిబ్బంది అనిల్, సర్వేయర్ జేసన్, గ్రామ పెద్దలు అంజయ్య, రమేష్, ఆంజనేయులు, బాషా తదితరులు పాల్గొన్నారు.

# హత్యాయత్నం కేసులో నలుగురు నిందితులు అరెస్టు

### సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్నకుమార్ వెల్లడి




**ప్రజాపక్షం/చివ్వెంల:** హత్యాయత్నం కేసులో నలుగురు నిందితులను చివ్వెంల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దీనికి సంబంధించిన వివరాలను శనివారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్నకుమార్ వివరాలను వెల్లడించారు. మండలంలోని కుడకుడ గ్రామ శివారులోని మధుర వైన్స్ వద్ద శుక్రవారం అక్కలదేవిగూడెం గ్రామానికి చెందిన దండుగుల లక్ష్మయ్య , అతని ఇద్దరు భార్యలను కర్రలతో దాడిచేసి హత్యయత్నం చేసేందుకు ప్రయత్నించారు. వారు మోటార్ సైకిల్‌పై వెళ్లి రోడ్డు పక్కన ఉన్న వైన్‌షాపులో తలదాచుకున్నారు. కారులో వెంబడించిన నలుగురు దుండగులు కర్రలతో దాడిచేసేందుకు యత్నించారు. ఈ కేసులో బాధితుని ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుల్లో కుడకుడ గ్రామానికి చెందిన దుండగుల శేఖర్, సూర్యాపేటలోని సుందరయ్య నగర్‌కు చెందిన పల్లపు గోపి, సూర్యాపేట మండలంలోని గ్రామానికి చెందిన పల్లపు రాము, అదే మండలంలోని రాయినిగూడెం గ్రామానికి చెందిన పసుపుల చంటి లను అరెస్టు చేసి విచారించగా నిందితుడు దుండగుల శేఖర్‌కు లక్ష్మయ్య భార్య వెంకటమ్మతో అక్రమ సంబంధం పెట్టుకోవడంతో గతంలో గొడవలు జరిగాయి. మరో నిందితుడు పల్లపుగోపికి లక్ష్మయ్యతో రాయి పనుల వివాదం జరిగింది. ఈ ద్వేష భావానలతో నిందితులు నలుగురు కలిసి లక్ష్మయ్యను హత్య చేసేందుకు పథకం వేసినట్లు అంగీకరించారు. లక్ష్మయ్యను చివ్వెంల మండల కేంద్రానికి పిలిచి కర్రలతో దాడిచేసి హత్య చేయడానికి ప్రయత్నించగా అక్కడ నుండి తప్పించుకుని బైకుపై వెళ్లగా కారులో వెంబడించి హత్య చేసుందకు ప్రయత్నించినట్లు చెప్పారు. హత్యయత్నానికి ఉపయోగించిన మారుతి సుజికి సిఫ్ట్‌కారును స్వాదీనం చేసుకుని అనంతరం నిందితులను కోర్టుకు రిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సూర్యాపేట రూరల్ సిఐ రాజశేఖర్, ఎస్ఐ మహేశ్వర్ పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** రోడ్డు ప్రమాదాల నియంత్రణకు స్పీడ్ బ్రేకర్లు ఎంతో కీలకమని సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో విద్యార్థులతో నిత్యం రద్దీగా ఉండే 60 ఫీట్ల రోడ్డులో ప్రమాదాల నియంత్రణ కోసం 6 ప్రదేశాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ మాట్లాడుతూ 60 ఫీట్ల రహదారిలో ఎక్కువగా కళాశాలలు, పాఠశాలలు ఉన్నాయని, ఈ రహదారిపై ప్రమాదాలను నియంత్రించేందుకు సురక్షిత ప్రయాణ బరోసాను కల్పించేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు .

## పేరుకుపోయిన చెత్తాచెదారం..

### దుర్గంధభరితంగా కాలనీలు

### పట్టించుకోని మున్సిపల్ అధికారులు



**ప్రజా పక్షం/ నల్లగొండ టౌన్ :** పట్టణంలోని దేవరకొండ రోడ్డులో గల గాంధీ న్యూరో హాస్పిటల్, జె ఎస్ ఆర్ గ్రాండ్, తో పాటు వివిధ వాణిజ్య సముదాయాల పక్కన ఉన్న ఖాళీ స్థలంలో మురికి కాలువలు చెత్తాచెదారం పేరుకుపోయి రాత్రి వేళలో మలమూత్రాలు విసర్జించడం వలన అటు నుండి వచ్చిపోయే బాటసారులు ఆ కాలనీ వాసులు తీవ్ర దుర్వాసనకు గురై అనారోగ్య పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం సీజన్ అయినందున దుర్గంధం వలన, సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ఓపెన్ ప్లాట్ కు ఫన్సింగ్‌ఏర్పాటు చేసి చెత్తాచెదారం, మలమూత్రాలు విసర్జించకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు. గాంధీ న్యూరో ఆసుపత్రికి వచ్చే పేషెంట్ లు జేఎస్‌ఆర్ గ్రాండ్ వినియోగదారులు వివిధ వాణిజ్య సంస్థకు వచ్చే కస్టమర్లు దుర్గండం వలన లేనిపోని రోగాలు వచ్చే ప్రమాదం ఉందని భయపడుతున్నారని మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించాలని కోరారు.

## కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించాలి

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/దేవరకొండ:** గ్రామీణ ప్రాంత ప్రజలలో కుటుంబ నియంత్రణ పట్ల అవగాహన కల్పించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం ఆమె నల్గొండ జిల్లా దేవరకొండ డివిజన్ పరిధిలోని దేవరకొండ మండలం బొడ్డుపల్లి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపి రిజిస్టర్, ఏఎన్‌సి, ఈడిడి, హైరిస్క్ రిజిస్టర్లు,ఐరన్ ఫోలిక్ మాత్రల పంపిణి, డెలివరీలు, సీజనల్ వ్యాధుల వివరాలను పరిశీలించడమే కాకుండా డాక్టర్‌ని అడిగి తెలుసుకున్నారు. శనివారం 65 మంది ఔట్ పేషెంట్లు పిహెచ్‌సికి వచ్చారని, సిజనల్ వ్యాధులతో వస్తున్న వారి వివరాలను డా. విజయను అడిగి తెలుసుకున్నారు. పిహెచ్‌సిల ద్వారా సాధారణ ప్రసవాలు అయ్యేలా చూడాలని తెలిపారు గర్భిణిలు సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవడమే కాకుండా, పౌష్టికాహారం తీసుకునేలా చూడాలన్నారు. ఈడిడి క్యాలెండర్‌ను తూచా తప్పకుండా పాటించాలని ఆదేశించారు. దేవరకొండ లాంటి మారుమూల గిరిజన ప్రాంతాలలో ప్రజలు అవగాహన లోపం వల్ల కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించారన్నారు. అనంతరం కలెక్టర్ మండలంలోని ముదిగొండ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల రెసిడెన్షయల్ పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, వంటగది, డైనింగ్‌లను పరిశీలించగా కిచెన్‌లో నుండి వెళ్లే వృధా నీరు ఓపెన్ డ్రైనేజి ఉండడం, అంతేకాక వాష్‌రూంల ద్వారా బయటకు వెళ్లే మురుగు నీరు ఓపెన్ డ్రైనేజి ఉండడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఓపెన్ డ్రైనేజి వల్ల విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చూడాలని ప్రిన్సిపాల్ హనుమకుమారిని ఆదేశించారు. ఈసందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడుతూ చరిత్ర, భౌగోళిక శాస్త్రం, జనరల్ నాలెడ్జి సబ్జెక్టులపై పలు విషయాలను అడిగి సమాదానాలను రాబట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థినిలకు చాక్లెట్లను పంపిణి చేశారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రమణారెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుతంగా గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలి : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గణేష్ ఉత్సవాలను ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం స్తానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన శాంతి సంఘం సమావేశంలో ఆయన సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, డీఎస్పీ రాజశేఖర్‌రాజులతో కలిసి పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలందరు ఆహ్లాదకర వాతావరణంలో భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలని కోరారు. రాత్రి వేళల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. అన్ని కులాలు, మతాల ప్రజలు కలిసిమెలిసి ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి చిలుకూరి బాలు, పట్టణ అధ్యక్షుడు నూకల వేణు గోపాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ దేశిడి శేఖర్‌రెడ్డి, నాయకులు జానకిరాంరెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** పేదల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి మహబూబ్‌నగర్ గ్రామీణ మండలానికి చెందిన పలువురికి సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని 5 లక్షల నుంచి 10 లక్షల రూపాయలకు పెంచిందన్నారు. పేదవారి ఆరోగ్యాన్ని కాపాడేది. ప్రజా ప్రభుత్వమే అని ఆయన స్పష్టం చేశారు. ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేక పోయినా, ప్రజలకు ఇచ్చే ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ఆపు చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారేపల్లి సురేందర్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, డిసిసి కార్యదర్శి టంకర కృష్ణయ్య యాదవ్, నాయకులు గోవిందు యాదవ్, సుధాకర్‌రెడ్డి, ఖాజా, రాజు గౌడ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## జడ్చర్ల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తిరుపతి



**ప్రజాపక్షం/ జడ్చర్ల :** జడ్చర్ల ప్రొఫెషనల్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తిరుపతి ఎన్నికయ్యారు. శనివారం అమావాస్య సందర్భంగా జడ్చర్ల ఫోటో భవన్ లో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడిగా, తిరుపతి, ప్రధాన కార్యదర్శి గా గయాజ్, కోశాధికారి గా అజయ్ నీ ఎన్నుకున్నా రు. కొత్తగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమం కోసం పాటు పడతామన్నారు. అనంతరం అధ్యక్షుడిగా సీనియర్ ఫోటో గ్రాఫర్ చంద్ర మౌళి నీ ఎన్నుకోగా ఉపాధ్యక్షులుగా గడుసు శేఖర్, హాజీ, దశరథ్, ఈశ్వర్, చెన్నయ్య, ఇతర జగన్, ఇఫ్తేకర్, రమేష్, ఉదయ్, శ్రీకాంత్, శేఖర్, హరి లను ఎన్నుకున్నారు.

## ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు నమ్మకం కలిగించాలి :వంశీకృష్ణ



**ప్రజాపక్షం/వంగూర్ :** ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా ఉపాధ్యాయులు పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టిఎంఎల్ మేళా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఉపాధ్యాయులు సృజనాత్మకంగా తయారుచేసిన బోధన పరికరాలను ఎమ్మెల్యే చేతులమీదుగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏకకాలంలోనే విద్యార్థులకు దుస్తులు , పాఠ్యపుస్తకాలను పంపిణీచేసి నప్రభుత్వం సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వమన్నారు. విద్యావ్యవస్థపై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులదే ప్రధానపాత్ర అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ కమీషన్ సభ్యులు కెవిఎన్‌రెడ్డి, జిల్లావిద్యాశాఖ అధికారి రమేష్‌కుమార్, తహసీల్దార్ మురళిమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## బడిగా మారిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం బడిగా మారింది. విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని 27 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఎంపిక చేసి, మహబూబ్‌నగర్ ఫస్ట్, వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శతశాతం అనే కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టారు. అందులో భాగంగా మహబూబ్‌నగర్ పట్టణ, మహబూబ్‌నగర్ రూరల్, హన్వాడ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవతరగతి చదువుతున్న విద్యార్థులకు మహబూబ్‌నగర్ ఫస్ట్, వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించారు. ఎంట్రెన్స్ టెస్ట్‌లో మెరిట్ సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే సహకారంతో ఈనెల 23,24 తేదీలలో విద్యార్థులకు క్యాంపు కార్యాలయంలో ప్రేరణా తరగతులను అనుభవజ్ఞులైన అధ్యాపకుల బృందంచే నిర్వహిస్తున్నారు. ఇక్కడ ప్రేరణ తరగతులలో పాల్గొన్న విద్యార్థులు తమ తమ పాఠశాలలో లిటిల్ టీచర్స్‌గా పనిచేస్తారని వందేమాతరం ఫౌండేషన్ సభ్యులు అనిల్ తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు మొత్తం 277 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ సభ్యులు రవీందర్, మహేందర్‌రెడ్డి, వెంకటేశ్, మహబూబ్‌నగర్ ఫస్ట్ సభ్యులు రాధి తదితరులు పాల్గొన్నారు.

## 25,26 తేదీల్లో రైతు సంఘం రాష్ట్ర మహాసభలు



**ప్రజాపక్షం/ కృష్ణ :** నారాయణపేట జిల్లా కృష్ణ మండలం ఖాన్ దొడ్డి గ్రామంలో లక్ష్మ ణ్ అధ్యక్షతన మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ఆగస్టు 25, 26 తేదీలలో జరిగే అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ప్రథమ సహాసభల వాల్ పోస్టర్లను అవిష్కరించారు. ఈ సందర్భంగా ఎఐయుకెఎస్ జిల్లా నాయకులు డి.ఆనంద్ మాట్లాడుతూ దేశంలో రైతంగం సంక్షోభంలో ఉందని కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల మరింత రైతుల పరిస్థితి దిగజారి పోతున్నాయని, పంటలు వేసుకుని రెండు నెలలు కావస్తున్న సకాలంలో ఎరువులు అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని తెలిపారు. కేంద్ర మంత్రులు, రాష్ట్ర పైన రాష్ట్ర ప్రభుత్వ కేంద్రం పైన వేసి చేతులు దులుపుకోవడం సరైయినది కాదని వెంటనే రైతంగానికి అవసరమైనటువంటి యూరియాను వెంటనే రైతులకు సరఫరా చేయాలని అన్నారు. అలాగే అకాల వర్షం వల నష్టపోయిన పంటలకు వెంటనే ప్రభుత్వం నష్టపరిహారాన్ని చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ మహాసభలను రైతులు, రైతు కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మ ణ్ ,మహాదేవ్ , తాయప్ప, శరణప్ప, బాలు, హనుమంతు, కిరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి



**ప్రజాపక్షం/ మాగనూర్ :** పండుగల శాంతియుతంగా జరుపుకోవాలని మాగనూరు ఎస్సై అశోక్ బాబు అన్నారు. రాబోయే గణేష్ నవరాత్రి ఉత్సవాలు, మిలాద్‌ఉన్‌నబి పండుగల సందర్భంగా జిల్లా ఎస్‌పి యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు మాగనూరు ఎంపిడిఒ ఆఫీసులో అన్ని మతస్తుల పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆర్గనైజర్లు ప్రజాప్రతినిధులు, మండల అధికారులతో శాంతి సమావేశం నిర్వహించి ప్రజలంతా ఉత్సవాలు శాంతియుతంగా, పరస్పర గౌరవంతో తమ పండుగలు జరుపుకోవాలని మాగనూర్ ఎస్సై అశోక్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ రాబోయే పండుగలను ప్రజలంతా కులమతాలకతీతంగా శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఉత్సవాల ర్యాలీలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీస్ బందోబస్తే ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సురేష్, ఎంపీడీవో శ్రీనివాస్, విద్యుత్, వివిధ మండల అధికారులు, హిందే ముస్తిం మత పెద్దలు, ఉత్సవ కమిటీ ఆర్గనైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రిబ్యూషన్ పెనన్ స్కీమ్ రద్దు చేయాలి

**ప్రజాపక్షం/మక్తల్ :** సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ శనివారం తపస్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మక్తల్ మండల శాఖ ఆధ్వర్యంల వివిధ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపి మక్తల్ మండల తహసీల్దార్ సతీష్ కుమార్ కి వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షుడు రవీందర్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొనసాగతున్న సిపిఎస్ విధానాన్ని తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కూడా ఆగష్టు 23. 2014 వ రోజు తెలంగాణ ప్రభుత్వం జీవో నెంబర్ 28 తీసుకొచ్చి అదేవిధానాన్ని అమలుపరుస్తుంది. ఇప్పుడు ఉన్నటువంటి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో సిపిఎస్ విధానం రద్దు చేస్తామని హామీ ఇచ్చి 20 నెలలైనా కూడా కాలయాపన చేస్తుండడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులకు చాలా నష్టం జరుగుతుందని ఉద్యోగ భద్రత లేకుండా పోతుందని, కావున వెంటనే సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు.

# ఇబ్బందుల్లేకుండా యూరియా పంపిణీ చేయాలి

### జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి




**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్:** జిల్లాకు వచ్చిన యూరియాను అవసరం ఉన్న రైతులకే పంపిణీ చేయాలని, యూరియా పంపిణీని వ్యవసాయ అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం విసి. కాన్ఫరెన్స్ హాల్ సమావేశ మందిరం నుండి యూరియా పంపిణీపై మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో మండలాల వారీగా కలెక్టర్ సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మండలలా వారీగా రైతులకు ఎంత యూరియా పంపిణీ చేశారు. స్టాక్ ఎంత లభ్యత ఉంది. ఆగస్టు నెల చివరి వరకు ఎంత అవసరం ఉంది. తదితర విషయాలు సమీక్షించారు. జిల్లాకు వచ్చిన యూరియాను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ప్రైవేట్ డీలర్‌లకు కేటాయించడం జరుగుతుందని, యూరియా సక్రమ పంపిణీకి రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో పంపిణీ చేయాలని, యూరియా పంపిణీలో ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోకూడదని, ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. ప్రతి రైతుకు 2 బస్తాలు యూరియా సరఫరా చేయాలని సూచించారు. యూరియా ఎప్పటికప్పుడు వచ్చిన స్టాక్ ను పి.ఏ.సి.ఎస్.లకు కేటాయించడం జరుగుతుందని. రైతులు అందోళన పడి ఎక్కువ మొత్తం కొని దాచుకోవద్దని, అవసరం మేరకు మాత్రమే పంటక వినియోగించాలన్నారు. యూరియా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు వచ్చిన తర్వాత సంబంధిత వ్యవసాయ సహాయ సంచాలకులు వ్యవసాయ అధికారులు అవసరం ఉన్న మేరకు రైతులకు ఇవ్వాలని కలెక్టర్ చెప్పారు. యూరియా సక్రమ సరఫరాలో భాగంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, ముఖ్యంగా యూరియా ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు నానో యూరియా ప్రయోజనాలు, వినియోగంపై వ్యవపాయ అధికారులు అవగాహన కలిగించాలని ఆదేశించారు. జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్ ఇప్పటివరకు జిల్లాకు వచ్చిన యూరియా, అవసరమన్న యూరియా, తదితర వివరాలను తెలియజేశారు. సూచించారు. ఈ సమావేశం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌చ రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్, జడ్.పి.సి.ఈ ఓ వెంకటరెడ్డి, జిల్లా సహకార అధికారి శంకరాచారి, ఆర్.డి.ఓ నవీన్, జిల్లా సహకార ఆడిట్ అధికారి టైటస్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

# యూరియాపై ప్రజల్ని రెచ్చగొడుతున్న మాజీ మంత్రి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** యూరియాపై అవగాహన లేకుండా ప్రజల్ని రెచ్చగొట్టేలా మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి ఫైర్ అయ్యారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూరియా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరి మూలంగానే సమస్య తలెత్తిందని మాట్లాడడం దుర్మార్గం అని అన్నారు. పదేళ్లు ప్రజాప్రతినిధిగా కొనసాగి అందులో ఐదేండ్లు మంత్రిగా ఉన్నా బాధ్యత రహితంగా మాట్లాడడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు. రిక్షా కార్మికులు మూర్చరోగంతో కింద పడిపోతే రైతే యూరియా కోసం సొమ్మసిల్లి పడిపోయారని అంటూ హడావిడిగా ఆసుపత్రిలో జైన్ చేయడం లాంటి డ్రామాలు మానుకోవాలని సురేందర్‌రెడ్డి హితవు చెప్పారు. యూరియా కోసం రైతులు చెప్పులు లైన్లో ఉండేవి కావని, గత బిఆర్‌ఎస్ ప్ర భుత్వం రైతులకు ఎంతగానో సహకరించిందని గొప్పలు చెప్పుకోనే మంత్రి బిఆర్‌ఎస్‌ను యూరి యా కోసం దుమ్మెత్తిపోసిన వీడియోను విలేకరు ల సమావేశంలో చూపించారు. రామగుండం ఎ రువుల కార్మాగారం నుండి యూరియా రావాల్సి ఉండగా ఇటీవల వర్షాల కారణంగా రైల్వే మార్గం దెబ్బతిన్న విషయం కూడా మరిచి ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడడం మానుకోవాలని అన్నారు. ప్రజలకు అవసరమైన యూరియాను అందించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్దంగా ఉందని ఆయన తెలిపారు. ఏదో రకంగా కాంగ్రెస్ పార్టీని బదలం చేయడానికి మాజీ మంత్రి శ్రీనివా స్ గౌడ్ దొంగనాటకాలు ఆడుతున్నారని అన్నా రు. గత ప్రభుత్వంలో రైతులు ఇబ్బందులు పడిన విషయం మరిచి ప్రజా ప్రభుత్వంపై నిందలు వేయడం ఇప్పటికైనా మానుకోవాలని మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లునర్సింహ్మారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, మర్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, మీడియా సెల్ ఇంచార్జి బెనహర్, మధుసూదన్‌రెడి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిగ్రామంలో అన్నిరకాల సౌకర్యాలు

**ప్రజాపక్షం/బిజినేపల్లి :** ఇందిరమ్మ రాజ్యంలోనే పేదలు కాస్తగూడు కట్టుకున్నారని, మరోసారి ఇందిరమ్మరాజ్యం వచ్చిన తర్వాతనే పేదల సొంతింటికల సాధ్యమైందని రాబోయేరోజుల్లో ప్రతిపేదవారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. మండలపరిధిలోని వెల్గొండగ్రామంలో శనివారం పనుల జాతరకార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో వివిధ అభివృద్ధిపనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవం నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ప్రభుత్వం ఏర్పడిన20 నెలలకే గ్రామంలో వెల్గొండ గ్రామానికి రూ.8కోట్ల60లక్షల రూపాయల అభివృద్ధిపనులకు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తుండటంతో కాంగ్రెస్‌పార్టీకి మంచిపేరు వస్తుందనే అక్కసుతో బిఆర్‌ఎస్, బిజెపిపార్టీలు కాంగ్రెస్‌ను అభాసుపాలు చేయాలనే సంకల్పంతో కేంద్రప్రభుత్వం యూరియా సరఫరాలో జాప్యంచేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. త్వరలోనే యూరియా కొరతను అధిగమిస్తామన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీ బలపర్చిన అభ్యర్థులను గ్రామస్తులు గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటి చైర్మన్ రమణరావు, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు మిద్దెసింగిల్‌వి ఒడో మాజీ అధ్యక్షులు వెంకటస్వామి, మాజీడైరెక్టర్ వెంకటస్వామి, రాములు, అమృత్‌రెడ్డి, మాజీసర్పంచ్ దేవరకొండ రామచందర్, వెంకటస్వామి, వెల్గొండ గ్రామమాజీ ఉపసర్పంచ్ నగేష్ తదితరులు పాధ్యక్షులు ముక్తార్, మైనార్టీ నాయకులు కిజర్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఎరువుల దుకాణాల్లో కలెక్టర్ తనిఖీ



**ప్రజాపక్షం/అచ్చంపేట :** ఎరువుల దుకాణాలపై శనివారం అచ్చంపేటపరిధిలోని ఉప్పునుంతలలో జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా కలెక్టర్ స్థానిక ఆగ్రోరైతుసేవాకేంద్రాన్ని పరిశీలించారు. దుకాణంలోని సరుకులు, రిజిస్టర్‌లు పరిశీలించారు. అనంతరం రైతులతోమాట్లాడుతూ ఎరువుల విక్రయాలపై ఏదేని అనుమానంవస్తే సంబంధిత వ్యవసాయశాఖ అధికారితోపాటు తమకు ఫిర్యాదుచేయాలని ఆయన తెలిపారు. రసాయన ఎరువులు తగుమోతాదులో వాడాలని సూచించారు. యూరియాస్టాక్‌ను పరిశీలించి యూరియా పంపిణీలో ఎటువంటిలోపాలను సహించబోమని హెచ్చరించారు. రసాయన ఎరువులువాడితో పంటలు అనర్థమవుతాయని తెలిపారు. రైతులు షాపులో తాముతీసుకున్న పురుగులమందులకు రశీదులు తీసుకొని జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. యూరియా అక్రమరవాణకాకుండా స్థానికులు పరిశీలించాలని ఆయన తెలిపారు.

### ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలు విశ్వసించాలి

ప్రభుత్వం ప్రజలకోసం ఏర్పాటుచేసిన ప్రభుత్వ ఆస్పత్రులను వినియోగించుకోవాలని కలెక్టర్ బదావత్‌సంతోష్ అన్నారు. ఆయన శనివారం అచ్చంపేటపరిధిలోని ఉప్పునుంతల మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా కలెక్టర్ ఆస్పత్రిరోగులకు అందుతున్న వైద్యసేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. వార్డు ఔషదనిల్వలు, వార్డుల పరిశుభ్రతను పరిశీలించారు. ఆరోగ్యకేంద్రసిబ్బంది హాజరుచూడటంతోపాటు విధులకు సమయానికి రావాలన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలపై ప్రజలకు నమ్మకం పెరిగేలా వైద్యులు సమయపాలన పాటించడంతోపాటు వైద్యసేవలు అందించాలని కలెక్టర్ సూచించారు.

## మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ తనిఖీ



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ బాయ్స్ స్కూల్‌ను జిల్లా మైనారిటీ అధికారి ఎంఏ. రషీద్ విజలెన్స్ అధికారులు జమీర్ కాన్ ఎంఏ మసూద్ లతో కలిసి రెసిడెన్షియల్ స్కూల్ తనిఖీ చేయడం జరిగింది. కిచెన్ స్టోర్ లోని ఆహార పదార్థాల సామాగ్రిని స్టాక్ రిజిస్టర్లు ఫుడ్ క్వాలిటీ రిజిస్టర్లు, స్టూడెంట్ అటెండెన్స్ రిజిస్టర్లు, కిచెన్ రూమ్, డైనింగ్ హాల్ డార్మెటరీ, క్లాస్ రూమ్స్, టాయిలెట్స్, స్టాఫ్ రిజిస్టర్లను పరిసరాలను పరిశీలించడం జరిగింది. అల్పాహార సమయంలో విద్యార్థులతో పాటు కూర్చోని అల్పాహారాన్ని భుజించడం జరిగింది. ఫుడ్ కమిటీ విద్యార్థులతో ఆహార నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. ఇదే విధంగా ఆహార నాణ్యత కొనసాగించాలని ప్రిన్సిపాల్ ఖాజా మెహబూబ్, వార్డెన్ లకు విజిలెన్స్ అధికారులు సలహా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు జమీన్ ఖాన్, ఎంఏ మాసూద్ తో తనకి నిర్వహించడం జరిగింది.

## శాంతియుత వాతావరణంలో గణేష్ నిమజ్జనం, మిలాద్-ఉన్-నబీ వేడుకలు

### జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పి డి.జానకి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** శాంతియుత, ప్రశాంత వాతావరణంలో వినాయక చతుర్థి, నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి కోరారు. వినాయక చతుర్థి గణేష్ నిమజ్జనం, మిలాద్‌ఉన్‌నబీ వేడుకలను పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయా సముదాయంలోని (కలెక్టరేట్) కాన్ఫరెన్సు హాల్‌లో శనివారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ విజయేందిర బోయి ఎస్‌పి డి.జానకి అధికారులకు కీలక సూచనలు చేశారు. మిలాద్‌ఉన్‌నబీ గణేష్ ఉత్సవాల సందర్భంగా చేపట్టాల్సిన చర్యలు అందుబాటులోకి తేవాల్సిన సదుపాయాల గురించి గణేష్ ఉత్సవ కమిటీ శాంతి కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు, మండపాల నిర్వాహకులు పలు ప్రతిపాదనలు చేస్తూ తమ అభిప్రాయాలను వెల్లడించారు. శాంతియుత వాతావరణంలో భక్తి శ్రద్ధలతో మతసామరస్యానికి ప్రతీకగా వేడుకలు జరిగేలా తోడ్పాటును అందిస్తామని అన్నారు. కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని, రోడ్ల మరమ్మత్తులు , శోభాయాత్ర నిర్వహించే వంటి పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లాలో సహృద్భావ వాతావరణంలో ఈ వేడుకలు జరుగుతాయని ఈసారి కూడా అదే స్ఫూర్తిని ప్రదర్శిస్తూ మత సామరస్యంతో గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలని, జిల్లా ప్రతిష్టను పెంపోందించాలని అన్నారు. ఈనెల 27న వినాయక చతుర్థి, సెప్టెంబర్ 5న నిమజ్జన వేడుకలు, నెలవంకను అనుసరించి సెప్టెంబరు 5 లేదా 6వ తేదిన నిర్వహించే మిలాద్‌ఉన్‌నబీ వేడుక వెంటవెంటనే వస్తున్నందున భద్రతాపరమైన చర్యలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. నిమజ్జనం చేయు ప్రాంతాల వద్ద రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు విధులు నిర్వహించి నిమజ్జన ప్రాంతాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆర్‌అండ్‌బి అధికారులు క్రేన్ ఏర్పాటు చేయాలని సూచించారు. మండపాల నిర్వాహకులు మండపాల వద్ద తడి, పొడి చెత్త సేకరణకు డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. డి.జానకి మాట్లాడుతూ మండపాల నిర్వాహకులు పోలీస్ పోర్టల్ లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. పోలీసు శాఖ తరపున తగిన బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏనుగు నరసింహరెడ్డి, అదనపు ఎస్పీ రత్నం, డిపిఓ పార్థసారథి, ఆర్‌డిఓ నవీన్, డిఎస్పి వెంకటేశ్వర్లు, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి శంకరాచారి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లపై బురదతో ప్రజలకు ఇబ్బందులు



**ప్రజాపక్షం/ఎర్రవల్లి :** జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలోని ధర్మవరం గ్రామంలో రోడ్లపై బురదను తొలగించకపోవడంతో ప్రజలకు ఇబ్బందిగా మారిందని ప్రజలు తెలిపారు. అంతేగాక ఇటీవల వర్షాలు పడడంతో రోడ్లపై నీళ్ల పోవడం వల్ల బురదమయంగా ఉండడం వలన ప్రజలు రోడ్లపై తిరగడానికి ఇబ్బందులు పడుతూ పోవాల్సి వస్తుందని గ్రామ ప్రజలు తెలియజేశారు. గ్రామ ప్రజలు పూడుక పోయిన డ్రైనేజీ కాలువలు మట్టిని తీయించి రోడ్డు పై నీళ్లను వెళ్లేలా చూడాలని గ్రామ ప్రజలు అన్నారు.

# కమ్యూనిస్టు దిగ్గజం సురవరం మృతి భారత విప్లవోద్యమానికి తీరని నష్టం



**ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల:** సిపిఐ అగ్రనేత పోరాట యోధుడు సురవరం సుధాకర్ రెడ్డి మృతికి జోగులాంబ గద్వాల జిల్లాలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన చిత్ర పటానికి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి ఆంజనేయులు మాట్లాడుతూ సురవరం సుధాకర్ రెడ్డి ఈరోజు మన మధ్యలో లేకపోవడం చాలా బాధాకరం అన్నారు. నేటి కమ్యూనిస్టులుగా ఆయన మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నామన్నారు. ఈయన భారత కమ్యూనిస్టు పార్టీ జనరల్ సెక్రటరీ జాతీయ కార్యదర్శిగా పనిచేయడం జరిగిందన్నారు. కర్షకుల కార్మికుల, పీడిత ప్రజల బాగుకోసం కోసం ఎన్నో పోరాటాలు ఉద్యమాలు ఉధృతంగా చేసి తన జీవితాన్ని కూడ త్యాగం చేసిన ఘనత సురవరం సుధాకర్ రెడ్డిది అన్నారు.

### మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో..



కమ్యూనిస్టు దిగ్గజం, సిపిఐ అగ్రనేత, మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి మాజీ పార్లమెంటు సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి మరణం భారత విప్లవోద్యమానికి తీరని నష్టదాయకమని సిపిఐ సీనియర్ నాయకులు ఎం.నరేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ని సురవరం వెంకట్రామిరెడ్డి భవన్‌లో సిపిఐ శ్రేణులు సిపి ఐ అగ్రనేత, మార్క్సిజ అపర మేధావి దివంగత సురవ రం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎం. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ సురవరం సుధాకర్ రెడ్డి గొప్ప రాజకీయ పరిస్థితులను సవాళ్లను 20 సంవత్సరాల ముందే వాటి ప్రమాదాలు పర్యవసనాలను పసిగట్టి పార్టీ శ్రేణులను సమరశీల పోరాటాల వైపు నడుపుతూ భారత విప్లవోద్యమాన్ని ఉరకలు పెట్టించారన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ మాట్లాడుతూ సురవరం సుధాకర్ రెడ్డి అంతిమయాత్రలో మహబూబ్‌నగర్ జిల్లా పార్టీ శ్రేణులు కార్యకర్తలు ప్రజాసంఘాల కార్యకర్తలు, ప్రజ లు అధిక సంఖ్యలో తరలి వెళ్లేందుకు సిద్ధమవుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కోశాధికారి సత్యనారాయణ రెడ్డి, సిపిఐ మాజీ జిల్లా కా ర్యదర్శి బి.పరమేశ్వర్ గౌడ్, ఉమ్మడి జిల్లా సిపిఐ మాజీ జిల్లా కార్యవర్గ సభ్యులు గడ్డపార నరేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సురేష్, తదితరులు పాల్గొన్నారు.

### నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో..



కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి అనారోగ్యంతో మరణించడం వామపక్ష ఉద్యమానికి, ప్రజాతంత్ర ఉద్యమానికి తీరనిలోటని నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని డాక్టర్‌బిఆర్ అంబేద్కర్ విగ్రహంవద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐరాష్ట్ర కమిటి సభ్యులు కేశవులుగౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు సూర్యశంకర్‌గౌడ్, రవీందర్, నాగర్‌కర్నూల్ పట్టణ కార్యదర్శి గోపిచారి, నాయకులు రామస్వామి, కొత్రశేఖర్, ఖాజ పాల్గొన్నారు.

**తాడూరులో :** తాడూరు మండలకేంద్రంలో సిపిఐజిల్లా కార్యవర్గసభ్యులు కొమ్ముభరత్ సురవరం చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఎండి.కుబుద్దీన్, సిపిఐ నాయకులు రాము, ఎల్లయ్య, కొమ్ముబంగారయ్య, రాచూరిరాముడు, శివయ్య, శ్రీశైలం, జక్కయ్య, కొమ్ము బన్ని, అనిల్, ఆంజనేయులు పాల్గొన్నారు.

**బిజినేపల్లిలో :** మండలకేంద్రంలోని అంబేద్కర్‌చౌరస్తాదగ్గర శనివారం సిపిఐమాజీ జాతీయ ప్రధానకార్యదర్శి, మాజీ ఎంపి సురవరంసుధాకర్‌రెడ్డి చిత్రపటానికి ఘనంగా నివాళి ఆర్పించారు. మండలపార్టీ కార్యవర్గ సభ్యులు ఈర్లచంద్రమౌళి, మండలకార్యదర్శి పి.కృష్ణాజి, మండల సహాయకార్యదర్శి భూపేష్, మధుగౌడ్, సిపిఐ సీనియర్ నాయకులు వేములశ్రీను, మండల మాజీసెక్రటరీ మంగంపేట శ్రీను పాల్గొన్నారు.

**ఊర్కొండలో :** సురవరం సుధాకర్‌రెడ్డి మరణం దేశానికి తీరనిలోటని ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని పోరాటాలు కొనసాగిస్తామని సిపిఐ కల్వకుర్తి నియోజకవర్గ సహాయ కార్యదర్శి , ఊర్కొండ మండల కార్యదర్శి దారదాసు అన్నారు.

### జడ్చర్ల పట్టణలో...

జడ్చర్ల పట్టణం నేతాజీ చౌరస్తాలో సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి ఘననివాళి అర్పించిన సిపిఐ పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు భాగి కృష్ణయ్య, జడ్చర్ల మండల నాయకులు ఖలీమ్ , మన్సూర్ రేమతుల్లా, అబ్దుల్, మజీద్, బైరంపల్లి వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

### అచ్చంపేటలో



సిపిఐనేత సురవరం సుధాకర్‌రెడ్డి మృతికి అచ్చంపేట శాఖ ఘనంగా నివాళిఅర్పించింది. ఈసందర్భంగా సిపిఐస్థూపంవద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమం అచ్చంపేట నియోజకవర్గపు కార్యదర్శి పెరుములగోపాల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సిపిఐ నాయకులు కర్నెయ్య తదితరులు పాల్గొన్నారు.

### మద్దూరు మండల కేంద్రంలో ..

**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) అగ్రనేత ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ ఎంపీ కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి సిపిఐ మద్దూరు కార్యదర్శి ఎస్.వెంకటేష్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. సంతోష్ మద్దూరు మండల కేంద్రంలో ఘన నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి చెన్నప్ప, మద్దూరు మండల సహాయ కార్యదర్శి వెంకటయ్య, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# క్రీడ

## వరల్డ్ కప్ లక్ష్యంగా వైజాగ్ క్యాంప్..



భారత 'ఏ' జట్టుతో రెండు డే-నైట్ మ్యాచ్‌లు!

సొంతగడ్డపై జరుగబోయే వన్డే వరల్డ్ కప్‌లో భారత మహిళల జట్టు ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది. స్థానిక పరిస్థితులను సొమ్ము చేసుకొని ఛాంపియన్లుగా నిలవాలని హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం గట్టిగానే అనుకుంటోంది. అనుకోవడమే కాదు.. ఈ మెగా టోర్నీ సన్నద్ధతను మరో రెండు రోజుల్లో ప్రారంభించనుంది. హర్మన్‌ప్రీత్ నేతృత్వంలో స్క్వాడ్‌లోని సభ్యులు విశాఖపట్టణంలోని శిక్షణ శిబిరంలో రాటుదేలనున్నారు. ఆస్ట్రేలియాతో సిరీస్‌కు ముందు వారం రోజుల పాటు జరిగే ఈ ట్రైనింగ్ క్యాంప్‌లో తమ మెలకువలకు మెరుగులు దిద్దుకోనున్నారు.

వరల్డ్ కప్‌లో వైజాగ్ వేదికగా టీమిండియా రెండు కీలక మ్యాచ్‌లు ఆడనుంది. వీటిలో ఒకటి దక్షిణాఫ్రికాతో అక్టోబర్ 9న, రెండోది ఆస్ట్రేలియాతో అక్టోబర్ 12న. లీగ్ దశలో ఈ రెండింటా విజయం సాధిస్తే భారత్ ముందంజ వేసే అవకాశముంది. అందుకే వైజాగ్ స్టేడియం పిచ్, వాతావరణం మీద అవగాహనకు ఈ శిక్షణ శిబిరం ఉపయోగపడుతుంది. అయితే.. వరల్డ్ కప్ స్క్వాడ్‌లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన, ఆల్‌రౌండర్ స్నేహ్ రానా.. ఈ ముగ్గురికి మాత్రమే గతంలో(2014లో) ఈ మైదానంలో ఆడిన అనుభవం ఉంది. కాబట్టి.. మిగతావాళ్లకు ఇక్కడి పరిస్థితులు అర్థమయ్యేలా వారం రోజులు ఈ ట్రైనింగ్ క్యాంప్ నిర్వహిస్తోంది బీసీసీఐ. వరల్డ్ కప్ స్క్వాడ్‌తో, భారత ఏ జట్టు రెండు డే – నైట్ వామప్ మ్యాచ్‌లు ఆడనుంది. అనంతరం సెప్టెంబర్ 16 నుంచి ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ కోసం టీమిండియా ఛండీగఢ్ వెళ్లనుంది. ఈ సిరీస్ ముగిశాక.. వరల్డ్ కప్ వామప్ మ్యాచ్‌లకు బెంగళూరుకు రానుంది హర్మన్‌ప్రీత్ సేన. సెప్టెంబర్ 25న ఇంగ్లండ్‌తో, సెప్టెంబర్ 27న న్యూజిలాండ్‌తో భారత జట్టు తలపడుతుంది. ఆపై సెప్టెంబర్ 30న గువాహటిలో జరగనున్న వరల్డ్ కప్ ఆరంభ పోరులో శ్రీలంకను ఢీకొట్టనుంది.

**వరల్డ్ కప్ స్క్వాడ్ :**

హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), స్మృతి మంధాన(వైస్ కెప్టెన్), ప్రతీకా రావల్, హర్లీన్ డియోల్, జెమీమా రోడ్రిగ్స్, రీచా ఘోష్(వికెట్ కీపర్), యస్తికా భాటియా(వికెట్ కీపర్), దీప్తి శర్మ, స్నేహ్ రానా, అమన్‌జోత్ కౌర్, రాధా యాదవ్, శ్రీ చరణి, క్రాంతి గౌడ్ అరుంధతి రెడ్డి, రేణుకా సింగ్ ఠాకూర్.

**స్టాండ్ బై :** తేజల్ హసన్బిస్, ప్రేమా రావల్, ప్రియా మిశ్రా, ఉమా ఛెత్రీ, మిన్ను మణి, సయాలీ సథ్ఘారే.

## అనారోగ్యంతో కెప్టెన్సీకి దూరమైన గిల్..



టెస్టు సారథిగా తొలి సిరీస్‌లోనే తన ముద్ర వేసిన శుభ్‌మన్ గిల్ బ్యాటర్‌గానూ గొప్పగా రాణించాడు. ఐదు టెస్టుల సిరీస్‌లో ఇంగ్లాండ్ ఆటగాళ్లకు కౌంటర్ ఇవ్వడంతో పాటు.. తన కూల్ కెప్టెన్సీతో తగిన నాయకుడు దొరికాడనే ప్రశంసలు అందుకున్నాడు. అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీలో సూపర్ ఫామ్‌తో చెలరేగిన గిల్ దేశవాళీ క్రికెట్‌లో దంచేస్తాడని అనుకున్నారంతా. దులీప్ ట్రోఫీలో కెప్టెన్‌గా తమ జట్టును టీమిండియా ప్రిన్స్ అలవోకగా గెలిపిస్తాడనుకుంది నార్త్ జోన్. కానీ. ఈ స్టార్ ప్లేయర్ అనారోగ్యం కారణంగా ఈ టోర్నీకి దూరమయ్యాడు. దేశవాళీ క్రికెట్ 2025–26 సీజన్‌లో మొదటిదైన దులీప్ ట్రోఫీ ఆగస్టు 28న మొదలవ్వనుంది. జోన్ల ఫార్మాట్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో నార్త్ జోన్ జట్టు శుభ్‌మన్ గిల్‌పై ఎన్నో ఆశలు పెట్టుకుంది. ఇంగ్లండ్‌లో ఇరగదీసిన అతడికి కెప్టెన్సీ కట్టబెట్టి.. పటిష్టమైన స్క్వాడ్‌ను ఎంపిక చేసింది. కానీ, తీరా టోర్నీకి ఐదు రోజుల ముందు గిల్ అనారోగ్యానికి గురయ్యాడు. ఫిజియోథెరపిస్ట్‌లు అతడిని పరీక్షించి కొన్ని రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. దాంతో.. సెప్టెంబర్ 30 నుంచి ప్రారంభం కానున్న ఆసియా కప్(2025)లోపు కోలుకొని, ఫిట్‌నెస్ సాధించాలనుకుంటున్నాడు భారత సారథి. ప్రస్తుతం ఛండీగఢ్‌లోని తన ఇంట్లో సేద తీరుతున్న గిల్ తన ఆరోగ్యం మెరుగయ్యాక నెట్స్‌లో ప్రాక్టీస్ షురూ చేయనున్నాడు. దులీప్ ట్రోఫీకి శుభ్‌మన్ గిల్ దూరమైనందున వైస్ కెప్టెన్‌గా ఎంపికైన అంకిత్ కుమార్ నార్త్ జోన్ జట్టును నడిపించే అవకాశముంది. ఆసియా కప్ స్క్వాడ్‌లోని పేసర్లు అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రానాలు కూడా ఒకే ఒక మ్యాచ్ ఆడనున్నారు. యూఏఈకి వెళ్లడానికి ముందు ఇద్దరూ ఈస్ట్ జోన్‌తో మ్యాచ్‌లో బరిలోకి దిగుతారు.

**నార్త్ జోన్ స్క్వాడ్ :** శుభ్‌మన్ గిల్(కెప్టెన్), శుభం ఖజురియా, అంకిత్ కుమార్ (వైస్ కెప్టెన్), ఆయుష్ బదొని, యశ్ దయాల్, అంకిత్ కల్సి, నిశాంత్ సింధు, సాహిల్ లోత్రా, మయాంక్ దగర్, యధ్‌వీర్ సింగ్, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రానా, అన్షుల్ కంభోజ్, అఖీబ్ నబీ, కన్హయ్య వధావన్ (వికెట్ కీపర్).

**రీప్లేస్‌మెంట్స్ :** ఒకవేళ గిల్, అర్ష్‌దీప్, హర్షిత్‌లు ఆసియాకప్ స్క్వాడ్‌కు ఎంపికైతే వీళ్ల స్థానాన్ని భర్తీ చేసేందుకు ముగ్గురిని ఎంపిక చేశారు సెలెక్టర్లు. శుభం రోహిల్లా (గిల్), గుర్నూర్ (అర్ష్‌దీప్ సింగ్), అనుజ్ థక్రాల్ (హర్షిత్ రానా).

## సఫారీల సైన్యంలో మిల్లర్, మహరాజ్!



ఆస్ట్రేలియాపై వన్డే సిరీస్ కైవసం చేసుకున్న దక్షిణాఫ్రికా మరో విదేశీ పర్యటనకు సిద్ధమవుతోంది. ఆసీస్‌ను వాళ్ల సొంతగడ్డపై మట్టికరిపించిన సఫారీ సైన్యం ఈసారి ఇంగ్లాండ్‌ను ఢీకొననుంది. సెప్టెంబర్‌లో అక్కడ మూడు వన్డేలు, మూడు టీ20ల సిరీస్ ఆడనుంది ప్రొటీస్ టీమ్. దాంతో.. సెలెక్టర్లు రెండు ఫార్మాట్లకు పటిష్టమైన స్క్వాడ్‌ను ఎంపిక చేశారు. వన్డేలకు తెంబ బవుమా, పొట్టి జట్టుకు ఎడెన్ మర్క్‌రమ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. నిరుడు పొట్టి ప్రపంచ కప్ తర్వాత టీ20లకు దూరమైన పలువురిని స్క్వాడ్‌లోకి తీసుకున్నారు సెలెక్టర్లు. ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో ఐదు వికెట్లతో చెలరేగిన కేశవ్ మహరాజ్ పొట్టి స్క్వాడ్‌కు ఎంపికయ్యాడు. డేంజరస్ హిట్టర్ డేవిడ్ మిల్లర్ సైతం టీ20 సిరీస్ బృందంలో చోటు దక్కించుకున్నాడు.

# షోకేస్




## 'గేమింగ్' వ్యాపారానికి డ్రీమ్11 గుడ్‌బై

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ బిల్లు పార్లమెంటు ఉభయ సభల్లో ఆమోదం పొందిన తర్వాత, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కూడా అధికారికంగా ముద్ర వేయడంతో చట్టరూపంలోకి వచ్చింది. దీనితో పలు ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలు దిక్కుతోచని పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. డ్రీమ్ స్పోర్ట్స్ సంస్థ ఆధర్యంలో నడుస్తున్న డ్రీమ్ 11 ఆన్‌లైన్ గేమింగ్ వ్యాపారానికి తెరపడింది. తాజా వ్యాపార వ్యూహంలో భాగంగా డ్రీమ్ స్పోర్ట్స్ ఈ నిర్ణయం తీసుకుంది. ఫాంటసీ గేమింగ్ రంగంలో ఆధిపత్యం చెలాయించిన ఈ సంస్థ, ఇప్పుడు ఆర్థిక సేవల విభాగంలో అడుగుపెడుతున్నది. 'డ్రీమ్ మనీ' అనే కొత్త వ్యక్తిగత ఫైనాన్స్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ యాప్ ద్వారా వినియోగదారులు బంగారం, ఫిక్స్‌డ డిపాజిట్లు (ఎఫ్‌డి), సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్లు (ఎస్ఐపి) వంటి పెట్టుబడి అవకాశాలను ఉపయోగించుకోవచ్చు. అలాగే రోజువారీ ఖర్చులను సులభంగా ట్రాక్ చేసే సౌకర్యం కూడా కల్పించనుంది. ఈ డ్రీమ్ మనీ యాప్, పెట్టుబడులను మరింత సులభతరం చేయడానికి అనేక కొత్త సౌకర్యాలను అందిస్తోంది. వినియోగదారులు రోజుకు లేదా నెలకు కేవలం రూ.10 నుండి ఎస్ఐపిలు ప్రారంభించవచ్చు. బంగారం పెట్టుబడుల కోసం, డ్రీమ్ స్పోర్ట్స్ ఆగ్‌మాంట్ డిజిటల్ గోల్డ్ ట్రేడింగ్ ప్లాట్‌ఫాంతో ఒప్పందం కుదుర్చుకుంది. అంతేకాక, బ్యాంకు ఖాతా అవసరం లేకుండా రూ.1,000 నుండి ఫిక్స్‌డ్ డిపాజిట్స్‌లో పెట్టుబడి పెట్టవచ్చు. ఈ ఎఫ్‌డిలలో పెట్టిన డబ్బును ఎప్పుడైనా ఉపసంహరించుకునే అవకాశం ఉండటం వినియోగదారులకు మరింత సౌలభ్యం కలిగిస్తుంది. మొత్తం మీద కొత్త చట్టంతో ఆన్‌లైన్ గేమింగ్ సంస్థలు ఇతర వ్యాపారాలపైకి దృష్టి మళ్లిస్తున్నాయి. అందుకు డ్రీమ్ 11 గొప్ప ఉదాహరణ.

## స్వల్పంగా పెరిగిన పసిడి ధర





బులియన్ మార్కెట్‌లో బంగారం ధర శనివారం స్వల్పంగా పెరిగింది. 24 క్యారెట్ల గ్రాము బంగారం ధర, రూ.109 పెరిగి, రూ.10,162కు చేరింది. అదే విధంగా 22క్యారెట్ల గ్రాము బంగారం ధర రూ.100 పెరగడంతో, రూ.9,315 వద్ద ముగిసింది. ఈ వారం బులియన్ మార్కెట్ స్వల్ప పెరుగుదల, తగ్గుదలలను చవి చూసింది. మొత్తం మీద ఈనెల 18వ తేదీ సోమవారం నుంచి 23వ తేదీ శనివారం వరకు, 24 క్యారెట్ల గ్రాము బంగారం ధర రూ.44,22 క్యారెట్ల గ్రాము బంగారం ధర రూ.40 చొప్పున పెరిగాయి. ఇలావుంటే, హైదరాబాద్‌లో శనివారం జాతీయ రేట్లలోనే ట్రేడింగ్ జరిగింది. 18 క్యారెట్ల బంగారం గ్రాము ధర రూ. 7,621గా ఉంది.

## స్టాక్ మార్కెట్‌ను కుదిపేసిన 'ఆన్‌లైన్ గేమింగ్'బిల్లు




కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ బిల్లు (2025) స్టాక్ మార్కెట్‌ను కుదిపేసింది. ఈ బిల్లుకు ఈనెల 22వ తేదీ శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలపడంతో, చట్టం రూపాన్ని సంతరించుకుంది. అయితే, రాష్ట్రపతి ఆమోదానికి ముందే, ఈవారం స్టాక్ మార్కెట్లలో లావాదేవీల చివరి రోజు, పలు కంపెనీల షేర్లు కుప్పకూలాయి. దేశంలో భారీ లాభాలు ఆర్జిస్తున్న ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలు భయాందోళనకు గురికావడంతో, వివిధ కంపెనీల షేర్ల పతనం కొనసాగింది. ఈనెల 20వ తేదీ, బుధవారం గేమింగ్ స్టాక్ చివరి ట్రేడింగ్ రోజున 12 శాతానికి పైగా పడిపోయింది. అయితే వారంలోని నాల్గవ ట్రేడింగ్ రోజున, మార్కెట్ ప్రారంభమైన వెంటనే 10 శాతం పడిపోయింది. బ్రోకరేజీలు నజారా షేర్లు కూడా ప్రతికూల వైఖరిని కూడా అవలంభిస్తున్నాయి. దాని రేటింగ్‌ను కూడా పూర్తిగా తగ్గించాయి. ఇక డెల్టా కార్ప్, ఆన్‌మొబైల్ గ్లోబల్ షేర్లు కూడా వరుసగా 2 శాతం, 3 శాతం చొప్పున తగ్గాయి. బుధవారం నజారా టెక్ షేరు 12.88 శాతం పతనంతో ముగిసింది. దాని ధర (నజారా షేరు ధర) రూ.1397 నుండి రూ.1220కి తగ్గింది. గురువారం కూడా షేరు పతనంతో ప్రారంభమైంది. రూ.1178 వద్ద ప్రారంభమైన కొద్దిసేపటికే.. నజారా షేరు ధర అకస్మాత్తుగా రూ.1085 కి పడిపోయింది. ట్రేడింగ్ జరిగిన రోజుల్లోనే, షేరు ధర 22 శాతం తగ్గింది. దీనితో కంపెనీ మార్కెట్ మూలధనం (నజారా మార్కెట్ క్యాప్) కూడా రూ.10210 కోట్లకు తగ్గింది. ఈ ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీ షేర్ల లక్ష్యాన్ని తగ్గించడంతో పాటు దాని రేటింగ్‌ను కూడా తగ్గించింది. ఐసిఐసిఐ సెక్యూరిటీస్ నజారా టెక్ షేర్ల టార్గెట్ ధరను గతంలో ఉన్న రూ.1500 నుండి రూ.1100కి దాదాపు 27 శాతం తగ్గించినట్లు తెలిపింది. బ్రోకరేజ్ ప్రకారం, ఆన్‌లైన్ గేమింగ్ బిల్లును దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆన్‌లైన్ గేమింగ్ చట్టం అమలుతో దేశంలో రియల్ మనీ ఆన్‌లైన్ గేమింగ్ నిలిచిపోయింది. చాలా కంపెనీలు జాబితా చేయబడనప్పటికీ, పోకర్‌బాజీని నిర్వహించే మూన్‌షైన్ టెక్నాలజీలో నజారా టెక్నాలజీస్ పెద్ద వాటాను కలిగి ఉందని ఐసిఐసిఐ సెక్యూరిటీస్ తెలిపింది. నజారా టెక్ షేర్ క్రాష్ ప్రభావం దానితో సంబంధం ఉన్న అన్ని పెద్ద పెట్టుబడిదారులకు శుక్రవారం కూడా భారీ నష్టాలు తప్పలేదు. ఇదిలా ఉంటే గత ఒక సంవత్సరం కాలంగా చిన్న పెట్టుబడిదారులు గేమింగ్ స్టాక్‌లలో తమ వాటాను నిరంతరం తగ్గించుకుంటూ వస్తున్నారు. కాబట్టి, నిషేధానికి ముందు వారు సులభంగానే మార్కెట్ నుండి నిష్క్రమించారు. మొత్తం మీద ఆన్‌లైన్ గేమింగ్‌ని నియంత్రిస్తూ, దానికి సంబంధించిన వ్యాపార ప్రకటనలను నిషేధిస్తూ కేంద్రం చేసిన చట్టం ఇప్పుడు స్టాక్ మార్కెట్లను కుదిపేస్తుంది. ఈ ప్రకంపనలు వచ్చే వారం (ఈనెల 25వ తేదీ, సోమవారం నుంచి మొదలు) స్టాక్ మార్కెట్‌పైన కూడా తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి.

### ఐపిఎల్‌పైనా ప్రభావం



ప్రపంచంలోనే అత్యంత భారీగా ఆదాయాన్ని సమకూర్చుకుంటున్న క్రీడా టోర్నమెంట్ 'ఇండియన్ ప్రీమియర్ లీగ్' (ఐపిఎల్)పైన కూడా ఆన్‌లైన్ గేమింగ్ ప్రకటనలపై నిషేధం ప్రతికూల ప్రభావం చూపుతున్నది. రియల్ మనీ గేమింగ్ (ఆర్ఎంజి) మరియు ఫాంటసీ స్పోర్ట్స్ ప్రకటనలపై నిషేధం వేటు పడడంతో, ఐపిఎల్‌కు వీటి ద్వారా వచ్చే ప్రకటనలు ఉండవు. గేమింగ్ కంపెనీలు ఐపిఎల్‌కు సుమారు రూ.5,000 కోట్లు ప్రకటనల రూపంలో ఇస్తున్నాయి. ఇందులో 40శాతం అంటే సుమారు రూ.2వేల కోట్లు ఆర్ఎంజి, ఫాంటసీ స్పోర్ట్స్ బ్రాండ్‌ల నుండి వచ్చాయి. డ్రీమ్11, మై11సర్కిల్, రియల్ క్రికెట్ వంటి బ్రాండ్‌లు కూడా భారీగానే ప్రకటనలు ఇస్తున్నాయి. ఇప్పుడు నిషేధం కారణంగా ఈ మొత్తం వర్గం ప్రకటనలు ఆగిపోనున్నాయి. ఆర్ఎంజి కంపెనీలు తమ ప్రకటనలలో 80 నుంచి 90శాతం బడ్జెట్‌ను ఐపిఎల్ సీజన్‌లోనే ఖర్చు చేస్తాయి. వీటిలో ఎక్కువ భాగం డిజిటల్ ఖర్చు రూపంలో ఉంటుంది. మెటా, గూగుల్, ప్రోగ్రామాటిక్ అడ్స్, క్రియేటర్ కలాబరేషన్స్, జట్టు స్థాయి బ్రాండింగ్‌లలో ఇది కేంద్రీకృతమై ఉంటుంది. నిపుణుల అంచనా ప్రకారం, ఈ నిషేధం డిజిటల్ స్పేస్‌లోనే దాదాపు

'బిజినెస్' శీర్షికన ఇస్తున్న సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. పెట్టుబడులు లేదా లాభనష్టాలపై 'ప్రజాపక్షం' ఎలాంటి బాధ్యత వహించదు. నిపుణులను సంప్రదించి, మార్కెట్ తీరును సమీక్షించుకొని, వ్యక్తిగత బాధ్యతపై నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నాం.

# రీల్

## మైండ్‌బ్లోయింగ్ టీజర్



తేజ సజ్జ బర్త్‌డే సందర్భంగా మిరాయ్ మూవీ మేకర్స్ ఓ కొత్త పోస్టర్ రిలీజ్ చేశారు. అందులో తేజ సూపర్ యోధ అవతార్‌ని అదిరిపోయేలా చూపించారు. కూలిపోతున్న వంతెన మీద చేతిలో కేవలం ఒక స్టిక్‌తో నిలబడి పోరాడుతున్న తేజ లుక్ అదిరిపోయింది. ఆ పోస్టర్ ఆయన పాత్రలో ఉన్న పట్టుదల, ధైర్యం, మిరాయిలో ఉన్న హై వోల్టేజ్ డ్రామాని రిప్రజెంట్ చేస్తుంది. మిరాయ్ మైండ్‌బ్లోయింగ్ టీజర్ నేషనల్ వైడ్‌గా సెన్సేషన్ హిట్ అయ్యింది. ఫస్ట్ సాంగ్ వైబ్ ఉంది చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది.

## 'త్రిశెంకినీ' టైటిల్ ఆవిష్కరణ




ఎన్.బి.జె.ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మాత ఎన్ బిక్కునాథ్ నాయక్ నిర్మిస్తున్న సినిమా 'త్రిశెంకినీ'. ఈ చిత్రంలో రంజీత్ కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా టైటిల్ లాంఛ్ కార్యక్రమం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ హాస్య నటుడు బాబు మోహన్ అతిథిగా పాల్గొని టైటిల్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నటుడు బాబు మోహన్ మాట్లాడుతూ త్రిశెంకినీ సినిమా టైటిల్ లాంఛ్ చేసుకోవడం సంతోషంగా ఉంది. ఈ సినిమా మంచి విజయం సాధించాలని అన్నారు. నిర్మాత ఎన్. బిక్కునాథ్ నాయక్ మాట్లాడుతూ.. నాకు సినిమాలంటే ప్యాషన్. కృష్ణ అభిమానిని. గతంలో పాటలు కూడా రాశాను. ఓ చిత్ర రూపకల్పనకు ప్లాన్ చేశాం. రంజిత్ తో పరిచయం ఏర్పడింది. త్రిశెంకినీ సినిమా గురించి చెప్పినప్పుడు తప్పకుండా మనం ట్రావెల్ చేద్దామని చెప్పాను. అలా ఈ ప్రాజెక్ట్ సెట్స్ మీదకు వచ్చింది. సస్పెన్స్ థ్రిల్లర్ జానర్‌లో ఓ సరికొత్త మూవీ చేశామని అన్నారు.

## 28న 'డ్యూడ్'లోని బూమ్ బూమ్ పాట రిలీజ్



వరుస విజయాలతో దూసుకుపోతున్న యంగ్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ ప్రస్తుతం మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'ద్యూడలో నటిస్తున్నారు. కీర్తిశ్వరన్ దర్శకత్వంలో ఈ చిత్రం యువతకు నచ్చే ఎంటర్టైనర్‌గా ఉండనుంది. ప్రదీప్‌కు జోడీగా 'ప్రేమలు' ఫేమ్ మమిత బైజూ కథానాయికగా నటిస్తుండగా, సీనియర్ నటుడు శరత్ కుమార్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే రిలీజైన ప్రదీప్ రంగనాథన్, మమిత బైజూకు ఫస్ట్‌లుక్ పోస్టర్స్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. 'ద్యూడ ఫస్ట్ సింగిల్ బూమ్ బూమ్ ఆగస్టు 28న రిలీజ్ కానుంది. సాంగ్ ఎనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో ప్రదీప్ రంగనాథన్, మమిత బైజూ ట్రెండీ అండ్ స్టయిలీష్ లుక్‌లో ఆకట్టుకున్నారు. ఈ చిత్రానికి సాయి అభ్యాంకర్ మ్యూజిక్ అందిస్తుండగా, నికేత్ బొమ్మి సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. లతా నాయుడు ప్రొడక్షన్ డిజైనర్‌గా, భరత్ విక్రమన్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు. దీపావళికి ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషలలో విడుదల కానుంది.

## ఆమె వెరీ స్వీట్ పర్సన్



క్వీన్ అనుష్క లీడ్ రోల్ చేసిన సినిమా ఘాటి. డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో చైతన్య రావు కీలక పాత్ర పోషించారు. సెప్టెంబర్ 5న ఈ సినిమా విడుదల అవుతున్న సందర్భంగా చైతన్య రావు మీడియాతో మాట్లాడారు. ప్రొడ్యూసర్ రాజీవ్ కాల్ చేసి క్రిష్ ని కలవమన్నారు. క్రిష్ కథ చెప్పారు. అద్భుతంగా ఉంది. తర్వాత నా క్యారెక్టర్ గురించి చెప్పారు. అసలు ఆ క్యారెక్టర్‌లో నన్ను ఎలా ఊహించుకున్నారో అర్థం కాలేదు. చాలా సీరియస్ అండ్ వైలెంట్ రోల్. లుక్ కోసం చాలా టైం పట్టింది. దాదాపు రెండు రోజులపాటు రకరకాల లుక్స్ ట్రై చేసాము. ఫైనల్‌గా ఈ లుక్‌ని ఫైనల్ చేసాము.

ఇది రెగ్యులర్ విలన్‌లాగా ఉండదు. డైరెక్టర్ క్రిష్ ఇందులో నేను విలన్‌లాగా చూడట్లేదు. ఒక మెయిన్ క్యారెక్టర్‌లాగే చూస్తున్నాను అని చెప్పారు. ఈ సినిమాలో నాది రోల్ చాలా కీలకంగా ఉంటుంది. గుర్తుండిపోయే క్యారెక్టర్. ఇదొక ఐకానిక్ క్యారెక్టర్ అవుతుందనే నమ్మకం ఉంది. ఇందులో నాకు ఒక మ్యానరిజం ఉంటుంది. ఒక యాక్టర్‌గా నా వైపు నుంచి కొన్ని ఆలోచనలు చెప్పాను. ఈ సినిమాని ఈస్ట్రన్ ఘాట్స్‌లో షూట్ చేసాము. అక్కడ షూట్ చేయడం చాలా చాలెంజింగ్. ఇందులో ఒక జలపాతం సీన్ ఉంది. ఆ సీన్ చేయడం చాలా రిస్కీ. అనుష్క చాలా రిస్క్‌తో ఆ సీక్వెన్స్ చేశారు. అది మీరు చూసినప్పుడు చాలా థ్రిల్ అవుతారు.


క్రిష్ తో వర్క్ చేయాలని అందరికీ ఉంటుంది. నాకు ఈ సినిమాతో అవకాశం రావడం చాలా ఆనందంగా ఉంది.అనుష్క తో వర్క్ చేయడం అంటే ఫస్ట్ నమ్మబుద్ధి కాలేదు. నేను అనుష్కకి చాలా పెద్ద ఫ్యాన్‌ని. చింతకాయల రవి నా ఫేవరెట్ సినిమా. ఆ సినిమాని 30 సార్లు చూసి ఉంటాను. ఆమె బిగ్ లేడీ సూపర్ స్టార్. వెరీ స్వీట్ పర్సన్. అనుష్కతో వర్క్ చేయడం వండర్‌ఫుల్. అనుష్కని లైఫ్‌లో ఒకసారి చూస్తే చాలు అనుకున్నాను. అలాంటిది కలిసి నటించడం అనేది వెరీ మెమొరబుల్. నేను నటించిన మయసభకి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఘాటి ఇప్పుడు రిలీజ్ కాబోతుంది. ఈ రెండు కూడా నా కెరీర్‌లో బిగ్గెస్ట్ పిల్లర్స్ లాంటి ప్రాజెక్ట్స్. డైరెక్టర్ క్రిష్, దేవాకట్ట ఇద్దరూ ఒకటే మాట చెప్పారు. ఈ రెండు ప్రాజెక్ట్స్ బయటకు వచ్చేంతవరకు కొత్త సినిమాల గురించి ఆలోచించవద్దు అన్నారు. ఈ సినిమాల తర్వాత కచ్చితంగా నా కెరీర్ మరో మలుపు తిరుగుతుందని చెప్పారు. వాళ్లు చెప్పింది నిజమౌతుంది. ప్రస్తుతం క్రాంతి మాధవ్‌తో ఒక సినిమా చేస్తున్నాను.

## డియర్ ఐరా పాట రిలీజ్



హీరో నారా రోహిత్ నటిస్తున్న 20వ మూవీ 'సుందరకాండ'. నూతన దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వం వహిస్తున్నారు. సందీప్ పిక్చర్ ప్యాలెస్ బ్యానర్‌పై సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుండి డియర్ ఐరా సాంగ్‌ని రిలీజ్ చేశారు. లియాన్ జేమ్స్ బ్యూటీఫుల్ లవ్ సాంగ్‌గా కంపోజ్ చేశారు. శ్రీ హర్ష ఈమని రాసిన లిరిక్స్ లీడ్ పెయిర్ ఎమోషన్ ని అద్భుతంగా ప్రజెంట్ చేశాయి. లియోన్ జేమ్స్, కీర్తన వైద్యనాథన్ సాంగ్ ను పాడారు. ఆగస్ట్ 27న ఈ సినిమా రిలీజ్ కానుంది. నారా రోహిత్, వృతి వాఘాని, శ్రీ దేవి విజయ్ కుమార్, నరేష్ విజయ కృష్ణ, వాసుకి ఆనంద్, సత్య, అజయ్, వీటీవీ గణేష్, అభినవ్ గోమటం, విశ్వంత్, రూప లక్ష్మి , సునైనా, రఘు బాబు నటిస్తున్నారు.

## 'హైవాన్' షూటింగ్ ప్రారంభం




బాలీవుడ్ అక్షయ్ కుమార్, సైఫ్ అలీఖాన ప్రధాన పాత్రల్లో ప్రియదర్శన్ దర్శకత్వంలో హైవాన్ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. సరికొత్త థ్రిల్లర్ మూవీగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్, తెస్పియన్ ఫిలింస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ కోచిలో ప్రారంభమైంది. ఊటీ, ముంబైలలో ఈ సినిమా చిత్రీకరణ జరుపుకోనుంది. హైవాన్ మూవీతో అక్షయ్ కుమార్, సైఫ్ అలీఖాన్ 17 ఏళ్ల తర్వాత కలిసి నటిస్తున్నారు. ఈ సినిమాలో నటించడం ఆనందంగా ఉందని సోషల్ మీడియా ద్వారా అక్షయ్ కుమార్, సైఫ్ అలీఖాన్ తెలిపారు. హైవాన్ చిత్రాన్ని నిర్మాతలు వెంకట్ కె నారాయణ, శైలజా దేశాయ్ ఫెన్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం ప్రియదర్శన్.

## సెప్టెంబర్ 5న 'లిటిల్ హార్ట్స్' విడుదల




'90s మిడిల్ క్లాస్ బయోపిక్' ఫేమ్ మౌళి తనుజ్, 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' మూవీతో గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ శివానీ నాగరం లీడ్ రోల్స్‌లో నటిస్తున్న మూవీ 'లిటిల్ హార్ట్స్'. ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ బ్యానర్ పై దర్శకుడు సాయి మార్తాండ రూపొందించారు. '90s మిడిల్ క్లాస్ బయోపిక్' ఫేమ్ డైరెక్టర్ ఆదిత్య హాసన్ 'లిటిల్ హార్ట్స్' మూవీకి నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమాను నిర్మాతలు బన్నీ వాస్, వంశీ నందిపాటి థియేట్రికల్‌గా రిలీజ్ చేస్తున్నారు. 'లిటిల్ హార్ట్స్' సినిమా సెప్టెంబర్ 5న థియేటర్‌లో రిలీజ్ చేయబోతున్నారు. ఈ సినిమా సెప్టెంబర్ 12న రిలీజ్ కావావాల్సి ఉండగా..ఒక వారం ముందుగానే 5వ తేదీనే థియేటర్స్ లోకి తీసుకొస్తున్నారు. మౌళి తనూజ్, శివానీ నాగరం, రాజీవ్ కనకాల, ఎస్ ఎస్ కాంచి, అనిత చౌదరి, సత్య కృష్ణన్, తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం సాయి మార్తండ ప్రొడ్యూసర్ ఆదిత్య హాసన్, సంగీతం సింజిత్ యెర్రమల్లి, సినిమాటోగ్రఫీ సూర్య బాలాజీ, ఎడిటర్ శ్రీధర్ సొంపల్లి, ఆర్ట్ డైరెక్టర్ దివ్య పవన్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ వినోద్ నాగుల, మురళి పున్న.

## నేడు మదరాసి ఆడియో విడుదల

శివకార్తికేయన్ మోస్ట్ అవైటెడ్ యాక్షన్ ఎంటర్టైనర్ 'మదరాసి' . ఈ సినిమా ట్రైలర్, ఆడియో లాంచ్ ఆగస్టు 24న జరగనుందని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో ఈ సినిమా వస్తోంది. ట్రైలర్ పోస్టర్‌లో శివకార్తికేయన్‌తో పాటు విద్యూత్ జమ్వాల్, బిజు మెనన్, విక్రాంత్‌లను కూడా ఇంటెన్స్ లుక్‌లో ప్రజెంట్ చేశారు. ఇప్పటికే రిలీజ్ అయిన ఫస్ట్ సింగిల్ సెలవికా, లవ్ ఫెయిల్యూర్ ఆంథమ్‌గా మారి మంచి హిట్ సాధించింది. రుక్మిణి వసంత్ ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీలక్ష్మి మూవీస్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీని సుదీప్ ఎలామోన్ అందిస్తున్నారు. ఈ సినిమా సెప్టెంబర్ 5న థియేటర్ లలో రిలీజ్ కానుంది.



# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## యూరియా కొరత లేకుండా అన్నదాతలకు సరఫరా : ఏడిఏ రమాదేవి

ప్రజాపక్షం/షాద్‌నగర్: ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని అన్నదాతలకు యూరియా కొరత లేకుండా సరఫరా చేస్తున్నామని వ్యవసాయ శాఖ ఏడిఏ రమాదేవి వివరించారు. శనివారం ఫరూఖ్‌నగర్ వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న యూరియా కేంద్రాన్ని రమాదేవి, ఏఈ నిశాంత్‌కుమార్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడిఏ మాట్లాడుతూ షాద్‌నగర్ డివిజన్‌లకు అవసరం ఉన్న మేరకు యూరియా వస్తుందని, అదేస్థాయిలో రైతులకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. షాద్‌నగర్ డివిజన్‌లో ఉన్న అన్నదాతలే కాకుండా ఇతర డివిజన్‌ల నుండి అన్నదాతలు వస్తున్న నేపథ్యంలోనే స్థానికంగా కొరత ఏర్పడుతుందన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ సింగిల్ విండో కార్యాలయానికి 18మెట్రిక్ టన్నులు (432 బస్తాలు) యూరియా వచ్చిందని తెలిపారు. తనిఖీలో వ్యవసాయ విస్తరణ అధికారి తేజ్‌కుమార్, రాంబాబు, పాక్స్ సిఈఓ రఘునందన్ ఉన్నారు.

## గణేష్ నవరాత్రుల్లో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

బిజెఎంసి కమిషనర్ బి.శరత్ చంద్ర



ప్రజాపక్షం/గండిపేట: గణేష్ నవరాత్రుల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని బిజెఎంసి కమిషనర్ బి.శరత్ చంద్ర పలు శాఖల అధికారులను ఆదేశించారు.బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం కౌన్సిల్ హాల్ లో గణేష్ నవరాత్రి ఉత్సవాల పై కమిషనర్ శరత్ చంద్ర పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ హాల్లో జరిగిన సమీక్ష సమావేశంలో హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి,విద్యుత్, దేవాదాయ, రెవెన్యూ, పోలీస్, ట్రాఫిక్ పోలీస్ నీటిపారుదలశాఖ అధికారులతో గణేష్ నవరాత్రుల ఏర్పాట్లు, నిర్వహణపై జరిగిన సమీక్ష సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో పలు శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పార్కు స్థలం హైడ్రా స్వాధీనం



ప్రజాపక్షం/తుర్కయంజాల్: కొంతమంది అక్రమార్కులు పార్కు స్థలాన్ని కబ్జా చేయడంపై హైడ్రాకు అందిన ఫిర్యాదుల మేరకు పార్కు స్థలాన్ని హైడ్రా అధికారులు తన ఆధీనంలోకి తీసుకున్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి 21 వ వార్డు శ్రీ సూర్య సాయి నగర్ కాలనీలో సర్వే నెంబర్ 201 లోని 482 గజాల పార్క్ స్థలం అక్రమనకు గురి కావడంతో శనివారం హైడ్రా ఇన్స్పెక్టర్ తిరుమలేష్ తన సిబ్బందితో కలిసి కూల్చి వేశారు. 482 గజాల పార్క్ స్థలం హైడ్రా ఆధీనంలో తీసుకొని తుర్కయంజాల్ మున్సిపాలిటీకి సంబంధించిందని, మున్సిపల్ అధికారులకు అప్పజెప్పారు. వెంటనే మున్సిపల్ అధికారులు ప్రభుత్వ పార్క్ స్థలం బోర్డు ఏర్పాటు చేశారు. పార్క్ స్థలాన్ని కాపాడినందుకు శ్రీ సూర్య సాయి నగర్ కాలనీ వాసులు హైడ్రా అధికారులకు, మున్సిపల్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆదిభట్ల సీఐ రవికుమార్, ఎస్ఐ నోయల్ రాజ్, హైడ్రా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## బ్రహ్మకుమారీస్ సేవలు అభినందనీయం

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి




ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: రక్తదానం కంటే గొప్పదానం మరొకటి లేదని, సమాజ సేవ చేసేందుకు యువత ముందుకు రావాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని విజయ నగర్ కాలనీలో బ్రహ్మకుమారీస్ సమాజ సేవ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రక్తదానంతోపాటు సమాజానికి సేవ చేసే ఆలోచన బ్రహ్మకుమారీస్‌కు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మెన్ మదన్‌మోహన్‌రెడ్డి, బెజిగం రమేష్, నందకిశోర్, రెటికల్ నందీశ్వర్, యారం శేఖర్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, శ్రీకాంత్ గౌడ్, మురళి, మంచిరేవుల అశోక్, రమేష్ అగర్వాల్, మాచన్న చంద్రుడు, రామచందర్ చారి, శ్రీపాల్‌రెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

## జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులకు ఘన సన్మానం



ప్రజాపక్షం/యాచారం : యాచారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న నేనావత్ అలేఖ్య, అక్షితలు జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైన సంధర్భంగా వారిని శనివారం డిసిసి జిల్లా ప్రధాన కార్యదర్శి వుప్పల భాస్కర్‌గుప్త శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సంధర్భంగా భాస్కర్‌గుప్త మాట్లాడుతూ గ్రామీణా ప్రాంతానికి చెందిన అలేఖ్య గిరిజన కుటుంబంలో పుట్టి వాలిబాల్ క్రిడల్లో జాతీయ స్థాయికి ఎంపిక కావం ఎంతో హర్షిం చ దగ్గ విషయమని అన్నారు. మరో క్రిడాకారిణి అక్షిత పారా రాష్ట్ర స్థాయి అంథ్లేటిక్‌లో లాంగ్ జంపు, షాటు పుట్‌లో సిల్వర్ మెడల్ సాధించి జాతీయ స్థాయి అంథ్లేటింక్‌లో పాల్గోనడం పాఠశాలకే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో రెడ్డి వెంకట్‌రెడ్డి, రాజీరెడ్డి పాశం జయప్రకాశ్, తలారి వంశీ,చంద్రశేఖర్‌రెడ్డిలు ఉపాధ్యాయులు తదితరులు పాల్గోన్నారు.

## సిపిఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి



ప్రజాపక్షం/శంకర్‌పల్లి: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ పిలుపుమేరకు శనివారం వివిధ పాఠశాలలో నల్ల బ్యాడ్జీలు ధరించి సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. సిపిఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జంగయ్య శ్రీను నందు వెంకటేష్ భాగ్యలక్ష్మి సంధ్య రాజేందర్ బసవరాజ్ హరిశంకర్ భక్తప్ప కృష్ణయ్య జంగయ్య పాల్గొన్నారు.

# సురవరం మృతి కమ్యూనిస్టులకు తీరని లోటు

-సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



ప్రజాపక్షం/శంషాబాద్ : సిపిఐ అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపి సురవరం సుధాకర్ రెడ్డి మృతి కమ్యూనిస్టులకు తీరనిలోటు అని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. శనివారం శంషాబాద్ అంబేద్కర్ కూడలిలో సిపిఐ నాయకులతో కలిసి సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థి, యువజన ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించి, నల్లగొండ ఎంపి గా, సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ప్రజలకు సేవ చేసిన మహోన్నతుడని సురవరం అని కొనియాడారు. సుధాకర్‌రెడ్డి ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. నివాళులర్పించినవారిలో సిపిఐ రాష్ట్ర నాయకులు పుస్తకాల నర్సింగ్ రావు, పానుగంటి పర్వతాలు, ఓరుగంటి యాదయ్య, కే.రామస్వామి, ముద్దుల జంగయ్య, జిల్లా నాయకులు ప్రభులింగం, జైపాల్ రెడ్డి, యాదగిరి, కె.నరసింహారెడ్డి, ఎం.ఏ.రియాజ్, బిసి హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లాటి యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

**ఇబ్రహీంపట్నం :** సిపిఐ జాతీయ మాజీ కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర్‌రెడ్డి అకాల మృతికి శనివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం, మంచాల మండల కేంద్రాలలో సిపిఐ నాయకులు ఆయన చిత్ర పటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నతుడని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కావలి నర్సింహ్మ, ఎండి అలి మొద్దీన్, పి.నీలమ్మ, చంద్రకళ, రాములమ్మ, నర్ల శ్రీశైలం, కె.సురేష్, ఎస్.యాదగిరి, బాలయ్య, కె యాదయ్య,రాజునాయక్ కార్యకర్తలు పాల్గొన్నారు.

**శంకర్‌పల్లి:** సురవరం సుధాకర్‌రెడ్డి మరణం పార్టీకి తీరని లోటని సిపిఐ మొయినాబాద్ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు.. సిపిఐ మొయినాబాద్ మండల సమితి ఆధ్వర్యంలో సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా సిపిఐ కౌన్సిల్ సభ్యుడు మలగని సుధాకర్ గౌడ్, చేవెళ్ల పార్లమెంట్ జనరల్ సెక్రటరీ కాసుల సుభాన్ గౌడ్, ఎం.మోహన్‌రెడ్డి, ఎండి జలీల్, ఎం.వెంకటయ్య, ఎండి కాశీం, రాములు, ఎం.మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

**హయత్‌నగర్ :** సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని సిపిఐ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. సుధాకర్ రెడ్డి మరణం పట్ల శనివారం సిపిఐ హయత్‌నగర్ మండల సమితి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహ ప్రాంగణంలో సంతాప కార్యక్రమం నిర్వహించారు. సిపిఐ మండల కార్యదర్శి శేషరాజుపల్లి శ్రీదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి హాజరై సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శేఖర్ రెడ్డి మాట్లాడుతూ సుధాకర్ రెడ్డి ఉమ్మడి రాష్ట్ర సిపిఐ కార్యదర్శిగా, నల్లగొండ పార్లమెంటు సభ్యుడిగా, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్నత శిఖరాలను అధిరోహించారని కొనియాడారు. సుధాకర్‌రెడ్డి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమం లో సిపిఐ మండల సహాయ కార్యదర్శి కర్ణే సుజాత, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు బొంగు అరుణ్ కుమార్ గౌడ్, శాఖా కార్యదర్శులు సరిత, అరుణ, పారిజాత, యమున, సుమతి, జ్యోతి పాల్గొన్నారు.

**తుర్కయంజాల్:** సురవరం సుధాకర్ రెడ్డి పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని రంగారెడ్డి జిల్లా రైతు సంఘం అధ్యక్షులు కొంతం మాధవరెడ్డి అన్నారు. శనివారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి కోహెడ సురవరం కాలనీలో ఏర్పాటుచే సిన సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి కొంత మాధవరెడ్డి, ఉపాధ్యక్షులు చల్లా నారాయణరెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తుర్కయంజాల్ సిపిఐ కార్యదర్శి కె.నరేందర్‌గౌడ్, కోహెడ కార్యదర్శి రేఖ అండల, తొర్రురు కార్యదర్శి ఎం.బాలకృష్ణ, బ్రాహ్మణ పల్లి కార్యదర్శి ఎస్.జగన్, మోహన్ రెడ్డి, నాయకులు ఆవుల అంజమ్మ, నత్తి పద్మ, అంజమ్మ, ముజీబ్, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు










## రిజర్వేషన్ బిల్లుపై కేంద్రం నిర్లక్ష్యం

బిసిసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయ్య



ప్రజాపక్షం/షాద్‌నగర్: బిసి రిజర్వేషన్ బిల్లుపై కేంద్ర ప్రభుత్వం నాన్చుడు దోరణి అవలంభిస్తుందని బిసిసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయ్య ఆరోపించారు. శనివారం షాద్‌నగర్‌లో బిసిసేన రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సదర్ శ్రీనివాస్ అధ్యక్షత సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బర్క కృష్ణయ్య మాట్లాడుతూ బిసిలు ఐక్యంగా ఉండి పోరాడితే హక్కులను సాధించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆర్.కృష్ణయ్య బీసిల హక్కుల కోసం అనేక ఏళ్ల నుండి పోరాటాలు చేస్తున్నారని, వారి ఉద్యమాల ఫలితంగానే హాస్టల్ విద్యార్థులకు వసతులు వంటి అనేక ప్రయోజనాలు అందాయని గుర్తు చేశారు. రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సదర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 25న హైద్రాబాద్‌లో ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న దీక్షను విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో మేకల వెంకటేష్, జువ్వ సుధాకర్, కత్తి చంద్రశేఖర్ అప్ప, పాలాది శ్రీనివాస్, బాస వరలక్ష్మి, భూషణ్ నరేష్, జమాల్పూర్ చందులాల్, తంగేడిపల్లి శంకర్, భాగ్యలక్ష్మి గౌడ్, చీపిరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వరరావు



ప్రజాపక్షం/రంగారెడ్డి : ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టడంతోపాటు సోమవారం నుండి ఇంటింటికి జ్వరాల సర్వేను నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు వైద్య అధికారులను ఆదేశించారు. శనివారం రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం లోని సమావేశం మందిరంలో, వైద్య అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ ఆశావర్కర్లు, ఎఎన్ఎంలు ఇంటింటికి తిరిగి జ్వరాల సర్వే చేపట్టాలన్నారు. వైద్య అధికారులు, సిబ్బంది సమన్వయం చేసుకుంటూ ప్రజల ఆరోగ్యాలతో ముడిపడి ఉన్న శానిటేషన్ నిర్వహణలో నిర్లక్ష్యానికి తావు లేకుండా బాధ్యతగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి, గ్రామాలు, మున్సిపల్‌ల పరిధిలో పారిశుద్ధం పనులు, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండడానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఉండడానికి ఆయిల్ బాల్స్‌ను వాటర్ నిలిచి ఉన్నచోట వేయాలన్నారు. ట్యాంకులలో నిల్వ ఉన్న నీటి మొత్తాన్ని పారవేయాలన్నారు. ఓహెచ్‌యస్ఆర్ ట్యాంకులను బ్లీచింగ్, క్లోరినేషన్‌తో శుభ్రం చేసి కొత్త నీటిని నింపాలన్నారు. వైద్య సిబ్బంది మెడికల్ క్యాంపులు నిర్వహించి గ్రామాల్లో డెంగ్యూ మలేరియా, ఇతర సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు ప్రబలకుండా వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది, పంచాయతీరాజ్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి శుక్రవారం జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలలో, మున్సిపల్ పరిధిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించాలన్నారు పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్ఎంలో సమన్వయంతో పంచాయతీ మల్టీపర్పస్ సిబ్బందితో గ్రామంలో అవసరమైన పారిశుద్ధ్య పనులకు చర్యలు చేపట్టాలన్నారు. దోమల ద్వారా డెంగ్యూ చికెన్ గున్యా మలేరియా లాంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా అన్ని రిహ్యాబిటేషన్లలో ఫాగింగ్ చేపట్టాలని తెలిపారు. గ్రామాలలో పాఠశాలలో, అంగన్ వాడి కేంద్రాలలో పారిశుద్ధ్యం పనులు చేపట్టాలన్నారు. డ్రైనేజీలలో చెత్తాచెదారం పేరుకుపోకుండా శుభ్రం చేయించాలన్నారు. సమావేశంలో జిల్లా రోగ నిరోధకత అధికారి డాక్టర్ షికాహయత్, డాక్టర్ విజయ పూర్ణిమ, జిల్లా మాస్ మీడియా అధికారి కె.శ్రీనివాసులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## వరద ప్రభావ ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరిస్తాం

ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : హస్తినాపురం డివిజన్‌లోని వరద ప్రభావం ఉన్న కాలనీల సమస్యలకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని ఎల్‌బి నగర్ నియోజకవర్గ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం డివిజన్‌లోని ద్వారక నగర్ నందు ఎల్‌బి నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌తో కలిసి వరదనీటి డ్రైన్స్ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో వరద కాలువ నిర్మాణం చేపడితే కాలనీలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అధికారులు తెలియచేయడంతో అప్పట్లోనే నిధులు మంజూరు చేయడం జరిగిందని ఎంఎల్ఏ పేర్కొన్నారు. ఈ పనుల వలన కాలనీల్లో రోడ్లు పూర్తిగా ధ్వంసం కావడంతో వాటిని త్వరలోనే మరమత్తులు చేయాలని సంబంధిత జోనల్ కమిషనర్‌ను ఎంఎల్ఏ కోరారు. దీంతో అధికారులతో సమీక్ష నిర్వహించి పనులు త్వరగా పూర్తి చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో రమావత్ పద్మా శ్రీనివాస్ నాయక్, ఆందోజు సత్యం చారి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యావ్యవస్థ పటిష్టతకు కేంద్రం కృషి

ప్రజాపక్షం/కొందుర్గు: విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని బిజెపి మండల అధ్యక్షుడు చిట్టెం లక్ష్మీ కాంత్‌రెడ్డి వివరించారు. శనివారం కొందుర్గు మండల పరిధిలోని రామచంద్రాపూర్, పులుసుమామిడి, శ్రీరంగాపూర్, చిన్న ఎల్కిచర్ల, పర్వతాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను పల్లెకు పోదాం..పాఠశాలను చూద్దాం అనే కార్యక్రమంలో భాగంగా సందర్శించి విద్యార్థులకు బోధించే పాఠ్యాంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు వండిపెట్టే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా చిట్టెం లక్ష్మీ కాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సౌకర్యాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని వివరించారు. కొన్ని పాఠశాలలను మహిళా సమాఖ్య, గ్రామ పంచాయతీల్లో నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంటుందని పేర్కొన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి ప్రభుత్వానికి నివేధిక అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మంగన్నగారి బలవంత్‌రెడ్డి, గుండేటి శివారెడ్డి, కార్తీక్ యాదవ్, మల్లేష్, గణేష్‌రెడ్డి, రమేష్, వంశరాజ్‌లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఎల్‌బినగర్ బిఆర్ఎస్ నాయకుడు రఘువీర్‌రెడ్డి



ప్రజాపక్ష/హయత్ నగర్ : మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కొంత కాలంగా ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్ రెడ్డి, మన్సూరాబాద్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులపై నిరాధారమైన ఆరోపణలు చేసి పరువుకు భంగం కలిగిస్తున్నాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని ఎల్ బినగర్ బిఆర్ ఎస్ నాయకుడు డివిజన్ జక్కిడి రఘువీర్ రెడ్డి ఎల్ బి నగర్ సిఐకి పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కార్పొరేటర్ అవినీతికి పాల్పడుతూ గంజాయి బ్యాచ్‌ను వెంట వేసుకొని తిరుగుతూ ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తున్న కార్పొరేటర్‌పై కేసునమోదు చేసి అతడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రవి యాదవ్, ప్రతిక్ సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏడాదిలోగా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం పూర్తి

తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్

ప్రజాపక్షం/కొందుర్గు: పేదింటి విద్యార్థులకు కార్పోరేట్ స్థాయిలో విద్యను అందించాలన్న సంకల్పంతోనే ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్ వీర్లపల్లి శంకర్ వివరించారు. శనివారం కొందుర్గు మండల కేంద్రం సమీపంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయి పేద విద్యార్థులకు కార్పోరేట్ స్థాయి విద్యను అంధించాలన్న సంకల్పంతోనే ఈ పనులకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. ఎన్ని సమస్యలు ఎదురైనా ఏడాదిలోగా పాఠశాల భవన నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. నాలుగులైన్ల రహదారిని ఉమ్మడి మండలం కొందుర్గు నుండి షాద్‌నగర్ వరకు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అదే విధంగా నాలుగు విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు శంకుస్థాపన కార్యక్రమాలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో చేయించేందుకు సన్నాహాలు చేస్తున్నామని వివరించారు. ఎయిమ్స్ ఆసుపత్రి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నామని, అత్యాధునిక నిర్మాణ పనులతో స్టేడియం ఏర్పాటు చేస్తున్నామని కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, రాజు, జంగ నర్సింహులు, వీరేష్, మాజీ వైస్ ఎంపిపి మంగులాల్ నాయక్, అన్వర్, మహ్మద్ ఇబ్రహీం, బాల్‌రాజ్ గౌడ్, జితేందర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, ఉమ్మెంత్యాల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మహిళా సాధికారతకు ప్రభుత్వం సహకరిస్తుంది

**షాద్‌నగర్:** మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాల సహాకరిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ మైనార్టీ మహిళా శక్తి కార్యక్రమంలో తెలంగాణ క్రిష్టియన్ అల్ప సంఖ్యాక వర్గాల ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో క్రిష్టియన్ మహిళలకు కుట్ట మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సాధికారతకు పూర్తి స్థాయిలో సహాకరించేందుకు ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, మహ్మద్ ఇబ్రహీం, చెంది తిరుపతిరెడ్డి, లింగారెడ్డిగూడ అశోక్‌తోపాటు వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.



# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మున్సిపాలిటి పరిధిలోని ఓ కుంటలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు శనివారం పట్టుకుని సీజ్ చేశారు. రెవెన్యూ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న కుంటలో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని విశ్వసనీయ సమాచారంతో రెవెన్యూ ఆర్ఐ కవిత కుంటవద్దకు వెళ్లి మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని రెవెన్యూ కార్యాలయానికి తరలించారు. అనంతరం డిప్యూటి తహాశీల్దార్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేస్తున్నామని తెలిపారు. ఎవరైనా అక్రమంగా మట్టి తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



## వినాయక నిమజ్జనాలకు పకడ్బందీ ఏర్పాట్లు


### ఆర్‌టిఎ మెంబర్ జైపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** తూంకుంట మున్సిపల్ పరిధిలో వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని జిల్లా ఆర్‌టిఎ మెంబర్ జైపాల్‌రెడ్డి అన్నారు. తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నిమజ్జన సమీక్ష సమావేశానికి హజరైన జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ తూంకుంట, శామీర్‌పేట, ఉప్పర్‌పల్లి, పోతాయిపల్లి, దేవరయాంజాల్ చెరువుల వద్ద వినాయక నిమజ్జనాలకు సంబందిత శాఖల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్, డిఇ సునీత, మేడ్చల్ ట్రాఫిక్ సిఐ మధుసూదన్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రజా సమస్యలను తెలుసుకున్న కిషోర్ గౌడ్

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ని 15వ డివిజన్ లో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ శనివారం పర్యటించారు. డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. మంచినీటి, విద్యుత్, డ్రైనేజీ సమస్యలు లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు కొత్త కిషోర్ గౌడ్ సూచించారు. సూరజ్ నగర్ కాలనీ చౌరస్తాలో త్వరలోనే ఐమాక్స్ లైట్ ఏర్పాటు చేస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలు కాలనీల అధ్యక్ష, కార్యదర్శులు డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సిఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు వైద్యం

### టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** సిఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు కార్పోరేట్ స్థాయిలో వైద్యం అందుతుందని టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. శనివారం టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ నివాసంలో మూడుచింతలపల్లి మున్సిపాలిటి పొన్నాల్‌కు చెందిన బాదితురాలు బత్తిని వరమ్మకు రూ. 60 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి సహయ నిధి పథకాన్ని కొనసాగిస్తుందన్నారు. అనారోగ్యం బారిన పడిన ప్రతి ఒక్కరు సిఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ గడ్డం రమేష్, బత్తిని నర్సింగరావుగౌడ్, గడ్డం శ్రీనివాస్, బత్తిని పాండు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## అన్నదమ్ములకు ఘన సన్మానం..

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** పపంచ జానపద దినోత్సవ సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అనిల్ ఆర్ట్స్ క్రియేషన్ వారి ఆధ్వర్యంలో శనివారం రవీంద్ర భారతిలో జరిగిన కళాకారుల సన్మాన సభకు నవాబుపేట్ మండల పరిధిలోని అక్నాపూర్ గ్రామానికి చెందిన తలారీ ఆశీర్వాదం మరియు తలారీ ధాకన్న కు ఘనంగా సన్మానించారు. సాంకేతికత పరిజ్ఞానంతో అభివృద్ధి చెందుతున్న నేటి సమాజంలో కూడా మరుగున పడుతున్న జానపద కళలను కాపాడుతూ, యాక్షగానాలను ఆడుతూ ఆడిస్తూ ఎంతోమంది కళాకారులను తీర్చిదిద్ది కళలను కాపాడుతున్నందుకు ఆశీర్వాదం కు వారి తమ్ముడు జానపద కళల్లో ఒకటైనా యాక్షగానాలపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా అందుకున్న తలారి ధాకన్నా కు అన్నదమ్ములను ఇద్దరినీ తెలుగు యూనివర్సిటీ పెద్దలు సన్మానించి ఇరువురికి అభినందనలు తెలిపినారు.

## రోడ్ల మరమ్మతు పనులు చేపట్టాలి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** ఇటీవల కురిసిన భారీ వర్షాలతో గుంతలమయంగా మారిన రోడ్ల మరమ్మత్తు పనులను యుద్ధ ప్రాతిపదిక చేపట్టాలని మౌలాలి కార్పొరేటర్ సునీతా శేఖర్ యాదవ్ కోరారు. శనివారం ఆమె జిహెచ్ఎంసి ఈఈ లక్ష్మణ్‌ను కల్సి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని మిగతా డివిజన్ల కంటె తమ డివిజన్‌లో రోడ్లు పూర్తిగా పాడై పోయి ప్రమాదాలకు దారి తీసే విధంగా తయారయ్యాయన్నారు. త్వరలో ప్రారంభమయ్యే వినాయక ఉత్సవాలు, ఊరేగింపుల దృష్ట్యా ప్రత్యేక నిధులతో మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని కోరారు.

# సురవరం మృతి వామపక్ష ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరని లోటు

**వి.ఎస్.బోస్**







**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** సిపిఐ అగ్ర నేత, మాజీ పార్లమెంట్ సభ్యుడు కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి, మృతి వామపక్ష ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరని లోటని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్ అన్నారు. సిపిఐ ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఈసిఐఎల్‌లోని పార్టీ కార్యాలయం నీలం రాజశేఖరరెడ్డి భవన్ వద్ద సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ పార్టీ రాష్ట్ర 4వ మహాసభలు నగరంలో ముగించిన కొద్దిసేపటికే అనారోగ్యంతో చికిత్స పొందుతూ గచ్చిబౌలిలోని ఆస్పత్రిలో ఆయన తుదిశ్వాస విడిచిన సమాచారం తెలియటం పార్టీ వర్గాలకు తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా, దేశవ్యాప్త విద్యార్థి యువజన ఉద్యమాల వ్యాప్తి, సిపిఐ డిప్యూటి జనరల్ సెక్రటరీగా ఆయన పార్టీకి ఎనలేని సేవలందించట మే కాక పత్రికా సంపాదకుడిగానూ విశిష్ట సేవలందించారన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు జి.దామోదర్‌రెడ్డి, ఎఐవైఎవ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్ శంకర్ రావు, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్, సిపిఐ నియోజకవర్గ సభ్యులు లక్ష్మినారాయణ, మిరియాల సాయిలు, శ్రీనివాస్, స్వామిదాస్, రాజు, బంగారయ్య, యాకూబ్, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.









**జవహర్‌నగర్‌లో...** పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు దివంగత సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డెంటల్ కాలేజి భూపోరాటంలో ఆయన భాగస్వామ్యం ఉందని, విద్యార్థి నాయకుడిగా ఉద్యమ జీవితంలో ప్రవేశించిన ఆయన అంచెలంచెలుగా ఎదిగి సిపిఐ పార్టీకి ఎనలేని సేవలందించారన్నారు. గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి.స్వరూప నాయక్, గిరిప్రసాద్‌నగర్ మాజీ సహాయ కార్యదర్శి సురేష్, సిపిఐ నేతలు మంగలి కొండయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు..

**శ్రీశ్రీ నగర్ సిపిఐ కార్యాలయంలో** పార్టీ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి.కృష్ణ ఆధ్వర్యంలో సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పట్ల తీవ్ర సంతాపం తెలియ చేస్తూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పేద, బడుగు, మధ్య తరగతి ప్రజానీకం హక్కుల కోసం ఆయన చేసిన సేవలు ఆదర్శనీయమన్నారు. విద్యార్థి దశ నుండే ఆయన పోరాట పటిమ అద్వితీయమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.మనోచారి, రాజు గౌడ్, రాములు తదితరులు పాల్గొన్నారు. మేడిపల్లి మండలం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ ఇందిరానగర్ కాలనీ చౌరస్తాలో జరిగిన సుధాకర్‌రెడ్డి సంతాప సభలో సిపిఐ పార్టీ మేడిపల్లి కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డికి నివాళులర్పించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శులు సిహెచ్ మాధవి, జి.నాగరాజు, బిసి సంఘ జిల్లా అధ్యక్షులు బాపిరాజు, బిసి సంఘ జిల్లా నాయకులు కె.ప్రమీల, బికెఎంయు మండల అధ్యక్ష కార్యదర్శులు మహాలక్ష్మి, బి.ఐలయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి అన్వర్, మండల కౌన్సిల్ సభ్యులు నర్సమ్మ, ఇస్తారి, సోమరాజు, ఆండాలు తదితరులు పాల్గొన్నారు.

**వినాయకనగర్‌లో...**వినాయకనగర్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన సురవరం సుధాకరరెడ్డి సంతాప సభలో రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిహెచ్ దశరథ్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిచి సురవరం తుదిశ్వాస విడిచే వరకు పేద, మధ్య తరగతి, బడుగు వర్గాలు, కార్మిక, కర్షకుల సంక్షేమం కోసం పాటు పడ్డారన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కాసర్ల నాగరాజు, బి.యాదగిరి. కె.రాములు, ఆర్ గిరిజ, ఎం లింగం, కె.ప్రభాకర్, పి.సత్యనారాయణ, ఎస్‌కె అజీజ్, సయ్యద్ యూసూఫ్, కృష్ణ, ఎస్ ఖాసిం, ప్రజా కళాకారుడు వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

**బోడుప్పల్‌లో...** మేడిపల్లి మండలం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇందిరానగర్ కాలనీ చౌరస్తాలో సిపిఐ పార్టీ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో సిపిఐ పార్టీ అగ్రనేత కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మృతి పట్ల సిపిఐ నేతలు నివాళులు అర్పించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల కార్యదర్శి రచ్చ కిషన్ మాట్లాడుతూ, కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మరణం సిపిఐ పార్టీ నాయకులకు తీరని లోటు అని కామ్రేడ్ సుధాకర్ రెడ్డి సమాజంలో పేదలు, కార్మికులు, రైతులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల కోసం గట్టిగా పోరాడిన వారు. విద్యుత్ చార్జీలు పెంపు, రైతు సంక్షోభం, కార్మిక హక్కులు, వ్యక్తుల ఆర్థిక, సామాజిక హక్కుల రక్షణకు ఆయన అఖండ పోరాటం సాగించారు. ముఖ్యంగా, 21 ఏళ్లకు ఓటు హక్కు ఉండేది దేశంలో రెండు దశాబ్దాల పాటు ఆయన 18 ఏళ్లకు ఓటు హక్కు కల్పించే ఉద్యమంలో కీలకంగా నిలిచి యువజన రాజకీయ హక్కులకు గట్టిగా నిలిచారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు. మండల సహాయ కార్యదర్శిలు సిహెచ్ మాధవి, జి.నాగరాజు, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు బాపిరాజు, బీసీ సంఘం జిల్లా నాయకులు కె.ప్రమీల, బి కే ఎం యు మండల అధ్యక్ష కార్యదర్శులు కె.మహాలక్ష్మి, బి.ఐలయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి.అన్వర్, మండల కౌన్సిల్ సభ్యులు నర్సమ్మ, ఇస్తారి, సోమరాజు, పి ఆండాలు తదితరులు పాల్గొన్నారు.

**ఘట్‌కేసర్‌లో :** సిపిఐ అగ్రనేత సురవరం సుధాకర్ రెడ్డి రెండు సార్లు నల్లగొండ పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికయ్యారని దేశరాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన గొప్ప నాయకున్ని కోల్పోయామని సిపిఐ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్,ఏఐటియుసి నాయకులు కల్లూరి జయచంద్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం ఘట్‌కేసర్ మున్సిపల్ బస్టాండ్ ఆవరణలో సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి రెడ్ సెల్యూట్ చేస్తూ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కల్లూరి జయచంద్ర,లొట్టి ఈశ్వర్ మాట్లాడుతూ సుదాకర్ రెడ్డి జిల్లా నుంచి జాతీయ స్థాయినేతగా ఎదిగారని వామపక్ష ఉద్యమాలు ఎన్నో ప్రజా పోరాటాల్లో పాలు పంచుకున్నారని గుర్తు చేవారు. దేశ రాజకీయాల్లో పీడిత వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసిన తెలంగాణ మట్టి బిడ్డ సిపిఐ పార్టీ మాజీ జీతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డిని స్మరించుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో మంచల రామచందర్,సరిత,బాలకృష్ణ, రాంకుమార్,శివ, శరణ్, రామయ్య, టిల్లు తదితరులు పాల్గొన్నారు.

**తాండూరులో:** కమ్యూనిష్టు యోధుడు, ఆపారమైన మేదస్సుతో ఎన్నో పోరాటాల స్పూర్తి ప్రధాత సురవరం సుధాకర్‌రెడ్డి మరణం పార్టీకి తీరని లోటని సిపిఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మ పండిత్ జనార్దన్‌రెడ్డిలు ఓ ప్రకటనలో తమ విప్లవ వందనాలు తెలియజేశారు. పార్లమెంట్ సభ్యునిగా జాతీయ కార్యదర్శిగా ఎన్నో పోరాటాలు చేసిన సురవరం సుధాకర్‌రెడ్డి ఈ రోజు మన మధ్య లేక పోవడం చాలా భాదకరమని అన్నారు. వికారాబాద్ జిల్లాలో ఏఐఎస్ఎఫ్, సిపిఐ పార్టీ తరపున పోరాటాలు చేపట్టినప్పుడు తమ వెన్నంటూ ఉండి ధైర్యం చెప్పిన నాయకులు, ఎంతో హుందంగా రాజకీయాల్లో, తెలంగాణ ఉద్యమంలో ఒక దిక్సూచిగా నిలిచిన వారి పాత్ర మరువలేమన్నారు. చివరి వరకు ఎంత అనారోగ్యంగా ఉన్న పార్టీ కార్యక్రమాలకు హజరైన ప్రసంగించే వారని కొనియాడారు. వారి జీవితం కమ్యూనిష్టులకు గొప్ప స్పూర్తి, లేజెండ్ అన్నారు. తనను జిల్లా కార్యదర్శిగా ఆశీర్వదించారని గుర్తు చేశారు. ఈ రోజు ఒక కుటుంబ సభ్యున్ని, పెద్దదిక్కును కోల్పోయామని, వారి మరణం కమ్యూనిష్టుపార్టీకి, దేశానికే తీరని లోటుగా భావిస్తూ వారి తమ సంతాపాన్ని తెలియజేశారు.

**దుండిగల్‌లో:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి మాజీ పార్లమెంట్ సభ్యులు అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించినటువంటి కామ్రేడ్స్ సురవరం సుధాకర్ రెడ్డి అనారోగ్యంతో మరణించడం పార్టీకి తీరని లోటని ఒక గొప్ప మేధావిని పోరాట స్ఫూర్తిని ఇచ్చిన గొప్ప నాయకుడిని నేడు దేశం కోల్పోయిందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు ఎండీ యూసుఫ్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, రాష్ట్ర సమితి సభ్యులు ఏసురత్నం, కే.స్వామి లు నేడు సురారం సుధాకర్ రెడ్డి మీ చిత్రపటానికి జగద్గిరిగుట్ట కార్యాలయం వద్ద, షాపూర్ నగర్ కార్యాలయంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ హరినాథ్ రావు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు ప్రవీణ్, మాజీ సాయం కార్యదర్శి దుర్గయ్య, సిపిఐ నాయకులు నరసింహారెడ్డి, శాఖ కార్యదర్శులు ఏం సహదేవరెడ్డి, శ్రీనివాస్ చారి, కే వెంకటేష్, సీనియర్ జర్నలిస్ట్ డప్పు రామస్వామి, ప్రజానాట్యమండలి కార్యదర్శి బాబు, ఇమామ్, కృష్ణ,నరసింహ, జానకిరామ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

**దుండిగల్‌లో :** ఒక తరం నిరంతరం కమ్యూనిజం కోసం పోరాడిన వ్యక్తి కమ్యూనిస్టు పార్టీ యోధుడు మార్స్ ఇజాన్ని ఆవహించిన గొప్ప మేధావి మరణం కమ్యూనిస్ట్ పార్టీకి, వామపక్ష ఉద్యమాలకు తీరనిలోటు అని భారత కమ్యూనిస్ట్ పార్టీ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా వారు నిజాంపేట్‌లో వారి ఫొటోకు పువ్వులమాల వేసి ఘనంగా జోహార్లు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతు కమ్యూనిస్టు సూత్రాలని పటించిన అనుభవశాలి నేటి తరం యువతకు మార్గదర్శకుడు కామ్రేడ్ సుధాకర్ రెడ్డి అని అన్నారు. నీ మాట నేటి తరానికి ఒక తూట అని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా అలాగే సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి పని చేశారు అని అన్నారు. రెండుసార్లు ఉమ్మడి నల్గొండ ఎంపీగా చేసి నిరంతరం పేద ప్రజలకు కోసం సమసమాజ స్థాపన కోసం పోరాటం చేసిన యోధుడు సురవరం సుధాకర్ రెడ్డి మరణం కమ్యూనిజానికి తీరని లోటు అని అన్నారు. వారి ఆశయాసాధన కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని, విప్లవ వీరుడా అందుకో విప్లవ జోహార్లు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆశీ యాదయ్య, టి.దస్తగిరి, శ్రీను, తరుణ్, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.








**కొడంగల్‌లో:**సుప్రసిద్ధ కమ్యూనిస్టు యోధుడు సిపిఐ జాతీయ మాజీ ప్రదాన కార్యదర్శి, మాజీ పార్లమెంటీరియన్ సువరం సుధాకరరెడ్డి జోహార్ అంటు కొడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో శనివారం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గంటి సురేష్ సమక్షంలో ఆయన చిత్రపటానికి పూలా మాలాలు వేసి ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కమ్యూనిస్టు పార్టీలో ఉంటు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేసిన మహోన్నతమైన వ్యక్తి అంటు వారు చేసిన సేవలను కొనియాడారు. ఎఐఎస్ఎఫ్ సభ్యునిగా పని చేస్తు సీపీఐ జాతీయ ప్రదాన కార్యదర్శిగా కొనసాగారని, ఉత్తమ పార్లమెంటిరియన్‌గా పదవి భాధ్యతలతో ప్రజాపోరాటాల్లో పాలు పంచుకున్నారని గుర్తు చేసుకున్నారు.

సురవరం సుధాకరరెడ్డి తుది శ్వాస ఉన్నంత వరకు పేద ప్రజల కొసం పోరాడిన మహనీయుడన్నారు. సిపిఐ ఒక మహనీయుని కోల్పోవడం చాలా భాదాకరమన్నారు. చనిపోయిన తన భౌతికకాయాన్ని గాంధీ ఆసుప్రతికి దానం చేసి తన శరీరం కూడా విద్యార్థులకు ఉపయోగపడేందుకు ఇవ్వడం చాలా గోప్ప విషయమని అందుకు ఆయన ఆత్మకు శాంతి చూకూరాలని ప్రార్థించారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు ఎరన్‌పల్లి శ్రీనివాస్, సావిత్రమ్మ, హకీమ్, లాలయ్య, హాఫీజ్ , షాకీర్, తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

### రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్‌బాబు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** త్వరలో ప్రారంభమయ్యే గణేష్ ఉత్సవాల్లో ఎలాంటి అంవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఉండే విధంగా నిర్వాహకులతో సమన్వయం చేసుకొంటూ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్‌బాబు పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం కమిషనరేట్ కార్యాలయం నుండి పోలీసు అధికారులతో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో దిశానిర్దేశం చేసారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ తెలంగాణాలో ప్రతి ఏటా నిర్వహించే అతి పెద్ద ఉత్సవమైన గణేశ చవితి వేడుకల సందర్భంగా ప్రతిష్ఠించే గణేశ మండపాల్లో పూజలతో జరిగే వివిధ కార్యక్రమాలు, తుది దశగా జరిగే ర్యాలీలతో కూడిన నిమజ్జనోత్సవాలు పూర్తయ్యే వరకు ఎక్కడా ఎలాంటి అపశృతి చోటు చేసుకోకుండా ప్రణాళికాయుక్తంగా ముందుకెళ్లాలన్నారు.

తమ పరిధుల్లోని మండప నిర్వాహకులతో ముందుగానే సమావేశాలు నిర్వహిస్తూ జిహెచ్ఎంసి, విద్యుత్, నీటి పారుదల, వైద్య, రవాణా శాఖాధికారులతో సమన్వయంగా ప్రశాంతంగా జరిగేలా చూసుకోవాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యతనిస్తూ డయల్ 100 ద్వారా ఇతరత్రా కానీ సమాచారం రాగానే సత్వరమే స్పందించి అక్కడికి చేరుకొని సమస్యలేవైనా ఉంటే పరిష్కరించాలని కమిషనర్ సూచించారు. మండపాల్లో డిజె ఏర్పాటు నిషేధమన్న విషయం నిర్వాహకులతో చెప్పి అతిక్రమించకుండా చూసుకోవాలని, మండపాల్లో తోపులాటలు లేకుండా ఉండేందుకు సందర్శకులకు క్యూ లైన్లు, పార్కింగ్ సదుపాయాల ఏర్పాటులో వాలంటీర్లు ఉండటం, , షార్ట్ సర్క్యూట్ ద్వారా విద్యుత్ ప్రమాదాలు కలుగకుండా చూడాలన్నారు. శాంతి భద్రతలకు భంగం వాటిల్లే ప్రమాద సూచికలు కనపడితే తొలి దశలోనే అరికట్టే విధంగా అప్రమత్తంగా ఉండాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో బందోబస్తు పెంచటం, అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యేక పికెట్లు ఏర్పాటు చేయటం, సిసిటివిలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండటం, నిమజ్జన ర్యాలీలు ప్రశాంతంగా కొనసాగే విధంగా ట్రాఫిక్ సమస్య లేకుండా సరైన రూట్ మ్యాప్‌తో పూర్తయ్యేలా చూడాలన్నారు.





నిమజ్జనం చేసే చెరువులు, నీటి కుంటల వద్ద సరైన లైటింగ్ కోసం ఫ్లడ్ లైట్లు, వీధి దీపాలు, గజ ఈతగాళ్లు , అగ్ని మాపకదళ వాహనాలు, వైద్య సదుపాయాలు, మంచినీరు లాంటి మౌలిక సదుపాయాలు ఉండేలా సంబంధిత అధికారులతో కల్సి చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎస్‌బి విభాగ డిసిపి జి.నరసింహారెడ్డి, క్రైం విభాగ డిసిపి అరవిందబాబు, అడ్మిన్ విభాగ డిసిపి ఇందిరా, అడిషన్ డిసిపిలు, ఎసిపి తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించాలి : ఎస్‌పి

**ప్రజాపక్షం / వికారాబాద్ :** వికారాబాద్ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ . నేరాల నియంత్రణపై జిల్లా పోలీసులతో జిల్లా ఎస్‌పి నారాయనరెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలలో ఆత్మహత్యలపై ,రోడ్డు ప్రమాదాలపై పోక్సో,రేప్ కేసుల పట్ల అవగాహన కల్పించాలని అధికారులను అదేశించారు. ముఖ్యంగా ,పాఠశాలలకు వెళ్లి బాలికలకు గుడ్ టచ్ ,బ్యాడ్ టచ్ గురించి వివరించాలని సూచించారు. ఇది పిల్లలను లైంగిక నేరాల నుంచి రక్షించడానికి ఎంతోగానో ఉపయోగపడుతుందని తెలిపారు. అధికారులు తమ సిబ్బందితో నిరంతరం సమావేశాలు నిర్వహించుకొని పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంగతంగా పరిష్కరించాలని ఎస్‌పి సూచించారు. ఫిర్యాదునికున్యాం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏహెచ్‌టియు ,షీటిమ్స్ ,భరోసా సెంటర్ల సిబ్బంది పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించాలని అదేశించారు. డీఎస్పీ స్థాయి అధికారులు కమ్యూనిటీ కాంటాక్ ప్రోగ్రామ్స్ నిర్వహించాలని అన్నారు. జిల్లా ను గంజాయి డ్రక్స్ రహితంగా మార్చడానికి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని అదేశించారు. వినాయక ,నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో శాంతి యుతంగా జరిగేలా పటిష్టమైన బందోబాస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ అదేశించారు. ఉత్సవ మండలనాలు ,నిమజ్జన ఊరేగింపు మార్గల్లో అవాంచానీయ సంఘటనలు జరుగకుండా నిఘా పెంచాలని కోరారు. ఉత్సవాల్లో డిజేలు నిసేదించాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అదేశించారు.



# సురవరం స్మృతులు



విద్యార్థి యువజన నేతగా సోవియెట్ రష్యా పర్యటనలో...







యువజనోత్సవంలో భాగంగా అంతర్జాతీయ సదస్సులో ప్రసంగిసున్న సురవరం...




నేపాల్ పర్యటనలో....



బాల్యంలో సురవరం



పాలస్తీనా విమోచనోద్యమ నేత యాసర్ అరాఫత్‌తో...





లండన్‌లోని మాడమ్ తుస్సాడ్ మ్యూజియంలో ఐన్‌స్టీన్, ఫిడెల్ క్యాస్ట్రో మైనపు బొమ్మలతో..



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సిఎం వైఎస్‌ఆర్‌తో...



విద్యుత్ ఉద్యమంలో...




పార్లమెంట్ సభ్యుడిగా భారతదేశం తరపున ఐక్యరాజ్యసమితిలో ప్రసంగిస్తున్న దృశ్యం..



చైనా రాయబారితో..




ఢిల్లీలో జరిగిన పుస్తకావిష్కరణ సభలో సి.రాఘవాచారి, డి.రాజా, ఏచూరి, ప్రొ॥చలం, ఎ.బి.బర్ధన్, అబనిరాయ్‌లతో...




కార్మిక శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా..



సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి కేంద్ర మాజీ హోంమంత్రి ఇంద్రజిత్ గుప్తాతో...



పార్లమెంట్ ప్రాంగణంలో..



జంతర్ మంతర్‌లో ఎఐటియుసి ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న ఎంపి సురవరం



నిజాం కాలేజి బహిరంగ సభలో...

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com